www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

విప్లవ ధృవతార
కామ్రేడ్
భగత్‌సింగ్

(నేడు కామ్రేడ్ భగత్‌సింగ్
87వ వర్ధంతి సందర్భంగా) 4లో

కపిల్ చిట్స్ తోడుంటే
కనక మహాలక్ష్మి మీ వెంటే
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 66 | సంచిక : 270 | శుక్రవారం 23-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



దిగ్బంధం



విజయవాడలో జరిగిన ఏపీకి ప్రత్యేక హోదా రహదారుల దిగ్బంధంలో పాల్గొన్న రామకృష్ణ, మధు, శంకర్, కాశీనాథ్, పోతిన రామారావు, వైవీరావు, వెంకట మహేష్ తదితరులు

హోదా నిరసనతో వాహనాలు ఎక్కడికక్కడే


డప్పు కొడుతూ నిరసన తెలుపుతున్న నేతలు

నిరసన జ్వాలలో పాలుపంచుకున్న వైసీపీ, కాంగ్రెస్, జనసేన

మోడీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారు. ఢిల్లీకి సెగ తగిలేలా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. ప్రధాని దిగిరాక తప్పదు.. తప్పదు ....

\- రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలకు హోదా విషయంలో చిత్త శుద్ధే లేదు. కేంద్రం తక్షణం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి.

\- మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ఏపీకి ప్రత్యేక హోదా గర్జనతో రహదారులు దద్దరిల్లాయి. నిరసన హోరులో వాహనాలు స్తంభించాయి. మండుటెండలోనూ మేము సైతమంటూ ప్రజానీకం కదలివచ్చి ఉద్యమకారులకు వెన్నుదన్నుగా నిలిచాయి. రెండు గంటల పాటు సాగిన ఈ దిగ్బంధనం కేంద్రానికి ఓ హెచ్చరిక మాత్రమేనని ఇక జరగబోయేది సమరమేనని హోదా హామీల సాధన సమితి నేతలు భేరీ మోగించారు

విజయవాడ కనకదుర్గ వారిధి వద్ద స్తంభించిన ట్రాఫిక్


వివరాలు 11లో

లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ ?


సీబీఐ మాజీ జేడీ రాజకీయాల్లో చేరుతారని ప్రచారం



ముంబై : సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతి కోరుతూ మహారాష్ట్ర డీజీపీ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశారు. కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ 1990లో ఐపీఎస్‌కు మహారాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర ఏటీఎస్‌లో ఎస్పీ, డీఐజీగా, థానే సంయుక్త పోలీస్ కమిషనర్‌గా పని చేసి ప్రస్తుతం మహారాష్ట్ర అదనపు డీజీగా కొనసాగుతున్నారు. ఆయన కేంద్ర సర్వీసుల్లో ఉన్నప్పుడు సీబీఐ హైదరాబాద్ విభాగం డీఐజీ, సంయుక్త సంచాలకుడిగా పని చేశారు. సీబీఐ అధికారిగా వైసీపీ అధినేత జగన్ అక్రమాస్తులు, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఎమ్మార్, సత్యం కుంభకోణం, ఆజాద్ ఎన్‌కౌంటర్ వంటి కీలక కేసుల్లో దర్యాప్తు బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తిరిగి మహారాష్ట్రలో విధుల్లో చేరినప్పటికీ లక్ష్మీనారాయణ తరచుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను ఉత్తేజపరిచే ప్రసంగాలు చేస్తూ వస్తున్నారు. సుమారు ఏడేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ ఆయన ఐపీఎస్‌గా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఆయన రాజకీయాల్లో చేరుతారనే ప్రచారం కూడా జరుగుతోంది.

సీబీఐ విచారణకు సిద్ధమేనా..!

కేంద్ర సర్కార్‌కు బాబు సవాల్


ఎత్తిపోతల పథకాలను రైతులకు అందుబాటులోకి రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేసిందన్నారు. రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : తన మానస పుత్రిక పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో అవినీతి చోటు చేసుకుందంటూ బీజేపీ విమర్శలు చేయటంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. నాలుగేళ్ల పాటు తమతో కలిసి ప్రయాణం చేసిన వారికి అప్పట్లో కనిపించని అవినీతి ఇప్పుడెలా కనిపించిందని ప్రశ్నించారు. కాగ్ నివేదిక ఆధారంగా బీజేపీ విమర్శలు చేయటంపై ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆ విషయానికొస్తే కేంద్రంలోని బీజేపీ సర్కార్‌పైనా అనేక ఆరోపణలు వచ్చాయని, కొందరు కోర్టుకు కూడా వెళ్లారని, వాటిపైనా సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందా అని నిలదీశారు. అవినీతి పరులతో కలిసి కేసులు పెడతామని బెదిరిస్తే భయపడేవారెవ్వరూ లేరని ఆయన హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా ప్రపంచ జల దినోత్సవంపై ముఖ్యమంత్రి గురువారం మాట్లాడారు. ఆ సందర్భంగా పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో మట్టి తవ్వకాల్లో రూ.192 కోట్లు, బిల్లుల చెల్లింపులో మరో రూ.371 కోట్ల మేర అక్రమాలు జరిగాయని బీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు బీజేపీ తీరుపై సీరియస్ అయ్యారు. బీజేపీ, వైసీపీ, జనసేన కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కేవలం రాజకీయం కోసమే తప్పుడు ఆరోపణలు చేయటం శోచనీయమన్నారు. రాజకీయం, అభివృద్ధి వేర్వేరని, కానీ ప్రతిపక్షాలు రాజకీయం కోసమే పాకులాడటం సరికాదన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను రైతులకు అందుబాటులోకి రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేసిందన్నారు. రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం

- మిగతా 2 లో

గ్రాట్యుటీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ : కీలకమైన గ్రాట్యుటీ చెల్లింపు(సవరణ) బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. వేర్వేరు పార్టీల నిరసనల కారణంగా గత పక్షం రోజులుగా సభా కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. అయితే రాజ్యసభలో నిరసనల మధ్యే ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును కార్మిక మంత్రి సంతోష్ కుమార్ మూజువాణి ఓటు ద్వారా ఆమోదింప జేశారు. ఈ బిల్లును గత వారమే లోకసభ ఆమోదించగా గురువారం రాజ్యసభలోనూ ఆమోదించారు. రాష్ట్రపతి ఆమోదం త్వరాత ఈ బిల్లు చట్టరూపం దాల్చనుంది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులకు పన్ను రహిత గ్రాట్యుటీ ప్రస్తుతమున్న రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరుగుతుంది. అంతేకాక అమల్లో ఉన్న 12 వారాల ప్రసూతి సెలవులకు బదులుగా ఎప్పటికప్పుడు కార్య నిర్వాహక ఉత్తర్వు జారీ చేయడం ద్వారా వీటిని పెంచుకునే హక్కును ప్రభుత్వానికి కల్పించనుంది. 7వ వేతన సంఘ అమలు అనంతరం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ మొత్తం రూ.20 లక్షలకు పెరిగిన సంగతి తెలిసిందే.



సీపీఐ జాతీయ మహాసభల
తేదీల్లో మార్పు

ఏప్రిల్ 25వ తేదీకి బదులు 26న ప్రారంభం

న్యూఢిల్లీ : సీపీఐ జాతీయ మహాసభల తేదీల్లో స్వల్పమార్పు చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ 23వ మహాసభలు 2018, ఏప్రిల్ 25వ తేదీకి బదులుగా 26వతేదీన కేరళరాష్ట్రం కొల్లంలో ప్రారంభమవుతాయి. సాంప్రదాయ 'త్రిసూర్ పూరమ్' పండుగ కారణంగా ఈ మార్పు జరిగింది. అందువల్ల మహాసభలు 26వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. గతంలో నిర్ణయించినట్లుగానే 29వ తేదీ ముగుస్తాయి. ఈ మార్పు కారణంగా సభల సమయం మరింత పొడిగింపబడుతుంది. ఈ అసౌకర్యానికి విచారిస్తున్నాం. ఇది తప్పనిసరైంది. రిజర్వేషన్లు చేయించుకున్న ప్రతినిధులు యధావిధిగా ప్రయాణంచేయవచ్చు. వారికి 25వ తేదీనుండే భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. పార్టీ జాతీయ కార్యవర్గం, జాతీయ సమితి సమావేశాలు 24వ తేదీకి బదులుగా 25వ తేదీన కొల్లంలో జరుగుతాయి. జాతీయ సమితి సభ్యులకు 24వ తేదీ నుండే అన్ని వసతులూ కల్పిస్తారు. ఈ మార్పులను గమనించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఎస్సీ, ఎస్టీ చట్టం సమీక్షించాలి
సీపీఐ డిమాండు

12లో

ఇదీ లోకం!



సురేంద్రబాబుకు ఆర్టీసీ పగ్గాలు

- వారం క్రితమే డీజీపీ హోదా
- డీజీపీ హోదాలో హోంశాఖలో అనురాధ కొనసాగింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్‌వీ సురేంద్రబాబు ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా (వీసీ అండ్ ఎండీ) నియమితులయ్యారు. 1987 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సురేంద్రబాబు ఈ నెల 14వ తేదీనే పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హోదా పొందారు. గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అదనపు డీజీపీగా వ్యవహరిస్తున్న సురేంద్రబాబు పదోన్నతి అనంతరం ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జీఓఆర్‌టీ నంబర్ 671ను గురువారం విడుదల చేశారు. ఇప్పటి వరకు ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా ఉన్న డాక్టర్ ఎం మాలకొండయ్యను జనవరిలో ప్రభుత్వం పూర్తిస్థాయి డీజీపీగా నియమించింది. అప్పటి నుంచి ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా కూడా ఆయనే అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. వారం క్రితమే ప్రభుత్వం 1987 ఐపీఎస్ బ్యాచ్‌కి చందిన సురేంద్రబాబు, ఆయన భార్య, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధకు డీజీపీ హోదా కల్పించారు. అనురాధను డీజీపీ హోదాలోనే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగానే నియమించింది. అంతేగాకుండా విజిలెన్స్

- మిగతా 2 లో

కొత్తగా 16 రెవెన్యూ డివిజన్లు

ప్రజాభిప్రాయం తర్వాత తుది నిర్ణయం
ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి కేఈ కృష్ణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో కొత్తగా 16 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటుచేసే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోందని రెవిన్యూశాఖ, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. కొత్త రెవెన్యూ డివిజన్ల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం వెల్లడిస్తామని ఆయన సభకు హామీ ఇచ్చారు. కడపజిల్లా బద్వేలులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే టి జయరాములు సభలో కోరారు. రాజంపేట డివిజన్ బద్వేల్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే తూర్పుగోదావరిజిల్లా రాజోలులో కూడా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు చేసిన విజ్ఞప్తిపై మంత్రి కృష్ణమూర్తి స్పందించారు. పాతపట్నం(శ్రీకాకుళం), బొబ్బిలి, చీపురుపల్లి (విజయనగరం), చింతపల్లి, చోడవరం (విశాఖపట్నం), భీమవరం (పశ్చిమగోదావరి), నందిగామ (కృష్ణా), బాపట్ల (గుంటూరు), మార్టూరు, దర్శి (ప్రకాశం), శ్రీకాళహస్తి, కుప్పం(చిత్తూరు), బద్వేల్ (కడప), పత్తికొండ, ఆత్మకూరు (కర్నూలు), గుంతకల్ (అనంతపురం)లలో రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయన్నారు. వీటిని త్వరలోనే పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. అలాగే అనంతపురంజిల్లాలో రైతులకు పట్టాలు జారీ చేసే విషయమై అత్యవసర ప్రజాప్రాముఖ్యం కలిగిన విషయంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే వి హనుమంతరాయచౌదరి ప్రభుత్వం దృష్టికి

- మిగతా 2 లో

ఐదో రోజూ అదే హైడ్రామా..!
మరోసారి 32 సెకన్లకే లోక్‌సభ వాయిదా

2 లో

మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి....

9 లో



పెరూ అధ్యక్షుడి రాజీనామా

లిమా : పెరూ అధ్యక్షుడు పెడ్రొపాబ్లొకుజినిస్కి రాజీనామా చేశారు. ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసినట్లుగా వచ్చిన ఆరోపణలపై ఆయనను పార్లమెంటు అభిశంసించే అవకాశం ఉండటంతో ముందుగానే మేల్కొన్న కుజినిస్కి తన రాజీనామాను ప్రకటించారు. సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన పెరూలో అధ్యక్షుడిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయన వయస్సు 79 సంవత్సరాలు. గతంలో వాల్‌స్ట్రీట్ బ్యాంకర్‌గా ఉన్నారు. అమెరికా పౌరసత్వం కూడా ఉండేది. తనకు వ్యతిరేకంగా రాజకీయ వాతావరణం బలపడుతున్న నేపథ్యంలో రాజీనామా ప్రకటించిన అధ్యక్షుడు రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా అధికారం బదిలీ చేస్తానని ఆయన ప్రకటించారు. ఉపాధ్యక్షుడు మార్టిన్‌విజ్‌కర్రా మాట్లాడుతూ అధ్యక్షుడు తప్పు చేశాడన్న అభియోగాన్ని తిరస్కరించారు. పార్లమెంటులో మెజార్టీ కలిగిన ప్రతిపక్షం ఆరోపణలకు పూనుకున్నదని, ఐదేళ్లు పాలించకుండానే అధ్యక్షుడి రాజీనామాకు దారితీసిందని ఆయన అన్నారు. కుజినిస్కీ స్థానంలో మార్టిన్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే అవకాశంవుంది. ముందుగానే రికార్డుచేసిన వీడియో సందేశాన్ని ప్రజలకు విడుదల చేశారు. అధ్యక్ష భవనంనుంచి వైదొలగుతున్నట్టుగా ప్రకటించారు.

తన రాజీనామా దేశ ప్రజలకు మేలు చేస్తుందని భావించడంవల్ల ఈ చర్య తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. దేశ సమైకతకు, సామరస్యతకు భగ్నం కలిగించదలచుకోలేదని అన్నారు. నూతన అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించనున్న మార్టిన్ గతంలో కెనడా రాయబారిగా పనిచేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఫెడరల్ రిజర్వు వడ్డీరేటు పెంపు

వాషింగ్టన్ : అమెరికా సెంట్రల్ బ్యాంకు ఫెడరల్ రిజర్వు వడ్డీరేటును పావుశాతం (25 బేసిక్ పాయింట్లు) పెంచుతూ నిర్ణయం తీసు కుంది. ఈ ఏడాది మరో రెండుసార్లు వడ్డీరేటును పెంచే అవకాశం ఉన్నట్టు సూచనప్రాయంగా తెలిపింది. ఇటీవలకాలంలో ఆర్థికరంగం బలోపే తమైనందున వడ్డీరేటును పెంచినట్టు బ్యాంకు తెలియజేసింది. వడ్డీరేట్ల శ్రేణిని 1.5 శాతం నుంచి 1.7 శాతం వరకు నిర్ణయించినట్టుగా బ్యాంకు వెల్లడించింది. బ్యాంకు యాజమాన్యం రెండు రోజులపాటు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది, వచ్చే ఏడాది దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా వృద్ధిచెందుతుందని బ్యాంకు అధికారులు తెలియజేశారు. ఆర్థికరంగంలో వృద్ధి ఈ ఏడాది 2.7 శాతం, 2019లో 2.4 శాతం పెరగవచ్చునని గత ఏడాదికంటే ఇది అధికమని బ్యాంకు తెలిపింది. ద్రవ్యోల్బణం రేటు మొదట రెండు శాతంగా అంచనా వేసినప్పటికీ అది 2.1 శాతం ఉండవచ్చునని బ్యాంకు తెలిపింది. అలాగే ఈ ఏడాది నిరుద్యోగం 3.8 శాతం, వచ్చే ఏడాది 3.6 శాతం ఉండవచ్చు.

ఫ్రాన్స్‌లో ప్రభుత్వరంగ కార్మికుల సమ్మె

150 పట్టణాలు, నగరాలలో భారీ ప్రదర్శనలు



పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడుగా మధ్యేవాది అయిన ఇమాన్యుయేల్ మాక్రాన్‌కి మొదటిసారిగా ప్రభుత్వరంగ కార్మికులనుంచి తన సంస్కరణలకు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. దేశంలోని ప్రభుత్వరంగ కార్మికులు, సిబ్బంది సమ్మె చేస్తున్నారు. సమ్మె సందర్భంగా 150 పట్టణాలు నగరాలలో భారీ ప్రదర్శనలు జరిగాయి. గురువారం జరిగిన ఈ సమ్మె ముందుముందు మరింత ఉధృతం కానున్నదని తెలుస్తోంది. ప్రదర్శనల్లో రైళ్ల డ్రైవర్లు, టీచర్లు, నర్సులు, వైమానికరంగంలో ట్రాఫిక్ కంట్రోలర్లు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. కార్మికులు, సిబ్బంది అప్పులను హరించే విధంగా మాక్రాన్ ప్రభుత్వం సంస్కరణలను ప్రకటించింది. వీటికి వ్యతిరేకంగా కార్మికులు కన్నెర్ర చేశారు. అయితే ప్రభుత్వం తాను అనుకున్న కార్మిక వ్యతిరేక చట్టాలను చేయడంలో వెనుకాడటంలేదు. సమ్మె మూలంగా రైళ్లు రద్దయ్యాయి. స్కూళ్లు మూతపడ్డాయి. ఫ్రాన్స్‌నుంచి బయలుదేరవలసిన 30 శాతం విమానాలు రద్ద య్యాయి. ఫ్రాన్స్ ప్రభుత్వరంగంలో 54 లక్షలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు మాక్రాన్ పూనుకు న్నారని యూనియన్లు తీవ్రంగా విమర్శించాయి. కార్మికు లకు, సిబ్బందికి మంచి గుర్తింపును, వేతనాలను ఇస్తానని మాక్రాన్ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసి అధికారానికి వచ్చారు. అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ రంగానికి బడ్జెట్‌లో కోత విధించారు. ఎక్కువగా కాంట్రాక్టు కార్మికులపై ఆధారపడుతున్నారు. నైపుణ్య ఆధారిత వేతనాలను చెల్లిస్తున్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో 1,20,000 మంది ప్రభుత్వరంగ కార్మికులకు తొల గించేందుకు ప్రణాళిక రూపొం దించుకున్నారు. దీంతో దేశమం తటా అసంతృప్తి, ఆందోళన విస్తరించాయని యూనియన్ల నాయకుడు జీన్‌మార్క్ కానన్ అన్నారు. రైల్వే కార్మికులు తమ సమ్మెను జూన్ వరకు పొడిగించే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. ఫ్రాన్స్‌లో రైల్వే వ్యవస్థ చాలా విస్తృతమ య్యింది. ఏప్రిల్ 3వ తేదీనుంచి జూన్ 28 వరకు ప్రతి 5 రోజులకు రెండు రోజులు రైల్వే సమ్మె నిర్వహించాలని యూనియన్లు ప్రణాళిక రూపొందించుకున్నాయి.



ఆఫ్రికా ఖండంలో స్వేచ్ఛా వాణిజ్యం

ఒప్పందంపై 44 దేశాల సంతకాలు

కిగలి : ఆఫ్రికా ఖండంలో వాణిజ్యపరమైన నూతన పరిణామం చోటుచేసుకుంది. స్వేచ్ఛా వాణిజ్యానికి అంకురార్పణ జరిగింది. 44 దేశాలు స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశాయి. రువాండా రాజధాని కిగలిలో ఈ దేశాలన్నీ సమావేశమై చర్చలు జరిపి తుది ఒప్పందాన్ని రూపొందించాయి. ఆఫ్రికా, కాంటినెంటల్ ఫ్రీట్రేడ్ ఏరియా (ఎఎఫ్‌సిఎఫ్‌టిఎ) ఈ ఒప్పందాన్ని పిలుస్తారు. ఆఫ్రికన్ యూనియన్ అసెంబ్లీ 10వ అసాధారణ సమావేశంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. సంతకాలు చేసిన దేశాల్లో నైగర్, రువాండా, ఛాద్, అంగోలా, కెన్యా, ఇథియోపియా తదితర దేశాలు ఉన్నాయి. ఈ ఒప్పందాన్ని ఆయా దేశాల పార్లమెంట్లు చర్చించి తమ దేశీయ చట్టాలకు అనుగుణంగా మార్పులు చేసుకుని ఆమోదించిన తరువాత అమలులోకి వస్తుంది. ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ ఛైర్‌పర్సన్, రువాండా అధ్యక్షురాలు పాల్‌కగామి వ్యాఖ్యానించారు. ఆఫ్రికా దేశాల మధ్య మరింత సమైక్యతకు స్వేచ్ఛా వాణిజ్యం దోహదం చేస్తుందని ఆమె అన్నారు. ఒప్పందం అమలులోకి వచ్చిన తరువాత కొంతకాలం వరకు కొన్ని దేశాలు ప్రయోజనం పొందటం, మరికొన్ని దేశాలు నష్టపోవడం జరగవచ్చు. ఈ ఒప్పందంవల్ల ఆఫ్రికా ఖండమంతా ప్రయోజనం పొందుతుంది. 1980లో లాగోస్‌ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను అన్నిదేశాల అధినేతలు ఆమోదించారని, దానికి కొనసాగింపుగాను ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని పాల్‌కగామి వెల్లడించారు. 2012 జనవరిలో ఆఫ్రికల్ యూనియన్ అసెంబ్లీ 18వ సాధారణ సమావేశం ఈ ఒప్పందానికి బంధించిన నిర్ణయం చేసింది. 2915 నుంచి తుది ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి.

థాయ్‌లాండ్ బస్ ప్రమాదంలో 17 మంది మృతి



బాంకాక్ : థాయ్‌లాండ్ ఈశాన్య ప్రాంతంలో జరిగిన బస్సు ప్రమాదంలో 17 మంది చనిపోగా పలు డజన్లమంది గాయపడినట్టుగా ప్రభుత్వ అధికారులు గురువారం తెలియజేశారు. థాయ్‌లాండ్‌లో నఖోన్ రచసిమ రాష్ట్రంలో డబుల్‌డెక్కర్ బస్సు 50 మంది ప్రయాణీకులతో వెళు తుండగా బుధవారం సాయంత్రమే ప్రమాదం జరిగినట్టు అధికారులు వెల్లడించారు. సెలవు రోజు సందర్భంగా విహారయాత్రకు వెళ్లి ఇళ్లకు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 17 మంది చనిపోగా 33 మంది గాయపడినట్టు అధికారులు వెల్లడించారు. ఆ ప్రాంతంలో మెడికల్ ఎమర్జన్సీ ప్రకటించారని తెలుస్తోంది. గాయపడిన వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆసుపత్రివర్గాలు తెలిపాయి. బస్సు కొండపైనుంచి కిందకు దిగుతుండగా వాహనంపై డ్రైవర్ అదుపు కోల్పోవడంతో రోడ్డు పక్కకు దిగిపోయి బోల్తాపడింది. ఒక చెట్టును ఢీకొని బస్సంతా నుజ్జునుజ్జయింది. బస్సు రెండు భాగాలుగా విడిపోయినట్టు పోలీసువర్గాలు తెలిపాయి. బ్రేకులు ఫెయిలయినట్టుగా ఆ వర్గాలు పేర్కొన్నాయి. థాయ్‌లాండ్ రహదారులపై ప్రతి సంవత్సరం ఎక్కువగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఏడాదికి 24వేల మంది ప్రమాదంలో చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలియజేసింది. ప్రమాదాలలో సగానికిపైగా మోటారు సైకిళ్ల ప్రమాదాలే ఉన్నాయి.

బ్రిటన్‌లో మొజాంబిక్ హైకమిషనర్‌గా మహిళ

లండన్ : బ్రిటన్‌లో మొజాంబిక్ హైకమిషనర్‌గా మొదటిసారిగా మహిళ నియమితులయ్యారు. నినీఐవుజి - ఎమిని హైకమిషనర్‌గా మొజాంబిక్ ప్రభుత్వం నియమించింది. ఆమె విదేశాంగ కార్యాలయంలో 16 ఏళ్లు పనిచేశారు. రానున్న జులైలో ఆమె పదవీ బాధ్యతలను జోయన్నకుయన్స్‌బెర్గ్ నుంచి స్వీకరిస్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నియామకం తనను గౌరవించినట్టుగా, గర్వకారణంగా భావిస్తున్నానని ఇతరులకు స్ఫూర్తిగా వారి ఆంక్షలకు అనుగుణంగా పనిచేయగలనన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జాతులతో నిమిత్తం లేకుండా అలాగే ఏ నేపథ్యంలేని యువతలోగల నైపుణ్యాన్ని గుర్తించి వారికి స్ఫూర్తిగా నిలవగలనని ఆమె చెప్పారు. బ్రిటన్ మొజాంబిక్‌ల మధ్య బలమైన సంబంధాలను పెంపొందించగలనని ఆమె అన్నారు.

సురేంద్రబాబుకు ఆర్టీసీ పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)

అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇక కీలకమై ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ పోస్టును మాత్రం రాష్ట్రానికి చెందిన సురేంద్రబాబుకు కట్టబెట్టింది. ఆనవాయితీ ప్రకారం ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా పని చేసిన వారే డీజీపీగా నియమితులవుతూ వస్తున్నారు. వాస్తవానికి సురేంద్రబాబు కంటే ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్, విజయవాడ సీపీ డీ గౌతం సవాంగ్ సీనియర్లు. సీనియార్టీ ప్రకారం ఆర్‌పీ ఠాకూర్‌కు ఆర్టీసీ పగ్గాలను అప్పగించాల్సి ఉంది. సవరించిన పోలీసు చట్టం ప్రకారం డీజీపీ నియామకం ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. మొదటి నుంచి డీజీపీ పోస్టు కోసం ప్రయత్నించిన ఆర్‌పీ ఠాకూర్ ఇక తనకు పదవి రాదనే నిర్ణయానికి వచ్చేసి, కేంద్ర సర్వీసులకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సురేంద్రబాబుకు లైన్ క్లియర్ అయి ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా నియమితులయ్యారు. ప్రస్తుత డీజీపీ మాలకొండయ్య పదవీ విరమణ చేయటంతోనే సురేంద్రబాబును డీజీపీగా నియమించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

సురేంద్రబాబు గుంటూరు వారే

ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా నియమితులైన నిమ్మగడ్డ వెంకట సురేంద్రబాబు గుంటూరు జిల్లాకు చెందిన వారే. ఆ జిల్లాలోని దోనేపూడిలో ఆయన జన్మించారు. తండ్రి నిమ్మగడ్డ జనార్ధనరావు టీచర్‌గా పని చేశారు. సురేంద్రబాబు వరంగల్‌లోని నిట్‌లో ఇంజనీరింగ్ బీటెక్‌ను, ముంబైలోని ఎన్‌ఐటీఐఈ నుంచి ఎంటెక్‌ను పూర్తి చేశారు. 1987 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ఆయన పలు చోట్ల పని చేశారు. డీఐజీస్థాయిలో 2001 నుంచి 2004 వరకు విజయవాడ సీపీగా పని చేయగా, 2007లో ఐజీగా పదోన్నతి పొందారు. ఉమ్మడి రాష్ట్రంలో పలు హోదాలలో పని చేసిన ఆయన రాష్ట్ర విభజన తర్వాత గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అదనపు డీజీపీగా ఉంటూ పదోన్నతి పొందారు.

సీబీఐ విచారణకు సిద్ధమేనా..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టును అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. అందులో భాగంగానే ఏ1 నిందితుడు, వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పీఎంఓలోనే కూర్చుని రాజకీయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న తనను ఇరుకున పెట్టేందుకు అంతా ఒక్కటవుతున్నారని, ఇందుకు ప్రధాని నరేంద్ర మోడీ దొంగ, నేరస్తుడికి సహకరించటం ఆక్షేపణీయమన్నారు. నేరస్తులతో కలిసి కేసులు పెట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళతామని చెప్పారు.

వంద కాదు వెయ్యి ప్రశ్నలకైనా సిద్ధమే

ఇటీవల బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితుడైన రామ్ మాధవ్ వంద ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలంటూ చేసిన సవాల్‌ను సీఎం చంద్రబాబు స్వీకరించారు. వంద కాదు వెయ్యి ప్రశ్నలకైనా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు తనకు ముఖ్యమని, అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాకు అంగీకరించటం లేదని చెప్పటంతో ప్యాకేజీకి ఒప్పుకున్నట్లు చంద్రబాబు తెలిపారు. కానీ ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను కొనసాగించటంతోపాటు పారిశ్రామిక రాయితీలను ఇస్తున్నారని, వాటిని అమలు చేయమంటే పట్టించుకోలేదన్నారు. అలాగే చట్టంలో పేర్కొన్న వాటిని అమలు చేయమని కోరినా ఫలితం లేదన్నారు. నాలుగేళ్లలో ఏవీ అమలు చేయకపోవటంతో నిలదీయక తప్పలేదని చెప్పారు. అసలు ప్రత్యేక హోదా అంశంపై ఒక్కొక్కరు ఒక్కో మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

పోలవరం ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం

రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు వైసీపీతోపాటు బీజేపీ కుట్ర పన్నుతున్నాయని చంద్రబాబు ఆరోపించారు. నిర్దిష్ట కాలంలో పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలంటే రూ.42 వేల కోట్లను కేంద్రం విడుదల చేయాల్సి ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే 52 శాతం పనులు జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక దృష్టి సారించటం వల్లే ఈమేర పనులు జరిగాయని, దీనికంటే ముందు కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు అడుగు కూడా ముందుకుపడటలేదని తెలిపారు. ఇప్పటి వరకు రూ.13,201 కోట్ల విలువైన పనులు చేశామని, ఇందులో రూ.5,342 కోట్లను పోలవరం అథారిటీ విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి కేంద్రం నుంచి రూ.2,723 కోట్లు రావాల్సి ఉండగా, నాబార్డు ద్వారా విడుదలైన రూ.1,400 కోట్లు ఇంకా అందలేదన్నారు. కేంద్రం నుంచి సకాలంలో నిధులొస్తే 2019కల్లా ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు.

52 ప్రాజెక్టులు, 2 కోట్ల ఎకరాల సాగు లక్ష్యం

రాష్ట్రంలో ఈ ఏడాది 52 ప్రాజెక్టులను పూర్తి చేయటంతోపాటు రెండు కోట్ల ఎకరాలకు సాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఇందుకోసం ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. గాలేరు - నగరి, హంద్రీ - నీవా, పోలవరం, వెలుగొండతోపాటు ఇంకా అనేక రకాల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాల్లో గుండ్రేవుల ప్రాజెక్టుపై రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరగాల్సి ఉందన్నారు. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంతో రాయలసీమకు కూడా తాగు, సాగునీటిని అందజేస్తామన్నారు. నదుల అనుసంధానంతో మహా సంగమాన్ని ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ ఏడాది జూన్‌కల్లా ఐదారు ప్రాజెక్టులను, డిసెంబర్‌కు మరికొన్ని ప్రాజెక్టుల ద్వారా సాగుకు నీటిని అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులనూ ప్రారంభించనున్నట్లు చంద్రబాబు వివరించారు.

కొత్తగా16 రెవెన్యూ డివిజన్లు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చారు. దీనిపై మంత్రి కేఈ మాట్లాడుతూ పట్టాలను అందచేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

6719 అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు: మంత్రి పరిటాల సునీత

రాష్ట్రంలో 6,719 అంగన్‌వాడీ భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మహిళాభివృద్ధి,శిశుసంక్షేమశాఖమంత్రి పరిటాల సునీత తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా ఆమె పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. గర్భిణీలతోపాటు చిన్నారులకు ఈ కేంద్రాల్లో పాలు, గుడ్డు వంటి పౌష్టికాహారాలను అందచేస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చే విధంగా ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల శివప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకున్న ప్రాధాన్యం దృష్ట్యా సరిగా పనిచేసే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కేంద్రాలకు కనీసం రూ. 8 లక్షలు కేటాయించాలన్నారు. అన్ని శాఖలను ఈ నిర్మాణాల్లో భాగస్వామ్యం చేయడంవల్ల నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్న అభిప్రాయాన్ని కోడెల వ్యక్తం చేశారు.

ప్రతి జిల్లాలో శిల్పారామం: మంత్రి భూమా అఖిలప్రియ

ప్రతి జిల్లాలో శిల్పారామాన్ని ఏర్పాటు చేస్తామని పర్యాటకశాఖమంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. వీటి ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ జరుగుతోందన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, కడప, పులివెందుల, విశాఖపట్నం, పుట్టపర్తి, అనంతపురంలో శిల్పారామాలున్నాయన్నారు. వీటి ద్వారా 2017-18 సంవత్సరానికి రూ. 3.54 కోట్ల ఆదాయం లభించించినట్లు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాజధాని అమరావతిలో 50 ఎకరాల్లో శిల్పారామాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను సీఆర్‌డీఏకు అందచేసామన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నట్లు ఆమె చెప్పారు. ఆయా కళలకు సంబంధించిన శిక్షణా కేంద్రాలతోపాటు యాంఫీ థియేటర్, ఫుడ్‌కోర్టులు శిల్పారామాల్లో ఉంటాయన్నారు. గుంటూరులో రూ. 1.50 కోట్లు, విజయనగరంలో రూ. 1.93 కోట్లు, కాకినాడలో రూ. 2.30 కోట్ల వ్యయంతో వీటి నిర్మాణం చెపట్టామన్నారు. కాకినాడ శిల్పారామం ఈ ఏడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి రాగలన్నారు.

పంట ఉత్పత్తులన్నింటిని సేకరిస్తాం

మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై : వ్యవసాయదారులకు పూర్తి మద్దతు అందిస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం గురువారం హామీ ఇచ్చింది. రైతులు పండించిన పంట ఉత్పత్తులన్నింటిని సేకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపింది. శాసనమండలిలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి సుభాష్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఇప్పటి వరకు 12.69 లక్షల టన్నుల కందిపప్పు, 54 వేల టన్నుల పెసరపప్పు, 5.86 లక్షల టన్నుల నువ్వులను కొనుగోలు చేసిందన్నారు. సోయాబీన్‌కు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కన్నా మార్కెట్‌లో మరింత ధర వచ్చిందని, అందువల్ల 2.62 లక్షల టన్నుల తక్కువ సేకరణ ఉందని ఆయన వివరించారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ 'పంట ఉత్పత్తులన్నింటిని సేకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని తెలిపారు. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికార యంత్రాంగాలను ఆదేశాలు జారీ చేసినట్లు దేశ్‌ముఖ్ తెలిపారు.

బీజేపీ 'ఆపరేషన్ ద్రవిడ'

సినీ నటుడు శివాజీ



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : దక్షిణాది ప్రాంతాలలో ఉన్న రాష్ట్రాలను తన గుప్పిట్లో ఉంచుకుని అధికారం చెలాయించడానికి ఒక జాతీయ పార్టీ అండర్ గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టిందని సినీ నటుడు శివాజీ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని అవకాశాలను తనకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆ జాతీయ పార్టీ ఆపరేషన్ ద్రవిడ పేరుతో రంగంలోకి దిగిందన్నారు. ద్రవిడ అంటే ద్రవిడ దేశమని, అంటే దక్షిణ భారతం దీని టార్గెట్ అని చెప్పారు. ఏపీ తెలంగాణకు సంబంధించి గరుడ పేరుతో, కర్ణాటకలో ఆపరేషన్ కుమార్, తమిళనాడు, కేరళలో ఆపరేషన్ రావణ పేరుతో చేపట్టారన్నారు. వీటన్నింటిని కలిపే ద్రవిడ అని అన్నారు. ఒక అజ్ఞాత వ్యక్తి 2017 సెప్టెంబర్‌లోనే ఈ విషయాలను తెలిపారని వీటిని బహిర్గతం చేయడానికి ఒక సీనియర్ పాత్రికేయుడికి తెలిపినా ఆయన నమ్మలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అధికార పార్టీ తర్వాత మరొక పార్టీతో కలిపి మధ్యలో మరో నూతన వ్యక్తితో ఈ ఆపరేషన్‌ను చేస్తున్నారన్నారు. ఆ పార్టీ 2019 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికోసం రూ. 4,800 కోట్లను కేటాయించారని, అందులో కొంత ఇప్పటికే తరలించినట్టు తెలిపారు. ఈ ఆపరేషన్ పబ్లిక్ అవ్వడంతో వారి విధి విధానాలు మారవచ్చునే తప్పా వారి టార్గెట్ మాత్రం కొనసాగుతుందన్నారు. ఈ ఆపరేషన్‌కు సంధాన కర్తగా ఒక రాజ్యాంగశక్తి ఉన్నట్టు చెప్పారు. ఎవరైనా ఈ ఆపరేషన్‌లోకి రావడమే తప్ప బయటికి వెళ్లడం సాధ్యం కాదన్నారు. తనకు వచ్చిన సమాచారాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలనే ఈ విషయాలను బహిర్గతం చేస్తున్నానన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించేందుకు రాష్ట్ర ఎంపీలు గత నాలుగు రోజులుగా అవిశ్వాస తీర్మానంపై ఆందోళన చేస్తున్నారని అయితే వాటిని నిర్వీర్యం చేసేలా కేంద్రం శుక్రవారం ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు తనకు పక్కా సమాచారం అందిందన్నారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం ఆరుగురిని నియమించిందని అందులో ముగ్గురు ఇంగ్లీష్, ముగ్గురు హిందీలో తమ వాగ్ధాటితో మాట్లాడి మన ఎంపీలను నిజాలు చెప్పకుండా చేయబోతున్నారన్నారు. మనలో ఉన్న అనైక్యతను వాళ్లు బాగా వాడుకుంటున్నారన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధాలు కాని, అవసరాలు కాని లేవని రాష్ట్ర హక్కులను కాపాడి ప్రజలకు అందించడమే తన ముఖ్య ఉద్దేశమని శివాజీ పేర్కొన్నారు.

ఐదో రోజూ అదే హైడ్రామా..!

మరోసారి 32 సెకన్లకే లోక్‌సభ వాయిదా

రాజ్యసభలోనూ అదే తీరు



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : పార్లమెంట్ సాక్షిగా ఐదో రోజు కూడా వాయిదా డ్రామా రక్తికట్టించింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఏపీ ఎంపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బీజేపీ ప్రాయోజిత ఆందోళనల హోరులో కలిసిపోయింది. సభ సజావుగా లేదనే సాకుతో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ గురువారం కూడా సభను వాయిదా వేశారు. దీంతో వరుసగా ఐదు రోజులు ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే లోక్‌సభ వాయిదా పడినట్లయింది. గురువారం సభ ప్రారంభం కాగానే అన్నాడీఎంకే, టీఆర్ఎస్ పార్టీల ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులతో నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో కేవలం 30 సెకన్లకే సభ తొలుత 12 గంటల వరకు వాయిదా పడింది. అనంతరం 12 గంటలకు సభ మొదలుకాగా, కేంద్రం తరఫున మంత్రి అనంతకుమార్ హెగ్డే మాట్లాడుతూ తాము అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇతర అంశాలపై కూడా చర్చకు రెడీ అని చెప్పారు. అయితే సభలో ప్రతి ఒక్కరూ కూర్చోవాలని, స్పీకర్ వద్ద వెల్‌లో ఉన్న వారు వెనక్కి రావాలని, అప్పుడు మాత్రమే చర్చ సాధ్యం అవుతుందన్నారు. ఏ విషయంలోనూ కేంద్రం వెనక్కి వెళ్లబోదని స్పష్టం చేశారు. అయితే టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వరుస ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఓ మూడు నిమిషాలపాటు సాగిన సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో గ్రాట్యూటీ చెల్లింపుల బిల్లుకు ఆమోదం తెలపాలని, అందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఛైర్మన్ వెంకయ్యనాయుడు కోరారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ ఈ బిల్లును ప్రవేశపెట్టగా ఓటింగ్‌లో బిల్లు పాస్ అయింది. అంతలోనే టీడీపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే సభ్యులు తమ డిమాండ్లపై నిరసన తెలిపారు. ఛైర్మన్ ఎంత సర్దిచెప్పినప్పటికీ సభ్యులు వినలేదు. విపక్ష సభ్యులు నినాదాలు చేసుకుంటూ వెల్‌లోకి దూసుకువచ్చారు. దీంతో సభ సజావుగా జరిగేందుకు సభ్యులు సహకరించాలని వెంకయ్య నాయుడు కోరారు. మరో బిల్లు కూడా ఆమోదం పొందాలని, అందుకు సహకరించాలని, ఆ తరువాత అన్ని విషయాలను చర్చిస్తామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయెల్ కోరారు. అయినా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. దీంతో సభను వెంకయ్యనాయుడు సభను రేపటికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా సభకు విధిగా హాజరవుతున్న మోతీలాల్ వోరాను వెంకయ్యనాయుడు ప్రశంసించారు. ఆయన నుంచి యువ ఎంపీలు ఎంతో నేర్చుకోవాలన్నారు. సభను పదే పదే ఎందుకు వాయిదా వేస్తున్నారని దేశ ప్రజలు ప్రశ్నిస్తున్నారని, కానీ సభ్యుల్లో మార్పు రావటం లేదని వెంకయ్యనాయుడు అసహనం వ్యక్తం చేశారు.

ప్రత్యేక హోదా ఉద్యమకారులకు అభినందనలు: రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం గురువారం చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధన కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ఉద్యమకారులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలలో రహదారుల దిగ్బంధన కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. రాష్ట్రంలో ఒక్క బీజేపీ మినహా అన్ని పార్టీలూ ప్రత్యేక హోదా ఉద్యమానికి మద్దతు తెలిపాయన్నారు. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, జనసేన పార్టీలు ప్రత్యక్షంగా హైవేలపై జరిగిన రాస్తారోకో కార్యక్రమాల్లో పాల్గొన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్యమానికి మద్దతు పలికిన రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు, కర్నూలు, కాకినాడ, శ్రీకాకుళంలలో అరెస్టులకు పాల్పడడం విచారకరమన్నారు. అరెస్టులను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మచిలీపట్నంలో జరిగే కాగడాల ప్రదర్శనను ప్రజానీకం జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి తదుపరి కార్యాచరణను శుక్రవారం అఖిలపక్షాలు, ప్రజాసంఘాలతో సంప్రదించి ప్రకటిస్తామని రామకృష్ణ తెలిపారు.




ఏపీ టెట్‌లో విజయవాడ ప్రతిభా కోచింగ్ సెంటరు విద్యార్థి జ్యోతికి స్టేట్ ఫస్టు ర్యాంకు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత) పరీక్షలో నెల్లూరు జిల్లాకు చెందిన పెసల జ్యోతికి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. ఈమె టెట్ పేపర్-2 (సోషల్ స్టడీస్)లో 150 మార్కులకుగాను 133 మార్కులు (హాల్ టిక్కెట్టు నంబరు-1720615508414) సాధించారు. సోషల్ స్టడీస్ సబ్జెక్టులో టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు గురువారం విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటరులో డైరెక్టర్ జంపాన సుధాకర్ మీడియాకు వివరాల్ని వెల్లడించారు. జ్యోతి తమ సంస్థ నుంచి టెట్‌కు శిక్షణ తీసుకున్నారని చెప్పారు. టెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం తమ సంస్థకూ, ఆమె కుటుంబానికీ గర్వకారణమని స్పష్టం చేశారు. 2003లో ప్రతిభ కోచింగ్ సెంటరును స్థాపించామన్నారు. ఇప్పటివరకూ జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక టెట్ ర్యాంకులను, ఉపాధ్యాయ పోస్టులను సాధించామని పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితో రాబోయే డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించాలని కోరారు. టాప్ ర్యాంకర్ జ్యోతి మాట్లాడుతూ, తనకు టెట్‌లో స్టేట్ ఫస్టు ర్యాంకు రావడానికి ప్రతిభ కోచింగ్ సెంటరు ఇచ్చిన శిక్షణ, రోజువారీ పరీక్షలే ప్రేరణిచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కోచింగ్ సెంటరు ఇంగ్లీషు, మేథమేటిక్స్ అధ్యాపకులు ఎం.అనిల్‌కుమార్, న్యాయవాది వి.బ్రహ్మాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల దిగ్బంధంపై బీజేపీ ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు

- ఆగ్రహం వ్యక్తం చేసిన కత్తి నరసింహారెడ్డి
- నాపై కోపాన్ని పోలవరంపై చూపిస్తే ప్రజలు సహించరు
- సీబీఐ ఎంక్వయిరీ వేస్తే బీజేపీకి మరింత నష్టం

శాసనమండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విశాలాంధ్ర-అమరావతి : ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా గురువారం శాసన మండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతుండగా బీజేపీ ఎమ్మెల్సీ టీవీఎస్ మాధవ్ మాట్లాడిన మాటలపై ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

పోలవరం ప్రాజెక్ట్ వ్యవహారం, విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రజలు నేడు రోడ్లను దిగ్బంధం చేశారని, అందుకు అందరూ మద్దతు పలికారని చెప్పిన సమయంలో మాధవ్ అనవసరంగా రోడ్లను దిగ్బంధనం చేస్తున్నారని, ఆ కార్యక్రమాలకు మద్దతు పలకటం సమంజసం కాదనటంతో సభ్యులందరూ ఒక్కసారిగా ఆగ్రహంతో మాధవ్‌పై విరుచుకుపడ్డారు. సాక్షాత్తూ పార్లమెంట్ సాక్షిగా ప్రధాన మంత్రి ఇచ్చిన హామీలు, విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు అమలు చేయకుండా ఈ విధంగా వ్యాఖ్యానించటం సరికాదని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఎన్నికలు ఉన్నచోట ఒక విధంగా, లేని చోట మరో విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని, ప్రధాన మంత్రి కార్యాలయం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాల్సి ఉండాల్సి ఉందని, మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏపీ గురించి పట్టించుకోగా పోగా ఉద్యమానికి అండగా ఉన్నారని నిందించటం సబబు కాదు. మీరు ఏపీ వైపు మాట్లాడండి. అవకాశం ఉంటే కేంద్రం పెద్దలకు చెప్పి రాష్ట్రానికి మేలు చేయండి అంటూ మాధవ్‌కు హితబోధ చేశారు. జనాన్ని అవమానించవద్దని విఠపు బాలసుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు. అన్యాయంగా విభజన చేసింది కాక హామీలను అమలు చేయకుండా కేంద్రం అనుసరిస్తున్న వైఖరికి ప్రజల కడుపుకాలి రోడ్లపైకి వచ్చారని, ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కని, ఈ విషయంలో అందరం కలిసికట్టుగా ఉద్యమిద్దామని యండపల్లి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని మాధవ్‌ను ఉద్దేశించి బీజేపీ అన్న మాటకు నిలబడాలి. స్పెషల్ పర్పస్ వెహికల్ క్రింద నాగాలాండ్, త్రిపురకు ఏమి ఇచ్చారో అవి ఇప్పించండి, అందరం ఒప్పుకుంటాం. అంతే తప్ప పసలేని మాటలు మాట్లాడవద్దని స్పష్టం చేశారు. ఏపీకి అన్నీ చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. ప్రత్యేక హోదా అన్నారు. ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజి అన్నారు. 90:10 నిష్పత్తిలో అన్నీ చౌకగా ఇస్తామన్నారు. కానీ నాలుగేళ్లుగా ఇవ్వలేదు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక జీవో ఇచ్చి పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నారు. అదేమని అడిగితే బీహార్ గురించి మాట్లాడతారు. ఏపీలా బీహార్ విభజనకు గురికాలేదు. ఢిల్లీకి మించిన రాజధానిని కడతానని ప్రధాని మోడీ మాట ఇచ్చారు. రూ.2,500 కోట్లు ఇచ్చి అంతా ఇచ్చేశామంటున్నారు. లెక్కలు అడుగుతున్నారు. యూసీలు సమర్పించినా ఇవ్వలేదని ప్రచారం చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఓపికగా భరించాను. నీతి నిజాయతీగా ఎన్‌డీఏ నుండి బయటకు వచ్చి అవిశ్వాసాన్ని ప్రతిపాదించాను. 11 కేసుల్లో ఏ2గా ఉన్న విజయసాయిరెడ్డి నన్ను బోనులో పెడతానంటున్నాడు. నేను నా కుటుంబం అవినీతికి దూరం. విజయసాయిరెడ్డి పీఎంవోలో కూర్చుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. నేరస్తులు పీఎంవో ఆఫీసుకు కాపలాకాస్తారా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నిర్మాణంలో అవినీతి జరిగిందని నిందలు వేస్తున్నారు. దేశంలో పోలవరం మినహా ఏ ఒక్క ప్రాజెక్ట్ పనులు పురోగతిలో లేవు. కేంద్రం సకాలంలో డబ్బు ఇవ్వకపోయినా పనులు నడిచేలా చేస్తున్నాను. పోలవరం ల్యాండ్ ఎక్విజిషన్, ఆర్‌ఆర్ చెల్లింపులు తాము భరిస్తామని అన్నట్లు పవన్ కల్యాణ్ చెబుతున్నారు. నేను ఆ మాట అన్నానా. నిర్వాసితుల వ్యవహారమంతా కేంద్రమే చూసుకుంటుందని కేంద్ర మంత్రి గడ్కరీ గతంలోనే చెప్పారు. నా మీద ఉన్న కోపాన్ని పోలవరంపై చూపిస్తే ప్రజలు క్షమించరు. సీబీఐ ఎంక్వయిరీ వేస్తే ఇంకా నష్టపోతారని అన్నారు. శాసనమండలి ద్వారా విభజన హామీలు అమలు చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో 52 ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతి గురించి సభలో వివరించారు. నీటి సంరక్షణపై ప్రజలలో అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం చైర్మన్ ఎన్‌ఎండీ ఫరూక్, ముఖ్యమంత్రి, మంత్రులు, మండలి సభ్యులతో జల ప్రతిజ్ఞ చేయించారు.

నదుల అనుసంధానంతోనే అభివృద్ధి : ఎమ్మెల్సీ కత్తి

విశాలాంధ్ర-అమరావతి : నీరు చాలా ప్రధానం, నీరు ఉంటేనే పారిశ్రామిక అభివృద్ధి కూడా సాధ్యమౌతుందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలిలో నీటిపారుదలపై మాట్లాడుతూ, ఎక్కడైనా రాజధానులు అభివృద్ధి జరిగిందంటే నీటి లభ్యత వల్లనే సాధ్యమైందన్నారు. 2030 నాటికే 30 శాతం నీటి లోటును భారతదేశం ఎదుర్కొంటుందని కొన్ని నివేదికలు చెబుతున్నాయన్నారు. సాగునీటికి, తాగునీటికి రాష్ట్రంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాలలో వేసవి వస్తే నీటి కటకట తప్పడంలేదన్నారు. మన దేశంలో 1170 మిల్లీ మీటర్లు వర్షం పడుతుంటే కేవలం ఆరు శాతం మాత్రమే నిల్వ చేయగల్గుతున్నామన్నారు. మన రాష్ట్రంలో మూడు వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా పోతుందన్నారు. నదుల అనుసంధానం చేయాలనే ముఖ్యమంత్రి సంకల్పం సరైనదన్నారు. రాష్ట్రంలో నలభై నదులు అనుసంధానం చేయాలని గుర్తించారన్నారు. వాటన్నిటినీ అనుసంధానం చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.52 వేలు ఖర్చు అవుతుందని, దీని పూర్తి బాధ్యత కేంద్రమే తీసుకోవాలన్నారు. పట్టిసీమ ద్వారా 103 టీఎంసీలు నీటితో పంటలను కాపాడారన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన 52 ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

బి.సి. స్టడీ సర్కిల్స్ సిబ్బంది సర్వీసును రెగ్యులరైజ్ చేయాలి

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలోని బి.సి. స్టడీ సర్కిల్స్ లో 1995 నుండి ఇప్పటి వరకు గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, దినసరి వేతనాలతో పనిచేస్తున్న సిబ్బంది సర్వీస్ ను తక్షణమే రెగ్యులరైజేషన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎ.పి.బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేసారు. గురువారం అసెంబ్లీ లో బీసీ మంత్రి అచ్చెన్ననాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ క్రింద ప్రతి జిల్లాకు కేటాయించిన స్టడీ సర్కిల్స్ అద్దె భవనాలలో అరకొర సౌకర్యాలతో నిర్వహింపబడుతున్నాయని, ప్రతి జిల్లాలోని స్టడీ సర్కిల్స్ సొంత భవనాల ఏర్పాటుకు స్థలాలు నిర్దేశించి, నిర్మాణ నిధులను కేటాయించాలని మంత్రిని కోరారు. గతంలో ప్రభుత్వ బి, సి, స్టడీ సర్కిల్స్ ద్వారా మాత్రమే బి, సి. విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలన్నింటిని నిర్వహించేవారని ప్రస్తుతం సివిల్ సర్వీసెస్, గ్రూపు 1 , గ్రూపు 2 బ్యాంక్ క్లర్క్స్, ప్రొబేషనరీ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమాల నిర్వహణను ప్రైవేట్ సెంటర్లకు కేటాయించటం వలన, ప్రభుత్వ బి.సి, స్టడీ సర్కిల్స్ ద్వారా జరిగే శిక్షణా కార్యక్రమాలు తగ్గి, స్టడీ సర్కిల్స్ నామమాత్రంగా పనిచేస్తున్నాయని తెలిపారు.

కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 50 శాతం వేతనాలు పెంపు

విశాలాంధ్ర అమరావతి : ఐటిఐ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 50 శాతం వేతనాలు పెంపుకు ప్రభుత్వం అమోద ముద్ర వేశారు. పెరిగిన వేతనాలు సిబ్బందికి 1-04-2018 నుండి అమలు కానున్నాయని కార్మిక, ఉపాధి కల్పన శాఖా మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. దీని వలన రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో పనిచేస్తున్నఅసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ , ఆఫీస్ సబార్డినేట్స్ కాపలాదారులు మొత్తంగా 665 మంది సిబ్బందికి లబ్ధి చేకూరుతుందని మంత్రి తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన , కార్మికుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి పితాని సత్యనారాయణ పేర్కొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంపై 'సుప్రీం' పున:సమీక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎస్సీ,ఎస్టీ అత్యాచార, నిరోధక చట్టం (అట్రాసిటీ) దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు తీర్పును పున: సమీక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు కోరారు. ఈమేరకు గురువారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అలాగే అంటరానితనం, కులవివక్ష, దళిత మహిళలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. చట్టం ఉన్నప్పటికీ దాడులు ఆగలేదన్నారు. దాడికి కారణమైన వారితో అధికారులు, పాలకవర్గ పార్టీల నేతలు కుమ్మక్కై శిక్షలు పడకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇంకా దేశంలో దళితులను రెండవ తరగతి పౌరులుగానే చూస్తున్నారన్నారు. ఏదో ఒక కారణంతో సాంఘిక బహిష్కరణ విధిస్తున్నారని తెలిపారు. ఇన్ని జరుగుతున్నా కూడా కేసులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా గ్రామాల్లోని పెత్తందారులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 99 శాతం కేసులు శిక్షలు పడకుండా కొట్టివేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు దళితులలో అభద్రతను పెంచుతోందన్నారు. ఈ విషయమై అత్యున్నత న్యాయస్థానం ఆ తీర్పును పున:సమీక్షించి దళితులకు న్యాయం చేయాలని నేతలు కోరారు.

రాష్ట్రస్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్ర స్థాయి మీడియా అక్రిడిటేషన్ పునర్నిర్మాణ కమిటీని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ (సమాచార, పౌరసంబంధాలు) ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్ వెంకటేశ్వర్ జీవో జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా సమాచార, పౌర సంబంధాల కమిషనర్ వ్యవహరిస్తారు. సభ్యులను వివిధ జర్నలిస్టు సంఘాల నుంచి ఎంపిక చేశారు. ఏపీయూడబ్ల్యూజే నుంచి ఐవీ సుబ్బారావు, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నుంచి ఎ అమరయ్య, ఏపీ జర్నలిస్ట్ ఫోరం నుంచి సీహెచ్ కృష్ణాంజనేయులు, ఏపీ మీడియా ఫెడరేషన్ నుంచి పి ఢిల్లీ బాబు రెడ్డి, స్మాల్, మీడియం డైలీ న్యూస్ పేపర్ల సంఘం నుంచి కేఎస్ రంగసాయి, పెద్ద దినపత్రికల నుంచి ఎం మాధవ్, వాసుదేవ పత్రి, బాల వడపట్ల, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుంచి చందు జనార్థన్, నేమాని భాస్కర్, ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుంచి డి సుమన్‌రెడ్డి, ఆంధ్ర జర్నలిస్ట్స్ అసోసియేషన్ న్యూఢిల్లీ నుంచి ఎం రామకృష్ణలను నియమించారు. జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నుంచి సభ్యుని ఎంపికను రిజర్వ్‌లో ఉంచారు. అదేవిధంగా వివిధ జిల్లాలకు సంబంధించిన జిల్లా స్థాయి మీడియా అక్రిడిటేషన్ పునర్నిర్మాణ కమిటీలను కూడా ప్రభుత్వం ప్రకటించింది.

అక్రమాలపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆమోదించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పట్టిసీమ, పోలవరం అక్రమాలపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశించాలని మాజీ మంత్రి సి.రామచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం నిధుల లేమితో సతమతమవుతున్న రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడిందని పేర్కొన్నారు. పోలవరం పూర్తయ్యే వరకూ మూడేళ్లల్లో ప్రయోజనాల కోసం పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టిందని తెలిపారు. తక్షణమే పట్టిసీమ, పురుషోత్తం, పోలవరం ప్రాజెక్టులలో అవకతవకలపై దర్యాప్తునకు ఆదేశించాలని పేర్కొన్నారు.

బీమా వ్యాపారానికి వీడియోకాన్ గుడ్‌బై

ముంబై: సాధారణ బీమా వ్యాపారం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. అమెరికా సంస్థ లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ గ్రూపు భాగస్వామిగా ఉన్న న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో తమకు గల మొత్తం వాటాను డీపీ జిందాల్ గ్రూపుతో పాటు ఇనామ్ సెక్యూరిటీస్ సంస్థకు అమ్మేసినట్లు వీడియోకాన్ గ్రూపు మంగళవారం స్పష్టం చేసింది. దీంతో న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో డీపీ జిందాల్ 26 శాతం, ఇనామ్ సెక్యూరిటీస్ 25 శాతం వాటాను కలిగి ఉంటాయి. అయితే ఈ వాటాలను ఎంత మొత్తానికి అమ్మినదీ వీడియోకాన్ వెల్లడించలేదు. న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఇంతకుముందు 26 శాతం వాటాను కలిగివున్న లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ గ్రూపు గత డిసెంబర్‌లో దానిని 49 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం దేశంలో న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి 23 రాష్ట్రాల్లోని 58 నగరాల్లో 60 కార్యాలయాలు ఉన్నాయి.

మడకశిరలో పరిశ్రమలు పెట్టండి

- ఉపాధి కోసం బెంగళూరుకు వలసలు
- భూములు సేకరించినా, పరిహారం చెల్లించలేదు
- అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యే ఈరన్న

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాయలసీమలో తీవ్ర కరవు ప్రాంతమైన అనంతపురం జిల్లా మడకశిరలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమలు పెట్టాలని ఎమ్మెల్యే కె.ఈరన్న కోరారు. వర్షాలు లేక రైతులు పంటలు వేయలేక పోయారని, కుటుంబాలను పోషించుకునేందుకు ఉపాధి కోసం కర్నాటకలోని బెంగళూరుకు సుమారు 50 వేల మంది వలస పోయారని చెప్పారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా గురువారం ఆయన జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. మడకశిర ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు 1,600 ఎకరాలను రైతుల నుంచి సేకరించారని, కానీ ఇంత వరకు వారికి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. పరిశ్రమలు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూసిన జనం, తప్పనిసరి పరిస్థితుల్లో బెంగళూరుకు వలస పోతున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి మడకశిరలో పరిశ్రమలను ఏర్పాటు చేయటంతోపాటు రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆక్వారంగానికి కేంద్రంగా ఉన్న భీమవరంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పి.రామాంజనేయులు కోరారు. అనేక ప్రాంతాల నుంచి ఆక్వా రైతులు భీమవరం వచ్చి, తమ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు వీలుగా ప్రాసెసింగ్ చేయించుకుంటున్నట్లు ఆయన వివరించారు. అయితే తగినన్ని యూనిట్‌లు లేకపోవటంతో ఆలస్యం అవుతోందన్నారు. నర్సాపురం ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు మాట్లాడుతూ నల్లీ క్రేక్స్ పూడుకుపోవటం వల్ల మత్స్య సంపద నాశనమవుతోందని తెలిపారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణా కరకట్ట నుంచి మద్దూరు మీదుగా గన్నవరం ఎయిర్‌పోర్టు వరకు ఉన్న రోడ్డును, కాటూరు - నందమూరు రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు.

చర్చి ఫాదర్లకు గౌరవ వేతనం ఇవ్వండి : ఫిలిప్

నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్ సి.టోచర్ మాట్లాడుతూ మసీదులలో మాదిరిగానే చర్చిలలోనూ పేద మత గురువులకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. చాలా మంది పేద చర్చి ఫాదర్ల కుటుంబ పోషణ భారంగా తయారైందన్నారు. నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుమిల్లి శేషారావు మాట్లాడుతూ తాడిమళ్ల పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని, తక్షణమే కొత్త భవనాన్ని నిర్మించాలన్నారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత ప్రాతిపదికన భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ స్కూళ్లలో ఖాళీగా ఉన్న తరగతి గదులను అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లకు కేటాయించాలని సూచించారు. చింతలపూడి ఎమ్మెల్యే పీతల సుజాత మాట్లాడుతూ చింతలపూడిలోని 30 పడకల ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఆరు మండలాల్లోని ప్రజలకు ఈ ఆస్పత్రి వైద్య సేవలు అందిస్తుందన్నారు. అలాగే జంగారెడ్డిగూడెంలోని ఆస్పత్రిని కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఏపీ, తెలంగాణా జిల్లాల్లోని సుమారు 20 మండలాలకు కేంద్రాలుగా ఉన్న వీటిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయటంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు ఇచ్చే రుణాలపై వడ్డీ రాయితీని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ పట్టణానికి బైపాస్‌ను మంజూరు చేయాలన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటం వల్ల 30 శాతం పాడైనట్లు తెలిపారు.

ఉక్కు ఫ్యాక్టరీకి కడప అనుకూలమే

- కేంద్రం వద్ద సాధ్యాసాధ్యాల నివేదిక
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి సుజయ కృష్ణ రంగారావు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్ని విధాలుగా అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని ఉన్నాయని గనులు, భూగర్భశాఖమంత్రి వెంకట సుజయ కృష్ణ రంగారావు తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టం-2014లో కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. దీనిపై గతంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్‌ఏఐఎల్) రూపొందించిన నివేదిక సాధ్యం కాదని ఇచ్చిందన్నారు. అయితే రాష్ట్ర విజ్ఞప్తిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న మెకాన్ సంస్థ అందచేసిన ఆర్థిక పరమైన సాధ్యాసాధ్యతలపై నివేదికలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్న విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు సభాపూర్వకంగా తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు ఎం వెంకట మల్లికార్జునరెడ్డి, ఎస్వీ మోహనరెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అవసరమైతే కేంద్రంపై వత్తిడి తీసుకొచ్చి అయినా ఫ్యాక్టరీని సాధించుకోవాలన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. కడపతోపాటు అనంతపురం, చిత్తూరు, ప్రకాశంజిల్లాల్లో అపారమైన ఖనిజ నిక్షేపాలున్నాయని మెకాన్ సంస్థ గుర్తించిందన్నారు. సాధారణంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటే 30 ఏళ్లకు సరిపడినంతగా 3 మిలియన్ టన్నుల ముడిఖనిజ నిక్షేపాలు ఉండాలన్నారు. అయితే ఈ ప్రాంతంలో 4.5 మిలియన్ టన్నుల ఖనిజం ఉందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమయ్యే భూమితోపాటు విద్యుత్, నీరు, రైల్వే అనుసంధానత వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కేంద్రానికి గతంలోనే చెప్పామన్నారు. మెకాన్ సంస్థ అందచేసిన నివేదిక కేంద్రం వద్దే ఉందన్నారు. అయినప్పటికీ ఈ విషయమై కేంద్రం ఏవిధమైన సమాచారం ఇవ్వలేదని సభకు తెలిపారు. గత జనవరిలో టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగిందని, ఈ సారి జరిగే సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.



59 జూనియర్ కళా శాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు: మంత్రి గంటా

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 59 జూనియర్ కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు అందాయని మానవ వనరుల అభివృద్ధిశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేలు పి రమేష్‌బాబు, బి జయనాగేశ్వరరెడ్డి, గద్దె రామ్మోహన్, ఎం వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. సాధ్యమైన ప్రాంతాల్లో కళాశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3260 జూనియర్ కళాశాలలున్నాయని తెలిపారు. వీటిలో ప్రైవేటు కళాశాలలు 2,193, ప్రభుత్వ కళాశాలలు 450, ఎయిడెడ్ కళాశాలలు 124 ఉన్నాయన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి రూ. 500 కోట్లు: మంత్రి కాలవ శ్రీనివాసులు

రాష్ట్రంలో నిర్మాణాలు పూర్తికాకుండా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ. 500 కోట్లను కేటాయించినట్లు మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ పథకంలో రాష్ట్రంలో అల్పాదాయ వర్గాల కోసం 3.08 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా వివిధ కారణాల వల్ల మధ్యలోనే ఆగిపోయాయన్నారు. ప్రతి ఇంటికి రూ. 25వేల చొప్పున అందచేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

పీహెచ్‌సీల స్థాయి పెంపుపై కమిటీ: మంత్రి యనమల

రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)ల స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం కమిటీని నియమించినట్లు మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. దీనిపై కమిటీ అందచేసే సమగ్ర నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజారోగ్యాన్ని అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ సారి బడ్జెట్‌లో అదనంగా వెయ్యి కోట్లను కేటాయించినట్లు ఆయన వివరించారు.

గ్రామీణ గృహ నిర్మాణానికి 20.99 లక్షల మంది అర్హులు

ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి కాలవ శ్రీనివాసులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ గృహ నిర్మాణ పరంగా 20.99 లక్షల మంది అర్హులున్నారని గ్రామీణ గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏపీ శాసనసభ కార్యవిధాన కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 344వ నియమంలో భాగంగా గురువారం శాసనసభలో 'రాష్ట్రంలో గ్రామీణ గృహాలు' అంశంపై చర్చించేందుకు సభాపతి కోడెల శివప్రసాద్ అనుమతించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇళ్ల కోసం మొత్తం 31 లక్షల ధరఖాస్తులు అందాయని, వీటిలో 20.99 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. వాస్తవానికి ఏపీకి 5.85 లక్షల గృహాలను కేంద్రం కేటాయించాల్సి ఉండగా కేంద్రం కేవలం 1..23 లక్షలే మంజూరు చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఏటా 2 లక్షల ఇళ్లను మంజూరు చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో 6 లక్షల ఇళ్లను కేటాయించిందన్నారు. గృహ నిర్మాణ పరంగా 41.63 లక్షల ఇళ్లను జియో ట్యాగింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఇప్పటి వరకూ 33.72 లక్షల ఇళ్లను ట్యాగింగ్ చేసినట్లు వివరించారు. అలాగే 85 శాతం ఇళ్లను ఆధార్‌తో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి గాను గృహ నిర్మాణానికి రూ. 3,679.53 కోట్లను బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. గృహ నిర్మాణంలో ఆయా మొత్తాలను నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నేషనల్ పేమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. అయితే కొన్ని చోట్ల సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్న మాట వాస్తమేనన్నారు. తొలుత ఎమ్మెల్యేలు వి ప్రభాకరచౌదరి, ఉప్పులేటి కల్పన, బొండా ఉమామహేశ్వరరావు, కె మృణాళిని, ఎ అనందరావు గ్రామీణ గృహాలపై మాట్లాడారు. అదేవిధంగా స్వల్ప వ్యవధి ప్రశ్నగా 'కోవూరు సహకార చక్కెర కర్మాగారం తిరిగి తెరచుట' అంశంపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడగా మంత్రి అమరనాధరెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 సహకార చక్కెర కర్మాగారాల్లో 6 మూతపడ్డాయన్నారు. ఆయా కంపెనీలు చెరకు రైతులకు ఇంకా రూ. 7 కోట్ల వరకూ బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు. ఈసమస్యపై ప్రభుత్వం ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మూతబడిన ఫ్యాక్టరీలను ఏవిధంగా తెరిపించాలనే విషయమై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు.

సోము వీర్రాజుకు పయ్యావుల కౌంటర్

విశాలాంధ్ర అమరావతి: ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు టీడీపీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ కౌంటరిచ్చారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లిందే ముంపు మండలాల కోసమని, గతంలో రాజ్యసభలో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు మాట్లాడిన అంశాలను, తాము స్లిప్పుల ద్వారా పంపిన విషయం సోము వీర్రాజు తెలుసుకోవాలని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. నిన్నటి వరకు క్యాబినెట్లో ఉన్న బీజేపీ మంత్రి ప్రత్యక్ష సాక్షి. ముంపు మండలాలు ఏపీ లో కలపకపోతే చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళిందే ఏడు మండలాల గురించి మాట్లాడానికే అని గుర్తుచేశారు. మొదటినుంచి రాష్ట్రంలో నీటివనరులపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మీ అందరికి చెప్పి ముఖ్య మంత్రి పర్యటన ఖరారు చేసుకోరన్నారు. సీఎం చంద్రబాబు వల్లే రాయలసీమకు డ్రిప్ ఇరిగేషన్ పథకం చేపట్టామని పయ్యావుల అన్నారు.

సోమువీర్రాజు పై మంత్రి జవహర్ ఆగ్రహం ..

బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజుపై మంత్రి జవహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలిలో సోమువీర్రాజు మాట్లాడుతుండగా మంత్రి జవహర్ సమాధానం చెప్పే సమయంలో హెల్త్ మినిస్టర్ గారు నన్ను మాట్లాడనివ్వండి అంటూ మంత్రి జవహర్‌ని సోము సంభోదించారు. దీనిపై మంత్రి జవహర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెల్త్ మంత్రి రాజీనామా వెళ్లారు ..అయినప్పటికీ కావాలనే దళిత మంత్రినైనా నన్ను అవమాన పర్చే విధంగా మాట్లాడారు ..ఆ మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.

సంపాదకీయం

హైవే బంద్ సక్సెస్

ప్రత్యేక హోదా ఉద్యమం అగ్ని సెగలై రగులుతోంది. ప్రత్యేకహోదా సాధన సమితి పిలుపు మేరకు గురువారం నిర్వహించిన హైవే బంద్ విజయవంతమైంది. అన్ని రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో రోడ్లపై బైఠాయించారు. బీజేపీ చేసిన దగాతో కోపోద్రిక్తులైన ప్రజలు రోడ్లపైకొచ్చి తమ నిరసన ధ్వనులను వినిపిం చారు. మరోవైపు లోక్‌సభలో టీడీపీ, వైసీపీ ప్రవేశపెడు తున్న అవిశ్వాస తీర్మానాలను ఐదోరోజు కూడా చర్చకు రానీయ కుండా చేస్తున్న తీరు బీజేపీ దివాలాకోరుతనాన్ని వెల్లడిస్తోంది. ఏ పాలక పార్టీఅయినా తానిచ్చిన హామీలను అమలుచేయకుండా కుంటిసాకులు చెబుతుంటే సహజంగానే ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తుంది. అదే విధంగా పార్లమెంటులో సభ్యుల నుంచి అవిశ్వాసాన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని విపక్షాలు ప్రతిపాదించినప్పుడు దాన్ని ఎదుర్కొని సభ విశ్వాసం పొందడం పార్లమెంటరీ వ్యవస్థలో ప్రథమ బాధ్యత. ప్రజాస్వామ్యం గురించి, జాతి ఔన్నత్యం గురించి, నీతినిజాయతీల గురించి నిత్యం నీతి సూత్రాలు వల్లించే ప్రధాని మోడీకి ఆ విషయం తెలియనిదా? ఈశాన్యాన్ని చేజిక్కించుకున్నామని విర్రవీగుతున్న తరుణంలో ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవకుండానే బీజేపీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. ఆంధ్రప్రదేశ్‌కు హోదా అంశంపై బీజేపీ మిత్రపక్షం తెలుగుదేశం ఎన్డీఏ నుంచి వైదొలగింది. ఫెడరల్ ఫ్రంట్ అంటూ కేసీఆర్, మమత మంతనాలు.. వంటి పరిణామాలు చోటుచేసు కున్నాయి. పార్లమెం టులో దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. బహుశా బీజేపీకి పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం లేనట్లు ఉంది? చర్చకు, ప్రశ్నలకు జవాబు ఇచ్చే శక్తిని కూడా కోల్పోయినట్లు ఉంది? హోదాపై బీజేపీ కపట నాటకానికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఇస్తున్న అవిశ్వాస తీర్మానంపై చర్చను, పరీక్షను అన్నాడీఎంకేను అడ్డం పెట్టుకొని బీజేపీ గట్టెక్కే ప్రయత్నాలు చేస్తున్నది. నిజానికి అవిశ్వాస పరీక్షను ఎదుర్కొనడానికి బీజేపీ ఎందుకు వెనకాడాలి. వెల్‌లోకి దూసుకువస్తున్న పార్టీల సమస్యల్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదు? వారి కోరికలు సమంజసం కాకపోతే వెల్‌లోకి దూసుకువస్తున్న సభ్యులను సస్పెండ్ చేసి సభను సజావుగా జరిపే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అంటే సభ ప్రతిష్టంభనకు గురికావలనే ప్రభుత్వమే కోరుకుంటున్నదని స్పష్టమవుతోంది. అవిశ్వాస పరీక్ష ఎదురైతే తన సొంత పార్టీలోనే లుకలుకలు బయటపడతాయని భయం బీజేపీకి పట్టుకొంది. కావేరి జలాలపై బోర్డు ఏర్పాటుచేయాలని అన్నాడీఎంకే, రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. వీరి నిరసనల వల్ల అవిశ్వాసానికి మద్దతిచ్చే సభ్యుల సంఖ్యను లెక్కించడానికి వీలులేకుండా పోతుందంటూ ఐదు రోజులుగా ఈ నోటీసులను స్పీకర్ తోసిపుచ్చుతున్నారు. సభ సజావుగా సాగితేనే సభా కార్యకలాపాలు చేపట్టాలన్న స్పీకర్ నిర్ణయం అన్ని సందర్భాలకూ వర్తించాలి గదా! కానీ ఇటీవల ఆర్థిక బిల్లు ఆమోదం సమయంలో దాదాపు అన్ని విపక్ష పార్టీలూ ఆందోళనకు దిగి సభలో గందరగోళం నెలకొంది. అయినా సరే ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక బిల్లును స్పీకర్ మూజువాణి ఓటుతో ఆమోదించారు. అంతేకాదు, నాలుగేళ్ల కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించే బిల్లు చర్చకొచ్చినప్పుడు ఉభయ సభలు అస్సలు ఆర్డరులోనే లేవు. గందరగోళం మధ్యనే రాష్ట్రాన్ని చీల్చారు. అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అవిశ్వాస తీర్మానం అంశంపై ఇలా మాట్లాడడం దాని రెండు నాల్కల ధోరణిని, పలాయన వాదాన్ని చాటుతోంది. మరోవైపు విభజన హామీలతోపాటు అదనంగా ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేశామని బీజేపీ చెబుతోంది. ప్రత్యేక హోదా కాదు, కేంద్రంతో సఖ్యతతో ఉండి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రాష్ట్రానికి లబ్ధి చేకూరుస్తామని నిన్నటివరకూ తెలుగుదేశం పార్టీ ప్రచారం చేసింది. కానీ మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రానికి బీజేపీ అసలేమీ ఇవ్వలేదంటూ విమర్శలు చేస్తున్నది. నిజానికి బీజేపీ చెప్పేదే కరెక్టు అయితే, పార్లమెంటులో చర్చకు అనుమతించవచ్చు. దేశ ప్రజలకు నిజాలు వెల్లడించవచ్చు. కానీ తీర్మానానికి ఆమోదించి, చర్చ చేబడితే ఆంధ్రప్రదేశ్‌కు తాను చేసిన వంచన, ద్రోహం బయటపడతాయని బీజేపీ భయం. కాబట్టి ఈ నేపథ్యంలో ఎంపీల రాజీనామాల వల్లో, పార్లమెంటులో అవిశ్వాసం వల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఒనగూరేదేమీ లేదనీ, కేంద్రం తన తప్పు సరిదిద్దుకొనే ఆలోచనగానీ, అవకాశంగానీ లేదని తేటతెల్లమవుతోంది. మోడీ సర్కారు ఈ నాలుగేళ్లలో ఏ ఒక్క పని చేయలేకపోయింది, ఏ హామీని నెరవేర్చలేదు. అవినీతిని నిర్మూలిస్తున్నామనీ, నల్లధనాన్ని అరికడుతున్నామనీ, బ్లాక్ మార్కెటీర్ల ఆటకడుతామనీ, స్మార్ట్ సిటీలను నిర్మిస్తామనీ, భారత్‌ను స్వచ్ఛమయం చేస్తామనీ, మేక్ ఇన్ ఇండియాను అమలు చేస్తామని ఊదరగొడుతున్న మోడీ సర్కారు ఆచరణలో చేసిందేమీ లేదు. నోట్లరద్దుతో ప్రజలు పెద్ద ఎత్తున క్యూలో నిల్చోడం, పన్నులు కట్టలేక వ్యాపారులు కుదేలవడం, ధరలు పెరగడం, బ్యాంకులంటే భయం కలగడం, న్యాయవ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలూ కుంచించుకుపోవడం, మతభావ నల్ని రాజకీయాల్లోకి చొప్పించి ప్రజల మధ్య ద్వేషాలు పెంచడమే మోడీ సర్కారు సాధించింది. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను గానీ, రాష్ట్రాల అవసరాలనుగానీ పట్టించుకొనే స్వభావం మోడీ సర్కారు లేదని అర్థమవుతోంది. కాబట్టి మోడీ సర్కారు మెడలు వంచి ఆంధ్రులకు ఇచ్చిన హామీలను సాధించుకోవాలంటే ఉధృత ప్రజా పోరాటాలే ఏకైక మార్గం. ఈ క్రమంలోనే గురువారం రహదారుల దిగ్బంధనం కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా ప్రజలందరూ కదలివచ్చి విజయవంతం చేశారు. అయితే ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ కూడా ప్రజా పోరాటాల్లోకి కలిసి రావాలి. అప్పుడు రాష్ట్రమంతా ఏకతాటిపైకి వచ్చి పోరాట బావుటా ఎగరేసినట్లవుతుంది. సీపీఐ నేతృత్వంలో రామకృష్ణ చేపట్టిన ప్రత్యేక హోదా ఉద్యమమే నేడు రాష్ట్ర ప్రజలందర్నీ ఆ బరిలోకి తీసుకురావడానికి కారణమైందంటే అతిశయోక్తి కాదు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా కొనసాగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీనే నేడు ఈ పోరాటానికి జవం, జీవం అందించింది.

చురక

తెలుగు ఆత్మగౌరవం
తాకట్టై నలుగుతుంది
కేంద్ర పవర్ హారంలో
లాకట్టై మూలుగుతుంది

శ్రీవారిని మొక్కుకుంటే
చలిస్తుందా కేంద్రం
హామీల అమలు అలలా
ధ్వనిస్తుందా సంద్రం

– వేల్పుల నారాయణ

ఉత్తరాదిలో మోడీకి ఎదురుగాలి

సందర్భం

పతకమూరు దామోదర్ ప్రసాద్

ఉత్తర భారతంలో అతిపెద్ద హిందీ భాషా రాష్ట్రాలైన యుపి, బీహార్‌లలో 3 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ పరాజయం ఆ పార్టీ ప్రతిష్ట క్షీణిస్తున్నదనడానికి ప్రబల నిదర్శనం. యుపిలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, 5 సార్లు గెలిచిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రి కేశ ప్రసాద్ మౌర్య ప్రాతినిధ్యం వహించిన ఫూల్‌పూర్ స్థానాలలో అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు ప్రవీణ్ నిషద్, నాగేంద్ర ప్రతాప సింగ్‌లు ఘన విజయం సాధించడం ఆ పార్టీకి నూతనోత్తేజాన్ని కల్పించింది. 2 దశాబ్దాలుగా ప్రత్యర్థులుగా వున్న మాయావతి బిఎస్‌పి -అఖిలేష్ సమాజ్‌వాదీ పార్టీ ఈ ఉప ఎన్నికల్లో అవగాహనకు రావడం, నిషద్ పార్టీ, పీస్ పార్టీ, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఎన్‌సిపి, అజిత్‌సింగ్ ఆర్‌ఎల్‌డి పార్టీలు మద్దతు కూడగట్టడంతో అఖిలేష్ ప్రదర్శించిన "చాణక్యం"తో ఈ విజయం సాధ్యమైంది. ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రులుగా ఎంపికైన తర్వాత వారు ఖాళీ చేసిన లోక్‌సభ స్థానాల పలు ఎన్నికల్లో బీజేపీ ఓటమి కమల నాథులను కలవరపరిచింది. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ ఎదురు లేని అధి కారం చెలాయిస్తున్నా, యుపిలో కమలం పార్టీయే అధి కారంలో వున్నా 2 చోట్ల బిజెపి ఓడిపోవడం చూస్తే ఉత్తరాదిలో మోడీకి ఎదురుగాలి వీస్తోందనడానికి స్పష్టమైన నిదర్శనం. గోరఖ్‌పూర్ గోరఖ్‌నాథ్ మఠాధి పతి యోగి ఆదిత్యనాథ్ 5 దఫాలుగా సునాయాసంగా ఎంపిగా ఎన్నికవుతూ వచ్చారు. కుశ్వావో సామాజిక వర్గానికి చెందిన కేశవప్రసాద్ మౌర్య 2014 ఎన్నికల్లో ఫూల్‌పూర్ స్థానంలో 3 లక్షలకు పైగా మెజారిటీతో లోక్‌సభకు ఎన్నికైనారు.

అయితే 2017 లో 403 స్థానాలు గల యుపి శాసన సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడింట రెండు వంతులు 325 స్థానాలు గెలిచి, 48.7 శాతం ఓట్లు సాధించి అప్రతిహతంగా పురోగమించడంతో ఠాకూర్ సామాజిక వర్గానికి చెందిన యోగి ఆదిత్యనాథ్, కుశ్వావో బిసి వర్గానికి చెందిన కేశవ ప్రసాద్ మౌర్య తమ తమ లోక్ సభ స్థానాలకు రాజీనామా చేసి యుపి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులుగా పదవీ బాధ్యతలు చేపట్టారు. యుపి అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీకి 47 సీట్లు, 21.8 శాతం ఓట్లు, మాయావతి బహుజన సమాజ్ పార్టీకి 22.2 శాతం ఓట్లు, 19 సీట్లు వచ్చాయి. ఎస్‌పి, బిఎస్‌పిల ఓట్లు మొత్తం 40.8 శాతం అయినా బిజెపి కంటే తక్కువే. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యుపిలోని 80 లోక్‌సభ స్థానాలకు గాను బిజెపి స్వయంగా 71, మిత్రపక్షం అప్నాదళ్ 2, మొత్తం 73 సీట్లు గెలిచి 43.3 శాతం ఓట్లు సాధించగా, సమాజ్ వాది పార్టీ 5 సీట్లు, 22.2 శాతం ఓట్లు, బిఎస్‌పికి ఒక్క సీటు రాకున్నా 19.6 శాతం ఓట్లు, కాంగ్రెస్ 2 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.



బీహార్‌లో 2014 ఎన్నికల్లో గెలిచిన అరారయా లోక్‌సభ స్థానాన్ని, జెహ్నానాబాద్ అసెంబ్లీ స్థానాన్ని రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ భారీ మెజారిటీతో నిలుపు కోవడం ఆ రాష్ట్రంలో సామాజిక న్యాయ శక్తులు, పార్టీలు మళ్ళీ బలం పుంజుకుంటున్నాయనడానికి స్పష్టమైన నిదర్శనం. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ ఆర్‌జెడీ, కాంగ్రెస్, జితిన్‌రాంమాంజ్ హిందు స్తాన్ అవామీ మోర్చాలతో మహాకూటమిని కూర్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఆ తరువాత లాలూ ఆర్జేడీలో విభేదాలు తీవ్రం కావడంతో మళ్ళీ పాత నేస్తం బిజెపితో జట్టు కట్టి కమలంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచారు. అయితే మహాకూటమి తరుపున గెలిచిన నితీశ్ కుమార్ రాజకీయ అవకాశ వాదంతో కమలనాధులతో కలిసిపోవడాన్ని బీహార్ ప్రజలు హర్షించలేదని ఈ దప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అసెంబ్లీ స్థానాన్ని బిజెపి నిలుపు కోవడం వారికి కొంత ఊరట.

పశుదాణా అవినీతి కేసులో శిక్ష పడి అర్‌జేడీ అధినేత జైలులో వున్నా ఆయనకు మారీదు హేజస్వ ప్రసాద్ యాదవ్ అరారియా లోక్‌సభ, జెహనాబాద్ అసెంబ్లీ స్థానంలో పార్టీని విజయ పథంలో నడిపించ దంలో సఫలీకృతులయ్యారు. గతంలో బిజెపితో జట్టు కట్టిన బీహార్ మాజీ సిఎం జితిన్‌రాం మాంజీ ఇటీవల ఆర్‌జేడీ కూటమిలో చేరడంతో వారికి మహా దళితుల మద్దతు లభించినట్టైంది. పెద్ద హిందీ రాష్ట్రాలైన యుపి 80, బీహార్ 40 మొత్తం 120 లోక్‌సభ స్థానాల గెలు పోటములు 2019 ఎన్నికల్లో కేంద్రంలో మళ్ళీ అధికా రంలోకి వచ్చే పార్టీ కూటములను నిర్ణయిం చడంలో కీలకపాత్ర వహించనున్నాయి. 2017 నుండి ఇప్పటి వరకు జరిగిన అమృత్‌సర్, శ్రీనగర్, మలప్పు రం, గురుదాస్‌పూర్, అజ్మీర్, అల్వార్, కులబేరియా, గోరఖ్ పూర్, ఫూల్‌పూర్, అరారియా వంటి 10 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బిజెపి ఓటమిని బట్టి చూస్తే ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వం లోని ఎన్‌డీఏకి ముఖ్యంగా మోడీ – అమిత్‌షాల అహం కార పూరిత, నియంతృత్వ, నిర్లక్ష్య ధోరణికి, ప్రజా వ్యతిరేక పాలనపై ఆగ్రహం పెల్లుబుకు తోందనడానికి స్పష్టమైన సంకేతం. సొంత రాష్ట్రం గుజరాత్‌లో మాయో పాయాలతో స్వల్పమెజారిటీతో సాధించిన విజయం, ఇటీవల త్రిపురలో కేవలం 4155 ఓట్ల ఆధిక్యంతో 19 ఎక్కువ సీట్లు గెలిచి, వామపక్షాల కోటకు గండి గొట్టి అధికారంలోకి రావడం, నాగా లాండ్, మేఘాలయాల్లో మిత్రపక్షాలతో కలిసి సంకీంర్ణప్రభుత్వాలను ఏర్పర చడంతో తమకు ఎదురు లేదని కమలనాధులు అహం కరిస్తూ వచ్చారు. అదేగాక ఎన్‌డీ ఏలో భాగస్వాములైన శివసేన, తెలుగుదేశం వంటి మిత్ర పక్షాలను అవమానించడమే పనిగా పెట్టుకు న్నారు. సరైన చర్చ, నిర్దిష్ట కార్యాచరణ లేకుండా ఆంధ్రప్రదేశ్‌ను 2గా విభజించిన ఫలితంగా భారీ లోటును, రాజధాని నగర నిర్మాణం, పరిశ్రమల స్థాపన పోలవరం వంటి బహు ళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం వంటి ఎన్నో కీలక కర్తవ్యాలను నిర్వహించాల్సిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులివ్వకుండా కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్న మోడీ నిరంకుశ ధోరణికి నిరసనగా తెలుగుదేశం పార్టీ తాజాగా ఎన్‌డీఏ నుండి వైదొలగింది. ఎన్‌డీఏ భాగస్వామిగా వున్న బీహార్ రాష్ట్రీయ లోకసమతా పార్టీ కూడా రేపోమాపో ఎన్‌డీఏ నుండి వైదొలగనుంది. బీహార్ ఉప ఎన్నికల ఫలితాల నేపధ్యంలో లోక్ జనశక్తి పార్టీ అధినేత కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ దళిత ఎంపిలకు విందునిచ్చి తాజా పరిస్థితిని సమీక్షిం చడం యుపిఏ కన్వీనర్ సోనియా గాంధీ 20 మిత్ర పక్షాలతో సమావేశం కావడం చూస్తే దేశాలలో రాజకీయ వేడి రాజుకుని లోక్‌సభకు ముందే ఎన్నిక లొచ్చే పరిస్థితి రావచ్చునంటున్నారు. ఇప్పటికే మిత్ర పక్షం శివసేన దూరమైంది. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ బలం కేవలం 273. సాధారణ మెజారిటీకి ఒకటి మాత్రమే ఎక్కువ. తెలుగుదేశం, జగన్ వైఎస్‌ఆర్ పార్టీ లు ఎన్‌డీఏ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపధ్యంలో మిత్రపక్షాలు దూరమై, మరికొందరు బీజేపీ ఎంపిలు వ్యతిరేకంగా ఓటేస్తే మోడీ ప్రభుత్వ పతనం ఖాయం. త్రిపురలో బిజెపికి 43 శాతం ఓట్లు, 35 సీట్లు రాగా, లెఫ్ట్‌ఫ్రంట్‌కు 42.7 శాతం ఓట్లు, 16 సీట్లు వచ్చాయి. ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర వంటి వేర్పాటు వాద శక్తులతో జతకట్టినా ఓట్ల తేడా కేవలం 0.3 శాతమే. మేఘాలయలో 2 నాగాపూర్‌లో 12 సీట్లు మిత్ర పక్షాల పొత్తులో కమలం పార్టీ గెలిచింది. అస్సాంలో గణపరిషత్, బోడోపీపుల్స్ ఫ్రంట్ పొత్తులో బీజేపీకి అధికారంలోకి వచ్చింది. గోవా మణిపూర్‌లలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిచినా ధనం, పదవులు ఎరవేసి కమలం ప్రభుత్వాలను ఏర్పరిచింది. అరుణాచల్ ప్రదేశ్‌లో టోకుగా ఎంఎల్‌ఏలనుకొని కమలం పార్టీ ప్రభుత్వాన్నేర్పరచింది. తాజాగా మహా రాష్ట్రలో కాంగ్రెస్ – ఎన్‌సిపిలు చేరువై వచ్చే ఎన్నికల్లో సమైక్యంగా పోటీ చేసే యోచనలో వున్నాయి. కర్ణాట కలో బీజేపీ గెలవడం అంత సులువు కాదు. ఎన్‌డీఏ నుండి వైదొలగినా తెలుగుదేశంలో వామపక్షాలు పొత్తు పెట్టుకుంటే మెరుగైన ఫలితాలు రావచ్చు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లలో అధికారంలో వున్న బీజేపీపై అసంతృప్తి రేగుతున్నట్లు దేశ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలలో స్పష్టమైంది.

పెద్ద నోట్ల రద్దు, తగు ఏర్పాట్లు లేకుండా జీఎస్‌టి అమలు, బ్యాంకుల మొండి బాకీలు రూ. 10 లక్షల కోట్లకు చేరడం, వేల కోట్ల రుణాలు తీసుకున్న ఆర్థిక నేరస్తులు విదేశాలకు పారిపోయినా మోడీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఖాతాదార్లపై బ్యాంకులు కనీస బ్యాలెన్స్ పేరిట బారీ జరిమానాలు వేయడం, ఉద్యోగ, ఉపాధి కల్పనలో, గ్రామీణ దుస్థితి తొలగింపు, పంటలకు గిట్టుబాటు ధరల కల్పనలో విఫలమైన మోడీ సర్కారుపై దేశమంతటా "ఎదురుగాలి" వీస్తోంది.

ఈ జనాగ్రహం ప్రభంజనమైతే మోడీ ప్రభుత్వానికి ముందుంది ముసళ్ళపండగ.

– వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు
– 9440990381

మంచినీళ్లు తేవడం కోసం ప్రపంచవ్యాప్తంగా మహిళలు, పిల్లలు అందరూ కలిసి రోజూ వెచ్చిస్తున్న సమయం ఎంత? ఆ మొత్తాన్ని కలిపితే– దాదాపు 20 కోట్ల పని గంటలు అంటే 22 వేల ఎనిమిది వందల సంవత్సరాలని 'యునిసెఫ్' ఇటీవలి అంచనా! ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 120 కోట్ల మందికి మంచినీరు అందుబాటులో లేదని స్వచ్ఛమైన తాగునీటికి కటకటలాడుతున్న భారతీయుల సంఖ్య ఆరు కోట్ల 31 లక్షలని అంతర్జాతీయ అధ్యయనాలు ఘోషిస్తున్నాయి.

నీటి ఎద్దడి

ఎండాకాలం అంటే దుర్భర దాహార్తితో కోట్లాది గొంతులు ఎండే కాలం. ప్రాణాధారమైన నీటికోసం అలమటిస్తున్న కోట్లాది జనం ఆక్రోశంతో గుండెలు మండే కాలం. ఏటా తప్పని పీడలా రాపాడుతున్న నీటి కరవు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలనూ నిరుటికంటే ఎక్కువగా ఇక్కట్లపాలు చెయ్యనుందన్న ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సగటున 14 మీటర్ల మేర భూగర్భజలాలు పడిపోయినట్లు గణాంకాలు చాటుతున్నాయి. పర్యవసానంగా రాయలసీమతో పాటు వేలాది పల్లెపట్టుల్లో మంచినీటి కటకట ముమ్మరించనుంది. తెలంగాణలో భూగర్భ జలమట్టాలు వేగంగా అడుగంటి అనునిత్యం వందలకొద్దీ బోర్లు వట్టిపోతున్నాయి. 20 మీటర్ల దిగువకు భూగర్భ జలమట్టాలు పడిపోయిన పదులకొద్దీ మండలాల్లో పరిస్థితి దారుణంగా మారింది. కృష్ణా, గోదావరి, పెన్నా లాంటి పెద్దనదుల్లోనూ నీటి జాలు సన్నగిల్లింది. ఇక పదుల సంఖ్యలో ఉన్న చిన్న నదులు దాదాపు వట్టిపోయాయి.



విచ్చలవిడిగా వృక్షాల నరికివేత సహా యథేచ్ఛగా సాగిన పర్యావరణ విధ్వంసంతో రుతువులు గతి తప్పి పెను సామాజిక ఉత్పాతాలకు కారణభూతమవుతున్నది. ఇంకా ఏప్రిల్ నెల రాకుండానే రాష్ట్రాలవారీగా జలాశయాలు అడుగంటి, అసంఖ్యాక పేదల గొంతెండుతున్న దృశ్యాలు మరెందరికో మంచినీరు ఎండమావి అయిందన్న యథార్థాన్ని చాటుతున్నాయి. దీటైన ప్రణాళికలతో సత్వరం దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, నీటికోసం బిందెలు మోస్తూ మహిళలు గతంలో కంటే ఎక్కువ దూరం నడిచి వెళ్లక తప్పదంటున్న నివేదిక– ఇతరత్రా ప్రమాద సంకేతాల్నీ పొందుపరచింది. దేశంలో

లోచనం

చాలాచోట్ల భూగర్భజలాల వాడకం పెచ్చు మీరిందని, కనీసం 27 ప్రాంతాల్లో క్షామ పరిస్థితులు తిష్ఠవేయనున్నాయని కూడా హెచ్చరించింది. ఎప్పటికప్పుడు పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రణాళికలు పదును తేలకపోవడమే నీటి ఎద్దడికి ప్రధాన హేతువన్న విశ్లేషణ అర్థవంతమైంది.


ఓ ప్రమాదంలో చిక్కుకొని నట్టనడి సముద్రంలో తిండీ తిప్పలు లేకుండా రెండు నెలలు గడపాల్సి వచ్చిన ఫిలిప్పీన్స్ మత్స్యకారుడి బొందిలో ప్రాణాలు నిలిపింది– వర్షపు నీరు. ప్రతి వాననీటి చుక్కనూ ఒడుపుగా ఒడిసిపడుతూ రెండు దశాబ్దాలుగా నీటి ఇక్కట్లను తన ఇంటి దరిదాపుల్లోకి రాకుండా చేసిన బెంగళూరు వాసి ఏఆర్ శివకుమార్ ఆదర్శం ఎంతో స్ఫూర్తిమంతం అనడంలో మరోమాట లేదు. ప్రాణం నిలిపే నీటిని ప్రాణ సమానంగా పరిరక్షించుకొంటేనే బతుకు, భవిత ఉంటాయని రుజువు చేస్తున్న నిజాలవి. 70 శాతం వానలు పట్టుమని వంద రోజుల్లోనే కురిసి వెలిసిపోయే భారతావనిలో భూమిపైకి చేరుకునే వర్షపు నీటిలో ఎకాయెకి 90 శాతం దాకా సముద్రంలో కలిసిపోవడం, ఆవిరైపోవడం వల్ల ఎందుకూ కొరగాకుండా పోతోంది. డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారన్న గతకాలపు నానుడిని చెల్లని కాసు చేస్తూ– ఎంత డబ్బు వెచ్చించినా మంచి నీళ్లు దొరకని దురవస్థను దశాబ్దాల నిర్లక్ష్యం దేశవ్యాప్తంగా పరచేసింది. ప్రభుత్వాల నుంచి సాధారణ ప్రజల దాకా అన్ని స్థాయుల్లోనూ నీటి సక్రమ నిర్వహణపరంగా మేటవేసిన నిర్లక్ష్యం– లక్షలకొద్దీ జనావాసాలు మంచినీటికి మొహం వాచే దౌర్భాగ్యస్థితిని దాపురింపజేసింది.

మంచినీళ్లు తేవడం కోసం ప్రపంచవ్యాప్తంగా మహిళలు, పిల్లలు అందరూ కలిసి రోజూ వెచ్చిస్తున్న సమయం ఎంత? ఆ మొత్తాన్ని కలిపితే– దాదాపు 20 కోట్ల పని గంటలు అంటే 22 వేల ఎనిమిది వందల సంవత్సరాలని 'యునిసెఫ్' ఇటీవలి అంచనా! ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 120 కోట్ల మందికి మంచినీరు అందుబాటులో లేదని స్వచ్ఛమైన తాగునీటికి కటకటలాడుతున్న భారతీయుల సంఖ్య ఆరు కోట్ల 31 లక్షలని అంతర్జాతీయ అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించేనాటికి ఉన్న తలసరి నీటి లభ్యత నేడు నాలుగోవంతుకు కుంగిపోయింది. విచ్చలవిడిగా తోడేస్తుండటంతో దేశవ్యాప్తంగా 160 జిల్లాల్లో భూగర్భ జలాలు ఉప్పునీటి మయమైపోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు సహా తమిళనాడు, యూపీ, బిహార్, పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లోని 230 జిల్లాల్లో ఫ్లోరైడ్ భూతం జడలు విరబోసుకుంటోందని నిరూపితమైంది. 'ఇంటినీరు ఇంటివద్దే– పంటనీరు పొలంవద్దే' అన్న నినాదంతో ఏడు శాఖల్ని సమన్వయపరచి 'జల స్వావలంబన్ అభియాన్' పేరిట చేపట్టిన కార్యక్రమం ఏడాది వ్యవధిలోనే ఎడారి రాష్ట్ర ప్రజల మోములో చిరునవ్వులు పూయించింది. శాస్త్రీయ పంథాకు సంఘటిత కృషి జతపడితే అద్భుతాలు సాధించవచ్చునని ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, సింగపూర్ లాంటి దేశాలు నిరూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాగు, సాగునీటి కష్టాలకు చెల్లుకొట్టేలా మన పాలకులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – జ్యోతి

విప్లవ ధృవతార కామ్రేడ్ భగత్ సింగ్

పూకె రామకృష్ణదొర

భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించి, ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలని కలలుకన్న వీర కిషోరం, నూనుగు మీసాల ప్రాయంలోనే ఈ దేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన అసలు సిసలైన విప్లవకారుడు కామ్రేడ్ భగత్ సింగ్. దోపిడీకి ఎదురొడ్డిన వీరత్వం, ఆత్మగౌరవ పోరాటాల హక్కుల సాధన కోసం బిగించిన పిడికిలి, ప్రశ్నించిన గొంతుక కామ్రేడ్ భగత్ సింగ్. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నించి, తుపాకి గుళ్ళకు ఎదురు నిలిచి ఆత్మగౌరవ పోరాటాలకు ప్రతీకగా నిలిచాడు కామ్రేడ్ భగత్ సింగ్. అణచివేత, దోపిడికి వ్యతిరేకంగా పోరాడుతూ, విప్లవ సాయుధ పోరాట రాజకీయాలను ఎత్తిపట్టినవాడు కామ్రేడ్ భగత్ సింగ్. దేశభక్తి అంటే సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడమే అని నిరూపించిన వ్యక్తి కామేడ్ భగత్ సింగ్. అది 1919వ సంవత్సరం ఏప్రిల్ 13వ తేది అమృత్సర్ లోని జలియన్ వాలాబాగ్‌లో 20 వేలకి పైగా జనం గుమిగూడి ఉన్నారు. వైశాఖి మేళ జరుపుకోవడానికి వాళ్ళంతా అక్కడ గుమిగూడి ఉన్న సందర్భం. ఆ సమయంలో ముందస్తుగా ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఆ అమాయకపు జనం మీద కాల్పులు జరపమని జనరల్ దయ్యర్ అనే ఆంగ్లేయ అధికారి ఉత్తర్వులు ఇచ్చాడు. ఆ కాల్పుల్లో అనేకమంది చనిపోయారు. చరిత్రలో కనీవిని ఎరుగని ఆ ఊచకోత యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఆ అమానుష హత్యకాండ ఈ దేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలింది. ఆ మరునాడు లాహోర్లో ఒక పన్నెండేళ్ళ కుర్రవాడు బడికి వెళుతున్నానని చెప్పి, సంచి భుజానికి ఎత్తుకొని ఇంట్లోంచి బయటికి వెళ్ళి బడికి వెళ్ళకుండా తిన్నగా రైల్వే స్టేషన్‌కు వెళ్ళి అమృతసర్ రైలు ఎక్కాడు. ఆ కుర్రవాడు జలియన్ వాలాబాగ్‌లోకి వెళ్ళాడు. ఆ అమానుష మరణకాండను చూసి చలించిపోయి ఆ ప్రాంతంలో రక్తంతో తడిసిన మట్టిని తీసుకొని, ఈ మట్టి సాక్షిగా బ్రిటీషు పాలకులపై ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాడు. ఆ ముక్కుపచ్చలారని పసిబాలుడే భగత్‌సింగ్. చిన్నతనం నుండే దేశభక్తిని, ప్రగతిశీల విప్లవ భావజాలాన్ని వంటపట్టిం చుకొని సమసమాజం కోసం, ఈ దేశ భవిష్యత్ కోసం ఆలోచించాడు. భగత్ సింగ్ 1907లో ఒక రైతు కుటుం బంలో జన్మించాడు. ఆయన తండ్రి పరాయి పాలనను వ్యతిరేకించి ఎన్నో సార్లు జైలుకెళ్ళాడు. భగత్‌సింగ్ పుట్టిన ప్పుడు ఆయన తండ్రి దేశ బహిష్కరణ శిక్ష అనుభవిస్తూ నేపాల్‌లో ఉన్నాడు. పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే భగత్‌సింగ్‌కు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లతో మంచి స్నేహం ఏర్పడింది. చిన్నతనం నుండే పుస్తకాలు చదవడం, రాయటం, నాటకాలు వేయడం భగత్‌సింగ్‌కు అలవాటుగా ఉంది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా చాలా వ్యాసాలు పత్రికల్లో రాసాడు. కామ్రేడ్ భగత్ సింగ్ 9ఏళ్ళ ప్రాయంలోనే దేశభక్తి, విప్లవశక్తితో నిండిన భావజాలంతో తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను ఉగ్రూతలూగించేవాడు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా భారీ ఎత్తున నిరసన జ్వాలలు ఎగిసిపడుతుంటే అది చూసి మరింత గుండెధైర్యంతో ముందుకు వెళ్ళి "సైమన్ కమిషన్ గోబ్యాక్' అని నినదించాడు. లాహోర్‌లో జరిగిన ప్రదర్శనలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా నిరసన జ్వాలలకు లాలా లజపతిరాయ్ నాయకత్వం వహించారు. ఆ ప్రదర్శనమీద పోలీసులు విరుచుకుపడి లాలా లజపతిరాయ్‌ని తీవ్రంగా కొట్టి చంపారు. లాలాలజపతి రాయ్ మరణం భగత్ సింగ్‌ను పూర్తిగా కుదిపేసింది. దానికి ప్రతీకారం తీసుకోవాలని భావించాడు. దాని ప్రకారం భగత్ సింగ్, రాజ్‌గురులు కలిసి మోటర్ సైకిల్‌పై వెళుతున్న సాండర్స్ అనే బ్రిటీష్ అధికారిని కాల్చి చంపారు. అంతేకాకుండా పోలీసుల కళ్ళల్లో కారం చల్లి లాహోర్ నుండి తప్పించుకొని కలకత్తా వెళ్ళిపోయారు. ఆనాడు భారతీయుల్ని ఆంగ్లేయులు తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని అమలుచేసి చిత్రహింసలు పెడుతూ అత్యంత దయనీయమైన స్థితిలో పాలన చేస్తూ ఖనిజ సంపద, సహజ వనరులను కొల్లగొడుతూ అప్రజాస్వామిక చర్యలను భగత్ సింగ్ తీవ్రంగా వ్యతిరేకించాడు, అసహ్యించుకొని తన దేశ ప్రజలకు స్వాతంత్ర్యం తేవాలని, భారతీయులకు నిజమైన ప్రజాస్వామిక స్వేచ్ఛాయుత జీవితం కావాలని భావించి ఆంగ్లేయులపై తిరుగుబాటు జెండా ఎత్తాడు. సాయుధ పోరుకు సమరశంఖం ఊదాడు. అందుకే ఆనాడు ఢిల్లీ పార్లమెంట్‌లో బాంబులు వేసి తమ నిరసనను, ఆక్రోశాన్ని, ఆవేదనను వ్యక్తి చేసాడు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను చివరికి పట్టుకొని జైలులో వేసి చిత్రహింసలకు గురిచేసి 1931 మార్చి 23న ఉరి తీసారు. బ్రిటీషు ప్రభుత్వ వారి శవాలను ముక్కలు ముక్కలుగా కోసి కాల్చేసింది. 24 సంవత్సరాల నిండు యవ్వనంలో చిరునవ్వు నవ్వుతూ ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్ భరతమాత ముద్దుబిడ్డ. నేటి యువతరానికి ఆదర్శం. ఎంతోమంది విప్లవకారుల జీవితాలకు నిదర్శనంగా, ఆదర్శంగా ఉంది. "ఇంక్విలాబ్ జిందాబాద్', "విప్లవం వర్ధిల్లాలి" అని భగత్‌సింగ్ ఇచ్చిన నినాదం ఈ రోజు దేశవ్యాప్తంగా మారుమ్రోగుతోంది.



(నేడు కామ్రేడ్ భగత్ సింగ్ 87వ వర్ధంతి సందర్భంగా)

కామ్రేడ్ భగత్‌సింగ్ లాంటి ఎందరెందరో విప్లవకారులు విప్లవ సాయుధ పోరాట రాజకీయాల ద్వారా రక్తం చిందించి ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టారు. కాని వాస్తవంగా ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం మాత్రం రాలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారు. నల్లదొరలు ఈ దేశాన్ని అన్ని రకాలుగా నాశనం చేస్తూ ఈ దేశం సార్వభౌమత్వాన్ని, సమగ్రతను అమెరికన్ సామ్రాజ్యవాదులకు, బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెడుతున్నారు. నేటి పాలకవర్గాలు ప్రజలను కేవలం ఓటు బ్యాంకులుగా చూస్తూ, ప్రజాస్వామ్యం అంటే ఓట్లు, ఎన్నికలుగా దిగజార్చారు. నేడు పాలక వర్గాలు సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను అమలు చేస్తూ ఆదివాసి, అణగారిన వర్గాలను అంతం చేస్తున్నారు. 1947లో బ్రిటీష్ వలసవాదులు వదిలిన చెప్పుల్లో భారత పాలకులు కాళ్ళు దూర్చారు. 1935 ఇండియా చట్టాన్ని ఆధారం చేసుకొని భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. నిర్బంధ చట్టాలన్నింటిని యదాతథంగా స్వీకరించారు. ప్రజా ఆందోళనను రాజ్య వ్యతిరేకమైనదిగా, జాతీయ వ్యతిరేకమైనదిగా, చట్టవిరుద్ధమైనదిగా ముద్రవేసి అధికారులతో సహపరిపాలన న్యాయ నిర్బంధ వ్యవస్థలన్నింటిని వారసత్వంగా స్వీకరించారు. ఉద్యమకారులను దేశభద్రత చట్టం క్రింద, పి.డి. చట్టం క్రింద, ఇతర ప్రత్యేక చట్టాల క్రింద నిర్బంధించడానికి, దేశంలోని కొన్ని ప్రాంతాలను (ఆదివాసి ప్రాంతాలు) లేదా మొత్తం దేశాన్ని అంతరంగిక అత్యవసర పరిస్థితి(చీకటి పాలన) క్రిందకు తేవడానికి, ప్రాథమిక హక్కులు హరించడానికి విశాలమైన ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి అక్కడ సైనిక, అర్ధ సైనిక పోలీస్ పాలనను అమలు జరపడానికి అధికారాలన్నింటిని ఇచ్చే నిబంధనలన్నింటిని భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. భారత దేశానికి రాజకీయ రంగంలోఅసమానత్వం. సామాజిక, ఆర్థిక రంగాలలో అసమానత్వం కొనసాగుతోంది.

మరోవైపు భారతదేశంలో నరేంద్రమోడి నేతృత్వంలో బీజేపీ సంఘపరివార్ ప్రభుత్వం తన అసలు రూపాన్ని ప్రదర్శిస్తూ ప్రజలపై పాసిజాన్ని, మతోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రుద్దుతూ హిందుత్వ ఎజెండాను అమలుచేస్తూ అఖండ హిందూ భారత రాజ్య నిర్మాణమే అంతిమ లక్ష్యంగా పెట్టుకున్న మతతత్వ శక్తులు, పెట్టుబడిదారులు ప్రభుత్వాలతో కలగలసి విచ్ఛిన్నకరమైన పరిస్థితులు సృష్టిస్తున్నాయి. దేశ మూలవాసులైన ఆదివాసులపైన నిర్బంధ కాండ కొనసాగుతోంది. ప్రజలకు హక్కులు దక్కాలంటే, ఆదివాసులకు స్వయంపాలన కావాలంటే దళితులు, ఆదివాసీలు, మహిళ లు, రైతులు, కార్మికులు, మైనార్టీలు, అసమానతలకు, వివక్షలకు వ్యతిరేకంగా కామ్రేడ్ భగత్‌సింగ్ చూపిన విప్లవ పోరాట రాజకీయాల ద్వారానే పోరాడగలం. నిజమైన స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పోరాటాన్ని పుణికిపుచ్చుకొని ప్రజాస్వామిక శక్తులు, విప్లవ ప్రగతిశీల శక్తులు, వ్యక్తులు ఈ పాలక వర్గాలపైన సమైఖ్యంగా సమరశంఖం పూరించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

–వ్యాస రచయిత : ఆదివాసీ రచయితల సంఘం, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, సెల్ : 9866073866

విశాలాంధ్ర

బతుకు
The Life

శుక్రవారం
23 మార్చి 2018



తిండి దొరికిందా....గువ్వమ్మా!

ఒంటి నిండా పసుపు పూసుకున్నట్టు చిక్కని పసుపు రంగు. కంటి చుట్టూ మాత్రం తెలుపు రంగు. భలే చిత్రంగా, చూడముచ్చటగా ఉంది కదా ఈ గువ్వ. హమ్మయ్య తినడానికి తిండి దొరికింది అన్నట్టుగా ప్రశాంతంగా తన పని తాను చేసుకుంటోంది ఈ పక్షి.


బహుముఖ ప్రజ్ఞాశాలి


గొల్లపూడి!


గొల్లపూడి మారుతీరావు...ప్రముఖ సినిమా నటుడు...


ఇదొక్కటే కాదు ఆయనలో ఇంకా చాలా కోణాలు ఉన్నాయి. రచయిత, డ్రామా ఆర్టిస్టు, స్క్రీన్ రైటర్, ప్లే రైటర్ కూడా...వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహిత్యం, సినిమా రంగాలకు ఆయన చేసిన, చేస్తున్న కృషి ఎనలేనిది. ఉత్తమ జర్నలిస్టు అవార్డుతో సహా ఎన్నో అవార్డులనూ పొందారు. నంది అవార్డుతో పాటు అనేక యూనివర్శిటీల నుంచి డాక్టరేట్‌లూ అందుకున్నారు. గొల్లపూడి రచనలన్నీ విశేష ప్రజాదరణను పొందాయి. డైలాగ్ డెలివరీ, హావాభావాల్లో తనదైన ముద్రతో ప్రత్యేకమైన కామెడీ, విలనిజాన్ని కూడా పండించారాయన. ఏ పాత్రనైనా అవలీలగా, అద్భుతంగా నటించే ఆయన బహు భాషా నటుడిగానూ పేరొందారు. అటు నటుడిగా, ఇటు రచయితగా సమాన గౌరవం, పేరుప్రఖ్యాతులు దక్కించుకున్న గొల్లపూడి జీవిత విశేషాలు ఆయన మాటల్లోనే....

















నేను పుట్టినరోజున మూడు రాష్ట్రాల వారికి పండగ. తమిళనాడు, కేరళ, బెంగాల్ వారికి నూతన సంవత్సరం. మహానటుడు చార్లీ చాప్లిన్ పుట్టిన రాశిలోనే పుట్టాను. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన ఏడాదిలోనే పుట్టాను. 1939, ఏప్రిల్ 14వ తేదీన విజయనగరంలో జన్మించా. సుబ్బారావు, అన్నపూర్ణ నా తల్లిదండ్రులు.

నేనొక్కడినే కొడుకు కావడంతో చాలా గారాబంగా పెంచారు. వేసవి సెలవుల్లో మా అమ్మమ్మగారింటికి అనకాపల్లి వెళ్ళేవాడిని. పదహారవ ఏట నుంచే డైరీ రాయడం అలవాటైంది. అప్పట్లో ఎందుకు రాయాల నిపించిందో, అందుకు స్ఫూర్తి ఏమిటో అంతగా నాకు గుర్తులేదు కానీ ఆ తర్వాత కాలంలో నా జీవిత విషయాలు తొంగి చూసుకునేందుకు మాత్రం ఇది బాగా ఉపయోగపడింది. ముందుకు సాగడమే కానీ వెనక్కి తిరిగి చూసుకోవడం అలవాటులేని నాకు "వెనక్కి తిరిగి అప్పట్లో చూసినవి, చేసినవి చెప్పండి" అంటూ మిత్రులు ఒత్తిడి తీసుకొచ్చిన నేపథ్యంలో "అమ్మ కడుపు చల్లగా" అంటూ నా ఆత్మకథను రాశాను. పత్రిక, రేడియో, టెలివిజన్, సినిమాల్లో తలమునకలై మూడు తరాల ప్రముఖులతో పనిచేశాను. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ వాతావరణంలో పుట్టి విదేశాలకు ఉపాధి కోసం వలసపోయేవారికి తెలుగుదనాన్ని తెలియజేయడంలో వారధిగా మారాను. మనిషి మంచిగా మనుగడ సాగించాలంటే క్రమశిక్షణ కావాలి, నిజాయితీ కావాలి, విశాల దృక్పథం కావాలి.

నేను రాసిన కరుణించని దేవతలు నాటకానికి మంచి పేరు వచ్చింది. 1970, సెప్టెంబరు 8న విజయవాడలో ఆంధ్ర నాటక కళాపరిషత్ నాటకోత్సవాల్లో భాగంగా వేసిన ఈ నాటికను ఆనాడు నాటక, సాహిత్య, కళా రంగాలను సుసంపన్నం చేసిన ఎందరో మహనీయులు చూశారు. అక్కడి నుంచే కేవీ గోపాలస్వామి, పనస సూర్యచంద్రరావు, సురభి పూర్ణిమ, ఎంఆర్ అప్పారావు, కె. రామలక్ష్మి, దాడి గోవిందరాజుల నాయుడు, పోలవరపు సూర్యప్రకాశరావు, సుంకర కనకారావు, శ్రీపాద పట్టాభి, ప్రభాకర్ గుప్తా ఇలా ఎంతోమందితో నా పరిచయం మొదలైంది.

కథల విషయానికొస్తే నా మొదటి కథ ఆశాజీవి. ఇది 1954లో అచ్చయ్యింది. అనంతర కాలంలో నా రచనలు, కథలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 1965లో ఆత్మగౌరవం రచనకు నంది అవార్డు వచ్చింది. దాదాపుగా 80 చిత్రాలకు పైగా కథలు సమకూర్చాను. ఇవన్నీ పేద, మధ్యతరగతి నేపథ్యంలో సాగేవే. నా రచనల్లో హాస్యం పాలూ ఎక్కువే ఉంటుంది. పలు కుటుంబ కథా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించాను. సుమారుగా 270 సినిమాల్లో నటించాను. పలు అవార్డులు అందుకున్నాను.

దుక్కిపాటి మధుసూదనరావు స్ఫూర్తితో 14వ ఏటే కళారంగంలో ప్రవేశించాను. ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య నా తొలి సినిమా. ఇది 1982లో విడుదలైంది. ఈ సినిమా చాలామందికి తొలి సినిమా. దర్శకుడికి కూడాను. ఇందులో నా సుబ్బారావు పాత్రకు మూడేమూడు జతలు కుట్టించారు. యముడికి మొగుడు, సంసారం ఒక చదరంగం, గూఢచారి నెంబర్ 1, ఆలయ శిఖరం, అభిలాష, పల్లెటూరి మొనగాడు, శివుడు, ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య, ఛాలెంజ్, ప్రేమ, ఆదిత్య 369, వజ్రం, మురారి వంటి సినిమాలు నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. తరంగిణి సినిమాకు 1983లో ఉత్తమ హాస్య నటుడిగా నంది అవార్డు అందుకున్నాను. 1996లో ఉత్తమ నటుడుగా ఆల్ ఇండియా రేడియో టెలివిజన్ అవార్డును అందజేసింది. ఆల్ ఇండియా రేడియో పనిచేస్తూ ఉత్తమ జర్నలిస్టు అవార్డునూ తీసుకున్నాను. 2000 సంవత్సరం, నవంబరు 30న మహా కవి గురజాడ వర్ధంతి సందర్భంగా నాకు పురస్కారం లభిం చడం, పుట్టిన గడ్డలో ఆత్మీయుల మధ్య దానిని అందు కోవడం నాకు అమితానందాన్ని కలిగించింది. అనేక దేశాలు తిరిగి మనుషుల జీవితాలు, మనస్తత్వాలు తెలుసుకోవడం, కళారంగంలో ఎందరో మహనీయుల స్ఫూర్తితో కళామతల్లి ఒడిలో నటుడిగా, సాహిత్యకారుడిగా తెలుగు ప్రజలకు వినోదాన్ని అందించడం నా అదృష్టంగా భావిస్తున్నా.

- పి. రామకృష్ణ, విశాఖపట్నం

హెయిర్ బ్రష్‌లు ఎన్ని రకాలో!





తల దువ్వేందుకు దువ్వెన ఉపయోగించడం పాత మాట. హెయిర్ బ్రష్‌లు ఉపయోగించడం నేటి ఫ్యాషన్. సమయాన్ని, సందర్భాన్ని బట్టి రెండూ ఉపయోగించేవాళ్ళూ ఉన్నారు. సగానికి సగం మంది మహిళలు, యువతులు హెయిర్ బ్రష్‌లనూ ఎక్కువగానే ఉపయోగిస్తున్నారు. మరి ఈ హెయిర్ బ్రష్‌లు ఎన్ని రకాలు ఉన్నాయో తెలుసా? బ్రష్‌ను ఎలా ఉపయోగిస్తున్నారు. వెంట్రుకల మూలల్లోంచి మొదలుపెట్టి చివర్ల వరకూ దువ్వుతున్నారా? లేదంటే ఏదో ఒక హెయిర్ బ్రష్ తీసుకుని జుట్టు విరబోసుకుని అదే పనిగా దువ్వేస్తున్నారా! ఇలా చేస్తున్నట్లయితే కొంచెం ఆలోచించాల్సిందే. ఎందుకంటే హెయిర్ బ్రష్‌లూ చాలా రకాలే ఉన్నాయి. దేనిని ఎందుకు ఉపయోగించాలో, ఎలా ఉపయోగించాలో తెలుసుకుని వాడుకుంటే జుట్టుకి అందమూ, ఆరోగ్యమూ! మీరు హెయిర్ బ్రష్ కొనేటప్పుడు మీ జుట్టు పొడవు, దాని తత్వాన్ని కూడా దృష్టిలో ఉంచుకోండి.

1. రౌండ్ బ్రష్ : ఉంగరాల జుట్టు ఉన్నవాళ్ళు, కొద్దిగా మెలికలు తిరిగినట్టుగా ఉన్నవాళ్ళు, పొడవాటి కురులు ఉన్నవాళ్ళ దీనిని ఉపయోగించుకోవచ్చు.

2. ఫ్లాట్ బ్రష్ : అన్ని రకాల కురులకూ ఇది సూటబులే. ఎవరైనా వాడుకోవచ్చు.

3. కుషన్ బ్రష్ : మరీ అంత ఒత్తుగా కాకుండా మధ్యస్థంగా జుట్టు ఉన్నవాళ్ళు దానిని స్మూత్‌గా, స్ట్రయిట్‌గా చేయడానికి ఈ కుషన్ బ్రష్‌ని ఎంచుకోవచ్చు. జుట్టు రాలిపోతున్నప్పుడు, పాలిపోయినట్లు ఉన్న జుట్టుకి కూడా దీనిని ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల ఏమంత నష్టం ఉండదు.

4. పెడల్ బ్రష్ : చూడడానికి సమాంతర పొడవు, వెడల్పు ఉండే ఈ బ్రష్ పొడవైన వెంట్రుకల్ని చిక్కులు లుకుండా తిన్నగా దువ్వడానికి బాగుంటుంది.

5. సెమీ సర్క్యులర్ బ్రష్ : తడిగా, పొడిగా ఉండే జుట్టుకు ఇది మంచి ఎంపిక. జుట్టుతో రకరకాల జడలు, ఫ్యాషన్లు చేసుకునేందుకూ ఇది ఉపయోగపడుతుంది.

6. వెట్ బ్రష్ : బాగా చిక్కుబడి ఉన్న తడితలను సాఫీగా చేసేందుకు దీనిని ఎంచుకోవచ్చు. తడి జుట్టు చిక్కుని తీసుకునేందుకు ప్రత్యేకమైన బ్రష్ ఇది.

జుట్టు దువ్వుకోవడానికి ఎన్నో రకాల దువ్వెనలూ మార్కెట్‌లో లభిస్తున్నాయి. టేల్ కూంబ్, లార్జ్ హెడ్ కూంబ్, ఆఫ్టర్ షాంపూ కూంబ్, హెయిర్ కలరింగ్, డయింగ్ కూంబ్ అని రకరకాల పేర్లు వాటికీ ఉన్నాయి.

పొట్ట దగ్గర కొవ్వును కరిగించేదెలా!



శరీరంలో కొవ్వు నిల్వలు ఎక్కువగా పేరుకుపోయేది ఎక్కడో తెలుసా? పొట్ట దగ్గర, పొట్ట చుట్టూనే. ఈ కారణంగానే జనాభాలో మూడు వంతుల మందికి పొట్ట ఉంటుంది. అది ఏ స్థాయిలో ఉంటుందనేది వేరే విషయం. పొట్ట మరీ ఎక్కువగా ఉంటే నచ్చిన దుస్తులు వేసుకోవడమూ కష్టమే. ఇలాంటప్పుడు ఇక ఫంక్షన్లు, పార్టీలకు ఏం వెళతారు. అందం మాటేమో గానీ ఆరోగ్యానికీ ఇది మంచిది కాదు. బొడ్డు చుట్టూ పేరుకుపోయిన కొవ్వును ఎంత తొందరగా కరిగిస్తే అంత మంచిది. అధిక కొవ్వు వల్ల నడుంనొప్పి, కీళ్ళ నొప్పి, అలసట, ఒత్తిడి, గుండె వ్యాధులు, రక్తపోటు, కేన్సర్ వంటి సమస్యలూ మొదలవుతాయంటున్నారు. మరి ఈ బాధలన్నీ పడడం కంటే పొట్ట భాగంలో ఉన్న కొవ్వును కరిగించుకోవడం అన్ని రకాలుగా మేలు కదా. మరి అదెలాగో చూద్దామా!

- ప్రతిరోజు ఉదయం అల్పాహారానికి ముందు 15 నుంచి 20 నిముషాల పాటు నడవండి. ఇంట్లోనే ట్రెడ్‌మిల్‌తో వ్యాయామం చేయండి. ఇది అలవాటుగా మారితే మీ శరీరంలోని కొవ్వు 5 వారాల్లో 5 అంగుళాలు తగ్గుతుందని అధ్యయనాల్లో వెల్లడయింది.
- ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోండి. ఉదయం అల్పాహారానికి బదులు గ్రీన్ సలాడ్స్, ఓట్స్ వంటివి రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకుంటే మీ శరీరంలోని అధిక కొవ్వును తగ్గించుకోవచ్చు.
- మనం రోజూ రకరకాల పండ్లు తీసుకుంటాం. ఇవి బరువు తగ్గడానికీ ఉపయోగపడతాయి. మీకు తెలుసా పచ్చ రంగులో ఉండే పండ్ల కన్నా ఎరుపు రంగులో ఉండే పుచ్చకాయ, ఎర్రటి ద్రాక్ష, ఎర్ర జామ వంటి పండ్లు మరింత మంచివి. ఇవి పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తాయి. వీటికి శరీరంలోని క్రిములను నాశనం చేసే శక్తీ ఎక్కువగా ఉంది.
- ప్రతిరోజు ఉదయం ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే గుడ్డులోని తెల్ల సొనను తీసుకోండి. దీనివల్ల మీ శరీరం మంచి ఆకృతిని సంతరించుకుంటుంది. శరీరంలోని వ్యర్థాలు, అనవసరపు కొవ్వు తొలగుతాయి. ప్రతిరోజు ఉడికించిన గుడ్డులోని తెల్ల సొనలు రెండు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది.
- తాగే నీటిలో నిమ్మరసాన్ని కలిపి తాగితే శరీరంలోని కొవ్వు తగ్గుతుందని పరిశోధనల్లో తేలిన అంశం. సి-విటమిన్ ఎక్కువగా ఉండే నిమ్మలో యాంటీఆక్సిడెంట్స్ చాలా ఎక్కువ. పొట్ట దిగువ భాగంలో ఉన్న కొవ్వును కరిగించడానికి ఇది దివ్యౌషధంలా పనిచేస్తుంది.
- బరువు తగ్గాలన్నా, ప్రత్యేకించి పొట్టకింద భాగంలోని కొవ్వు కరగాలన్నా....కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే తెల్లటి బ్రెడ్, తెల్లని రైస్, పంచదార, పాస్తా, పిజ్జా, బేకరిఫుడ్ లాంటికి దూరంగా ఉండాలి, సాధ్యమైనంత తక్కువగా తీసుకోవాలి.
- వ్యాయామాల వల్ల కూడా కొంత వరకూ కొవ్వు అదుపులో ఉంటుంది. పరిగెత్తడం, జాగింగ్ వంటివే కాక ఉదర వ్యాయామాలు క్రమం తప్పకుండా చేస్తే ప్రయోజనం ఉంటుంది.

స్పూన్ వద్దు!



ఆహారం తినడానికి చేతిని ఉపయోగిస్తున్నారా? లేక చెంచాను వాడుతున్నారా? స్పూన్ వాడుతున్నట్లయితే ఇకపై దానిని పక్కన పెట్టేయండి. ఎంచక్కా చేత్తోనే ఆహారాన్ని కలుపుకుని నిదానంగా నమిలి తినండి. ఇలా తినడం వల్లే బలం చేకూరుతుంది. ఇది ఆషామాషీగా చెబుతున్న విషయం కాదు. వైద్యులు చెబుతున్నదే. చేతితో ఆహారం తినడం వల్ల కొన్ని మిలియన్ల నరాలు మెదడుకు సిగ్నల్స్ పంపిస్తాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. ఆహారాన్ని చేతితో కలిపి తినడం వల్ల ఇందుకు అవసరమైన సంకేతాలను మెదడు, పొట్టకు పంపిస్తుంది. ఇలా జరిగితే కడుపులో జీర్ణరసాలు, ఎంజైమ్‌లు విడుదల అవుతాయి. తద్వారా జీర్ణశక్తి పెరుగుతుంది. వేళ్ళతో ఆహారాన్ని కలుపుకుని ఉండలుగా తీసుకోవడం ద్వారా రక్తప్రసరణ స్థాయి మరింత వేగవంతమవుతుందట. చేతివేళ్ళతో ఆహారం తీసుకోవడం వల్ల వేళ్ళు పెదాలకు తగలగానే నోటిలో లాలాజలం ఊరుతుంది. చేతివేళ్ళతో ఆహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలూ దూరమవుతాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

సీతారాం ఇచ్చిన వుంగరాన్ని నాన్న పొగడబోతూంటే జనార్దనం ఎక్కడ చిన్నబోతాడో అని అమ్మ గ్రహించి "సీతారాం! జనార్దనరావుగారికీ, మీకూ బాగా స్నేహం వున్నట్టు ఇన్నాళ్ళూ చెప్పావే కావేమిటోయ్!" అంది. ఇంతట్లోకి పెద్దనాన్నొచ్చాడు. చక్కటి చేతిసంచీ నాకిచ్చి నాబుగ్గ ముద్దు పెట్టుకుని "మరదలుపిల్లా! ఈ అప్సరసని చూసి మా ముసి లాళ్ళకళ్ళు జిగేలుమని పోతున్నాయి" అని అమ్మతో హాస్యంగా అన్నారు సీతారాం అన్నాడు. "డాక్టరుగారూ! మీరు ముసలి వారైతే మేమందరం ఋషి పుంగవులమే సుమాండీ" అన్నాడు. "ఋషిపుంగవులకి తపోభంగం కావడానికే కదండి అప్సరసల ను సృష్టించాడు దేవుడు?" అన్నాడు జనార్ధనం. అమ్మా జనర్ధనానికి ఎప్పుడూలేని ధైర్యం వచ్చిందే అని నవ్వు కున్నాను. అప్పుడే కమల లీల వచ్చారు. అందరినీ పరిచయం చేశాను. "దేవేంద్రసభలాగుందే" అన్నారు పెద్దనాన్న, అమ్మ అందరికీ ఫలహారాలు, కాఫీ యిచ్చింది. బాతాఖానీ ప్రారంభం అయింది.

(నిన్నటి సంచిక తరువాయి)

ఇంతట్లో అమృతరావు డ్రైవర్ దుస్తులతో వచ్చి "అమ్మగారూ! టెలిగ్రాం, బంట్రోతు మీకిమ్మన్నాడండీ" అని టెలిగ్రాం ఒకటిచ్చాడు. మదనం మాలతీ కలిసి అభినందనాలు పంపించారు. విశాఖపట్నంనుంచి అందరికీ చదివి వినిపించాను. "అమృతరావుకి రావడానికి ధైర్యం లేకపోయింది. చాలా పెద్ద కబుర్లు చెప్పాడే - ఇంతేనా?" అని లోపల అనుకున్నాను. బాతాఖానీ ప్రారంభం అయింది.

పెద్దనాన్న అన్నారూ "ఓరే తమ్ముడూ! నేనన్నాను జ్ఞాపకముందిరా - హిట్లర్ మూడో కంటితో చూస్తే స్టాలిను కాదుగదా స్టాలిను తాతైనా బుగ్గయి పోతాడని - తోక ముడుచుకుని కర్రికుక్కలా పరిగెడుతున్నాడురా" అన్నాడు. ఇంతట్లో టాక్సీ వొకటి గుమ్మంలో కొచ్చింది. ఇప్పుడే స్టీమరునుంచి దిగిన దొరలావున్నాడు ఒకతను దిగేడు. ఎవరు చెప్మా అని నేను నాలుగడుగులు ముందుకెళ్ళాను. అతను చప్పున నాదగ్గరకొచ్చి "వాసుదేవ్ వురఫ్ అమృతరావు" అన్నాడు నేను నిర్ఘాంతపోయాను. ఆ తమ్మెట్లేవి? యీ మీసం ఎక్కడిది? ఈ కళ్ళద్దాలు ఏమిటి. యీ పాపిట తీసిన క్రాపింగు ఎక్కడినుంచి వచ్చింది? తమాషాగా వుందే అనుకున్నాను. అందరం కూచున్న చోటికి తీసుకెళ్ళాను. "నా పాత స్నేహితులు ప్రొఫెసర్ వాసుదేవ్, బరోడా" అని అందరికీ పరిచయం చేశాను. నాకు యేం అనడానికి తెలియలేదు. నేను ఖంగారుపడుతూండం గ్రహించి తనతో తీసికొచ్చిన యెర్ర గులాబీ పువ్వుల గుత్తి - ఇరవై పువ్వులుంటాయి - చేతికి అందిచ్చాడు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రపంచ చరిత్ర పుస్తకం ఇచ్చాడు. అందరివేపు తిరిగి "నా పేరు కొత్తూరు వాసుదేవశర్మ అండి. మాది గుంటూరుజిల్లా అమృతలూరు.

బరోడాలో ఏరియోనాటిక్స్ ప్రొఫెసరునండి. శాస్త్రిగారు, శాంతంగారు జైలులో వున్నప్పుడు నేను చెన్నపట్నంలో వుండేవాడినండి. అప్పుడు సుభగారితో తరుచు క్లబ్బులో టెన్నిసు ఆడేవాడినండి" అన్నాడు చక్కని తెలుగులో "నిన్న స్పెన్సరులో కనిపిస్తే వాసుదేవు గారిని ఈవేళ రమ్మని ఆహ్వానించాను" అన్నాను.

బాతాఖానీ సాగింది. "అన్నయ్యా! ఇందాక స్టాలిన్ బేపిలాగు పరిగెడుతున్నాడన్నావా మా బాగా అన్నా వన్నయ్యా!" అన్నారు నాన్న. "శాస్త్రిగారూ! రెండో యుద్ధశ్రేణి ప్రారంభించకుండా స్టాలినుకి అన్యాయం చేస్తున్నారండీ వీళ్ళు!" అన్నాడు వాసుదేవ్. "ప్రొఫెసరుగారూ! మరి స్టాలిను మాటెత్తకండి! చట్టుబండలు, విరిగి కూలబడ్డాడు. కూలబడిన నరుడు కుదురుట యరుదయా' అన్నాడు వేమన" అన్నాడు సీతారాం. అందరూ నవ్వారు. "ఇక రెండో యుద్ధ శ్రేణా? గాంధీగారూ, సుభాసు బోసు కలిసే లేవదీస్తున్నారుగా మన దేశంలో ఏమిరా తమ్ముడూ! రేపు బొంబాయిలో మీ గాంధీగారు యుద్ధమే ప్రకటిస్తున్నారుగా!" అన్నారు పెదనాన్న. "యుద్ధం ప్రకటించినట్టే - వార్ధానుంచి. రేపు బొంబాయిలో లాంఛనంగా బాకా వూదడమే తరువాయి" అన్నారు నాన్న ఉత్సాహంగా. "డాక్టరుగారూ! ఇదివరకే సుభాషున్ను, గాంధీగారున్ను యేర్పాటు చేసుకుని సుభాష హిట్లరుతో ముఖాముఖి మాట్లాడారు అనుకోండి. జపాను దండయాత్రతో స్వరాజ్యం చేతిలో పడిందే అనుకోండి" అన్నాడు సీతారాం.



"అదేమిటండీ? జపానువాడంటే మాకేమీ ప్రేమలేదు. వాడితో మేం యుద్ధం చేస్తాం అంటున్నారు గాంధీగారు?" అన్నాడు వాసుదేవ్. "అనక మరేమిటంటాడండీ! తను అంటే మనం నమ్ముతాం అండీ? తేరగా స్వరాజ్యం వచ్చి చేతిలో పడుతూంటే - ఎవడండీ యుద్ధం చేస్తాడు? కమ్యూనిస్టులు చెయ్యాలి!" అన్నారు పెద్దనాన్న. "గాంధీజీ నాయకత్వాన్ని బ్రిటిషువాడితోనూ, జపానువాడితోను యుద్ధం చేస్తామండీ" అన్నారు నాన్న. "శాస్త్రిగారూ! ఏరోప్లెయిన్లు మెషీను గన్నులతో యేం సత్యాగ్రహం చేస్తారండీ?" అన్నాడు వాసుదేవ్. "కత్తితో యుద్ధం చేస్తాం అండీ! జపాను వాడిస్తాడండీ మనకి మెషినుగన్నులూ ప్లేన్లున్నూ" అన్నాడు సీతారాం. "మీకు మిలిటరీ తర్ఫీ దెక్కడండీ? ఎందుకండీ జరగనిమాట" అన్నాడు వాసుదేవ్. అమ్మ అంది - "వారం పది రోజుల్లో అంతా తేలగొట్టేస్తాం అంటున్నారు గాంధీగారు" "గాంధీగారిని, మిమ్మలినందరినీ జైల్లో తోసేస్తారు. వారం రోజుల్లో గుప్ చప్!" అన్నాడు వాసుదేవ్. "అప్పుడు కమ్యూనిస్టు లొక్కళ్ళే మిగులుతారు - బ్రిటిషు వాళ్ళతో కలిసి ఊరేగడానికి, అంతేనా?" అన్నాడు సీతారాం. అందరూ నవ్వేరు. "గాంధీగారు బేరంలోకి దిగుతున్నారు కదండీ?" అన్నాను నేను. "ఇంగ్లీషువాడు ఇప్పుడు బేరం చెయ్యడండీ - గాంధీజీ తప్పు అభిప్రాయం పడుతున్నాడు, చూస్తూండండీ" అన్నాడు వాసుదేవ్. "గాంధీజీ యుద్ధం యుద్ధం అంటున్నారు కాని - ప్రజల్లో ఎక్కడా ఉత్సాహం లేదండీ" అన్నాడు జనార్దనం. "బాగా అన్నారండీ జనార్దనంగారూ! జిన్నాతో రాజీ పడనంతకాలం మనలో మనకి ఐకృత లేకపోతే ఏంలాభంలేదండీ" అన్నాడు వాసుదేవ్. "ప్రొఫెసరుగారూ! మీకు తెలీదు. మనం గాంధీగారి నాయకత్వాన చేశామా - ఉత్తరక్షణంలో సుభాషు దేశంలోకి ప్రవేశిస్తాడు. మనకి స్వరాజ్యమూ వస్తుంది - దానితో ఒక వేపున బ్రిటిషు పీడ వదులుతుంది - ఒకవేపు కమ్యూనిస్టు శనీ విరగడవుతుంది!" అన్నారు అందరం నవ్వేం. వాసుదేవ్ వాచీ చూచుకుని "సుభగారూ! నాకు సెలవివ్వండి. నేను రాత్రిబండికి బరోడా వెళ్ళిపోవాలి. శాంతంగారూ, సెలవు. శాస్త్రిగారూ, సెలవు" అని అందరి దగ్గరా సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. మరో అరగంట అయాక అందరూ లేచారు. "మరదలుపిల్లా! నేను రేపు ఢిల్లీ వెళుతాను. సెసీలీ మిమ్మల్ని నందరినీ మరీ మరీ అడిగేనని చెప్పమంది. తమ్ముడూ! టాక్సీ ఒకటి తెప్పించమనురా!" వడివేల్? అయ్యగారు ఎక్కడికెళతాడో అక్కడికి తీసుకువెళ్ళు." "చిత్తం" అన్నాడు వడివేలు. "అమృతరావ్! కమలగారిని, లీలగారిని వారింట్లో దింపే!" "చిత్తం" అన్నాడు అమృతరావు.

అందరూ వెళ్ళిపోయాక కానుకలన్నీ చూస్తున్నాం. వాసుదేవు ఇచ్చిన పుస్తకం. తిరగేశాం. 544 పుటలో వున్న "మార్క్సిజం అంటే వర్తమాన భూత భవిష్యత్ మానవ ఇతిహాసాన్నంతటినీ సూత్రాలతోను, సిద్ధాంతాలతోను ఇంచుమించుగా విధి కృతాన్ని ఎవరు తప్పించగలరు అనే ఒకరకమైన నిరాశావాదం క్రింద పడేయడానికి ప్రయత్నించే ఒక తర్క విధానం అని చెప్పొచ్చు" అన్నవాక్యం పక్కని గీత గీసి "ఇది విలియమ్ జేమ్స్ పంథా - శుద్ధ పొరపాటు" అని వుంది!..."ఎవడే ఇతను? జవహర్ లాల్ అంత వాడిలోనే తప్పు లెంచుతున్నాడు! కొంపతీసి వీడు కమ్యూనిస్టేమో సుమా?" అన్నారు నాన్న...ఓఢ్రమంగలి అర్జునుడు వచ్చి "బాబూ! ఈ తాళాలున్నూ, ఈ వుత్తరమున్ను మీకిమ్మని చెప్పి వెళ్ళిపోయాడు అమృతరావు" అన్నాడు. "సుబ్బడూ! ఈ వుత్తరం యేమిటో చదువు అమ్మా!" అన్నారు నాన్న. "అయ్యా! కొన్ని కారణాలచేత రేపటినుంచి నా డ్రైవరు ఉద్యోగాన్ని చాలించుకుంటున్నాను. పద్ధతి ప్రకారం, న్యాయం ప్రకారం మీకు నేను నెలరోజులు వ్యవధి యివ్వలేకపోయినాను. అందుకు ప్రత్యామ్నాయంగా ఈ ఇరవై రెండురోజులు జీతమున్ను వదులుకుంటున్నాను. కాగా - కారు సామానులు మీకు స్వయంగా లెక్క చెప్పి వప్పచెప్పుటకు వ్యవధి లేకపోయినా, అన్నీ సరిగానే వుంటాయి. అయినా అందుకు ధరావతుకు యిందుతో జతపర్చిన నూరు రూపాయలు మీవద్ద వుంచి, వస్తువులు సరిచూచుకొని, తేడా వచ్చినయడల ఆ వస్తువుల ఖరీదు ఈ పైకంలోనుంచి మినహాయించి మిగిలిన మొత్తం కమ్యూనిస్టు పార్టీ నిధికి పంపించేయమని కోరిక - చిత్తగించవలెను - అమృతరావు,"

"శాంతం ! నేను అప్పుడే చెప్పాను. వీడెవడో దొంగలా ఉన్నాడు - వీడు కమ్యూనిస్టే అని. చూశావా ఏమైందో? అమృతరావుట -అమృతరావేమిటి ? విషపుకాయ ! ఎండ దౌల్‌బాజీ పనిచేశాడో ! మనకి డబ్బు కూడా ఇస్తున్నాడు ! ఏమి ఈ కమ్యూనిస్టు బేహద్బీ ! మన మాటలన్నీ ఆ పోలీసువాళ్ళతో చెబుతాడేమోనే! శాంతం ! నువ్వూ సుబ్బడు కూడా నా మాట వినకుండా నన్ను తట్టాబాజా కట్టేరు. చూడు వాడి కమ్యూనిస్టు పొగరు ! వెధవనోటు - చింపిపారేయి.. ఆ అగు పారేయకు. అంతా పద్దులు తేడా చూసి వెరశి సున్నకి సున్నా, హళ్ళీకిహళ్ళీ అని తేల్చేని పారేస్తే ఆ వెధవ అహంకారం కట్టిపోతుంది !" అన్నారు నాన్న.

తొమ్మిదిన్నరకి రేడియోలో గవర్నమెంటువారు కమ్యూనిస్టుల మీద ఈ వేళతో నిషేధం తొలగించేశారు అని చెప్పారు.

3 వ భాగం

1 ఆమె

నాన్న బొంబాయినుంచి వచ్చేశారు. 'క్విట్టిండియా' ఉద్యమం మొదలైంది, అరెస్టులు ఉధ్రుతంగా సాగుతున్నాయి. తనని కూడా వర్కింగు కమిటీ సభ్యులతోపాటు ఆగాఖాను భవనంలో నిర్బంధిచివుంటే అన్నివిధాలా భాగుండిపోను అనుకుంటున్నారు. ఇటు కడుపులో చల్లకదలకుండా రంగరంగ వైభోగాలతో శ్రీ కృష్ణ జన్మస్థాన సందర్శనం, అటు అగ్రశ్రేణి నాయకులతో నిరంతరం సాంగత్యం. ఇహ తదుపరి దేశచరిత్రయే రూపం యెత్తినా, ఢిల్లీ గర్భగుడిలో పీఠంమీద రిజర్వుడు స్థానం లభ్యం శిలాక్షరం.

- ఇంకా వుంది.

ఉద్యోగావకాశాలు

తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లో 1058 ఉద్యోగాలు

తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ (జీపీవో)తోపాటు వివిధ హెడ్ పోస్టాఫీస్ (హెచ్‌వో), సబ్ పోస్టాఫీస్ (ఎస్‌వో), బ్రాంచ్ ఆఫీస్ (బీవో)ల్లోని 1,058 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.



పోస్టు : గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్). ఇందులో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం), మెయిల్ డెలివరర్ (ఎండీ), మెయిల్ క్యారియర్ (ఎంసీ), మెయిల్ ప్యాకర్ (ఎంపీ), మెయిల్ మ్యాన్ కేటగిరీ పోస్టులున్నాయి.

మొత్తం ఖాళీలు : 1,058 (అన్‌రిజర్వ్‌డ్-559+ ఓబీసీ-247+ ఎస్సీ-133+ ఎస్టీ-76+ దివ్యాంగ (పీహెచ్)-43). దివ్యాంగ కేటగిరీలో పీహెచ్ (హెచ్ హెచ్)-14, పీహెచ్ (వోహెచ్)-15, పీహెచ్ (వీహెచ్)-14 ఉన్నాయి.

అర్హతలు : పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఏదైనా ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బేసిక్ కంప్యూటర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ (కనీసం 60 రోజుల శిక్షణకు తగ్గకుండా) ఉండాలి లేదా పదోతరగతి/ అంతకంటే ఎక్కువ విద్యలో కంప్యూటర్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. తొలి ప్రయత్నంలోనే పదోతరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఉన్నతవిద్య (ఇంటర్/డిగ్రీ/..) అభ్యర్థులకు ఎలాంటి అదనపు వెయిటేజీ ఉండదు.

దరఖాస్తు రుసుం : ఓసీ/ఓబీసీ-రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.

వయసు : 2018, మార్చి 9 నాటికి 18-40 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక : పదోతరగతి మార్కుల మెరిట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 4, 2018.

వెబ్‌సైట్ : www.indiapost.gov.in, http://appost.in/gdsonline

ఎయిమ్స్ జోధ్‌పూర్‌లో 755 పోస్టులు

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) శాఖ.. వివిధ విభాగాల్లోని 755 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ (ఏఎన్ఎస్)-28; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 1)-127; నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2)-600.

వేతనశ్రేణి : అసిస్టెంట్ నర్సింగ్. సూపరింటెండెంట్-రూ.15,600-రూ.39,100; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్-రూ.9,300-రూ.34,800.

అర్హతలు : ఏఎన్ఎస్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్/ బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/ రెండేళ్ల బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/ తత్సమాన విద్యతోపాటు ఏదైనా 200 పడకల ఆస్పత్రి/ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం ఆరేళ్ల అనుభవం ఉండాలి. ఇందులో మూడేళ్ల పాటు వార్డ్ ఇన్‌చార్జ్/ సూపర్‌వైజరీ కెపాసిటీ హోదాలో పనిచేసి ఉండాలి. ఎంఎస్సీ (నర్సింగ్) ఉత్తీర్ణత అభిలషణీయం; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/ బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే ఏదైనా 200 పడకల ఆస్పత్రి/ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2 హోదాలో కనీసం మూడేళ్ల అనుభవం; నర్సింగ్ ఆఫీసర్‌కు బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/ బీఎస్సీ (నర్సింగ్/ పోస్ట్ సర్టిఫికెట్)/బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/ డిప్లొమా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ). అలాగే ఏదైనా 50 పడకల ఆస్పత్రిలో కనీసం రెండేళ్ల అనుభవం. అలాగే అన్ని పోస్టుల అభ్యర్థులకూ స్టేట్/ ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్, మిడివైఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

వయసు : అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్‌కు 25-40 ఏళ్ల లోపు; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు 21-35 ఏళ్ల లోపు; నర్సింగ్ ఆఫీసర్‌కు 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ఏఎన్ఎస్‌కు అభ్యర్థుల సంఖ్యను బట్టి రాతపరీక్ష/ ఇంటర్వ్యూ; మిగిలిన పోస్టులకు రాతపరీక్ష.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నాటి నుంచి 30 రోజుల్లోపు.

వెబ్‌సైట్ : www.aiimsjodhpur.edu.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో 54 పోస్టులు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ స్టేషన్స్‌లో 54 గ్రూప్ 'సి' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

పోస్టు-ఖాళీలు : మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-12, హౌస్ కీపింగ్ స్టాఫ్ (హెచ్‌కేఎస్)-8, మెస్ స్టాఫ్-16, లాండ్రీమ్యాన్-2, కుక్ (ఆర్డినరీ గ్రేడ్)-6, కార్పెంటర్-3, పెయింటర్-2, వల్కనైజర్-1, ఎల్‌డీసీ-4.

అర్హతలు : ఎల్‌డీసికి ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యతోపాటు టైపింగ్, మిగిలిన పోస్టులకు పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే కార్పెంటర్, పెయింటర్‌కు అదనంగా సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ, కుక్ పోస్టుకు అదనంగా కేటరింగ్‌లో డిప్లొమా ఉండాలి.

వయసు : 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : రాతపరీక్ష, స్కిల్/ ప్రాక్టికల్/ ఫిజికల్ టెస్ట్.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు(ఏప్రిల్ 9, 2018).

వెబ్‌సైట్ : www.indianairforce.nic.in

బీఈసీఐఎల్‌లో 131 ఖాళీలు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) కార్పొరేట్ ఆఫీస్.. 131 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



పోస్టు-ఖాళీలు : పేషెంట్ కేర్ మేనేజర్ (పీసీఎం)-35; పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ)-96.

వేతనం : పీసీఎం-రూ.30,000; పీసీసీ-రూ.17,916.

అర్హతలు : పీసీఎంకు డిగ్రీ (లైఫ్‌సైన్సెస్)తోపాటు హాస్పిటల్/ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో పీజీ. అలాగే సంబంధిత రంగంలో ఏదైనా హాస్పిటల్‌లో కనీసం ఏడాది అనుభవం; పీసీసీకి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. లైఫ్‌సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. అలాగే ఏదైనా ఆసుపత్రిలో కనీసం ఏడాది అనుభవం ఉండాలి.

వయసు : ఉద్యోగంలో చేరే నాటికి పీసీఎంకు 40 ఏళ్లు; పీసీసీకి 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక : ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం : రూ.300; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ : ఏప్రిల్ 9, 2018.

వెబ్‌సైట్ : www.becil.com

ఇస్రో-స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో 80 ఉద్యోగాలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ : ఇస్రో)కు అనుబంధంగా అహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ).. 80 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డీ'-3; సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-1; టెక్నీషియన్ 'బి'-73 (ఫిట్టర్-14+ మెషినిస్ట్-4+ టర్నర్-1+ ఎలక్ట్రానిక్స్-34+ ఎలక్ట్రీషియన్-2+ ఎల్ఏసీపీ/ ఏవోసీపీ-4+ డిజిటల్ ఫొటోగ్రాఫర్-1+ ఆర్ఏసీ-2+ ఐటీ/ ఐసీటీఎస్ఎం/ ఐటీఈఎస్ఎం-9+ సీహెచ్ఎన్ఎం-2); కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-1; కుక్-2.

వేతనశ్రేణి : సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డి'-రూ.67,700-రూ.2,08,700; సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-రూ.44,900-రూ.1,42,400; టెక్నీషియన్ 'బి'-రూ.21,700-రూ.69,100; కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-రూ.18,000-రూ.56,900; కుక్-రూ.19,900-రూ.63,200.

అర్హతలు : సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డీ'కి.. ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో బీఈ/ బీటెక్‌ఎంఈ/ ఎంటెక్‌తోపాటు పీహెచ్‌డీ (ఎలక్ట్రానిక్స్/ వీఎల్ఎస్ఐ/ మైక్రోవేవ్); సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'కు బీఎస్సీ (మల్టీమీడియా/యానిమేషన్); టెక్నీషియన్ 'బి' పోస్టులకు పదో తరగతి/ తత్సమాన విద్యతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ/ ఎన్‌టీసీ/ఎన్ఏసీబీ కేటరింగ్ అటెండెంట్ 'ఎ', కుక్‌కు పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. కుక్ పోస్టులకు అదనంగా ఏదైనా హోటల్/ క్యాంటీన్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం.

వయసు : సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ', టెక్నీషియన్ 'బి', కుక్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు; కేటరింగ్ అటెండెంట్ 'ఎ'కు



18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డి'కి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

ఎంపిక : సంబంధిత పోస్టులను అనుసరించి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 2, 2018.

వెబ్‌సైట్ : www.sac.gov.in

నాబార్డ్‌లో 92 ఉద్యోగాలు

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్).. రూరల్ డెవలప్ మెంట్ బ్యాంకింగ్ సర్వీస్ (ఆర్‌డీబీఎస్)లోని 92 గ్రేడ్ 'ఎ' కేటగిరీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు : అసిస్టెంట్ మేనేజర్.

వేతనశ్రేణి : రూ.28,150-రూ.55,600.

విభాగాల వారీ ఖాళీలు : జనరల్-46, ఏనిమల్ హస్బెండరీ-5, చార్టర్డ్ అకౌంటెంట్-5, ఎకనమిక్స్-9, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-2, ఫుడ్ ప్రాసెసింగ్/ ఫుడ్ టెక్నాలజీ-4, ఫారెస్ట్రీ-4, ల్యాండ్ డెవలప్‌మెంట్ (సాయిల్ సైన్స్)/ అగ్రికల్చర్-8, మైనర్ ఇరిగేషన్ (వాటర్ రీసోర్సెస్)-6, సోషల్ వర్క్-3.

అర్హతలు : సంబంధిత విభాగాలను బట్టి కనీసం 50 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ-45 శాతం) మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో బ్యాచిలర్ డిగ్రీ/ పీజీ/ పీజీ డిప్లొమా/ ఎంబీఏ/ పీహెచ్‌డీ.

వయసు : 2018, మార్చి 1 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ.

ప్రిలిమినరీ పరీక్ష విధానం : దీన్ని ఆన్‌లైన్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 20 చొప్పున 80 ప్రశ్నలు; ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఎకనమిక్స్ అండ్ సోషల్ ఇష్యూస్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా), అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా) విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 40 చొప్పున 120 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.

మెయిన్ ఎగ్జామినేషన్ : ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో డిస్క్రిప్టివ్ విధానంలో 100 మార్కులకు ప్రశ్నలిస్తారు. జనరల్ ఇంగ్లిష్ కంప్రైజ్ ఎస్సే రైటింగ్, కాంప్రెహెన్షన్, రిపోర్ట్ రైటింగ్, పారాగ్రాఫ్ రైటింగ్, లెటర్ రైటింగ్, ఎస్సే-40 మార్కులకు, ప్రెస్సీస్-20 మార్కులకు, క్వశ్చన్ ఆన్ ప్రెస్సీస్ పారా- 20 మార్కులకు, రిపోర్ట్/ లెటర్ రైటింగ్-20 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. పేపర్-2లో సంబంధిత విభాగాలకు సంబంధించి 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి గంటన్నర.

ఇంటర్వ్యూ : మెయిన్స్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇది 25 మార్కులకు ఉంటుంది.

దరఖాస్తు రుసుం : ఎస్సీ/ఎస్టీ-రూ.150 (ఇంటిమేషన్ చార్జీలు మాత్రమే); మిగిలిన కేటగిరీలకు రూ.800(అప్లికేషన్ ఫీ-రూ.650+ ఇంటిమేషన్ చార్జీ-150).

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 2, 2018.

వెబ్‌సైట్ : www.nabard.org

16 పోస్టులకు యూపీఎస్సీ నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల పరిధిలోని 16 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : ట్రాన్స్‌లేటర్-2 (బర్మీస్-1+ పర్షియన్-1); లీగల్ ఆఫీసర్ గ్రేడ్ 3-5; పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)-4; స్టోర్స్ ఆఫీసర్ (ఎస్‌వో)-4; సీనియర్ లెక్చరర్-1 (టెక్స్‌టైల్ ప్రాసెసింగ్).

వేతనశ్రేణి : సీనియర్ లెక్చరర్‌కు రూ.15,600-రూ.39,100; లీగల్ ఆఫీసర్-రూ.67,700-రూ.2,08,700. స్టోర్స్ ఆఫీసర్‌కు పే స్కేల్ లెవెల్ 7, మిగిలిన పోస్టులకు పే స్కేల్ లెవెల్ 10 ప్రకారం వేతనశ్రేణి ఉంటుంది.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ డిప్లొమా ఇన్ ఫారెన్ లాంగ్వేజ్ (బర్మీస్/ పర్షియన్)/ మాస్టర్ డిగ్రీ ఇన్ లా (ఇంటర్నేషనల్ లా/ ఇంటర్నేషనల్ రిలేషన్స్/ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్)/ డిగ్రీ (లా/ ఇంజనీరింగ్/ సైన్స్/ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్/ టెక్స్‌టైల్ కెమిస్ట్రీలో బీఈ/బీటెక్/ డిగ్రీ/ పోస్ట్ డిప్లొమా. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో అనుభవం తదితర అర్హతలు ఉండాలి.

వయసు : స్టోర్స్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.



ఎంపిక : రాతపరీక్ష, ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం : రూ.25; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 29, 2018.

వెబ్‌సైట్ : www.upsc.gov.in, www.upsconline.nic.in

విశాలాంధ్ర బిజినెస్

-129.91 ▼	-40.91 ▼	150 ▲	బంగారం (విశాఖపట్నం)	400 ▲	వెండి (విశాఖపట్నం)	డాలరు
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	29,210	వెండి (విజయవాడ)	41,500	Vs
33,006.27	10,114.75	29,150	ప్రొద్దుటూరు 29,210	39,500	ప్రొద్దుటూరు 41,082	రూపాయి
			22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	65.10

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఓఎన్‌జీసీ	178.70	1.85
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,753.75	1.29
టాటామోటార్స్	338.20	1.29
రిలయన్స్	910.60	1.22
టాటా మోటార్స్ (డి)	191.10	1.03

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	241.60	-2.46
ఎం&ఎం	729.80	-2.14
విప్రో	289.25	-2.13
ఐసీఐసీఐబ్యాంక్	289.70	-2.09
మారుతిసుజుకి	9,000.00	-2.01

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.21	65.10
యూరో	80.02	80.22
పౌండ్	91.60	92.05
ఆస్ట్రేలియా డాలర్	50.08	50.21
సింగపూర్ డాలర్	49.45	49.49

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,230	31,262
చెన్నై	29,230	31,262
బెంగళూరు	28,650	30,641
ముంబై	29,790	31,860
విజయవాడ	29,150	31,550
విశాఖపట్నం	29,210	31,230
ప్రొద్దుటూరు	29,210	30,670
ముడి చమురు		69.47

భారత్, చైనాలపై ట్రంప్ కక్ష

- ఉక్కు ఉత్పత్తులపై ట్రంప్ పన్నుల బాదుడు
- స్టీల్ ఫ్లాంజ్‌లపై దిగుమతి వ్యతిరేక సుంకం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో వివాదాస్పద నిర్ణయానికొచ్చారు. భారత్, చైనా నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌పై దిగుమతి వ్యతిరేక సుంకాన్ని విధించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అమెరికాలోకి జరుగుతున్న విదేశీ ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం, 10 శాతం చొప్పున పన్నులను వేసిన ట్రంప్.. ఇప్పుడు ప్రత్యేకంగా భారత్, చైనాలపై ఈ దిగుమతి వ్యతిరేక సుంకం వేసేందుకు సిద్ధమయ్యారు. ఎగుమతిదారులకు భారత్, చైనాలు రాయితీలను ఇస్తున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని చెబుతున్న అమెరికా.. అందుకే ఈ నిర్ణయానికి వచ్చినట్లు అంటున్నది. అమెరికా పరిశ్రమల మనుగడకు, అక్కడివారి ఉద్యోగాలకు ముప్పు తెస్తున్న వారిని ఉపేక్షించబోమని చెబుతున్న ట్రంప్.. తొలుత ఐటీ రంగాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. హెచ్-1బీ వీసా విధానాలను కఠినతరం చేయగా, ఇప్పుడు ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలపై పడ్డారు. అమెరికా మార్కెట్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌ను చైనా ఎగుమతి దారులు 257.11 శాతం, భారత్ ఎగుమతిదారులు 18.10 శాతం నుంచి 145.25 శాతం వరకు తక్కువ ధరలకే అమ్ముతున్నారని గుర్తించినట్లు అగ్రరాజ్య వాణిజ్య శాఖ అంటున్నది. ది కొలిషన్ ఆఫ్ అమెరికన్ ఫ్లాంజ్ ప్రొడ్యూసర్స్, కోర్ పైప్ ప్రోడక్ట్స్ ఇండస్ట్రీస్, మాస్ ఫ్లాంజ్ కార్పొరేషన్ ఫిర్యాదులతో ప్రాథమిక విచారణ జరిపినట్లు యూఎస్ వాణిజ్య శాఖ తెలిపింది.

తమ విచారణలో స్థానిక ఉత్పత్తిదారులు నష్టపోతున్నారని తేలడంతోనే దిగుమతి వ్యతిరేక సుంకాన్ని వేయాలని నిర్ణయించినట్లు అమెరికా వాణిజ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇందులోభాగంగానే చైనా, భారత్‌ల స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌ను దిగుమతి చేసుకుంటున్నవారి నుంచి నిర్దేశిత మొత్తాల్లో నగదు డిపాజిట్లను తీసుకోవాలని అమెరికా కస్టమ్స్, సరిహద్దు రక్షణ శాఖకు వాణిజ్య శాఖ సూచనలు చేయనున్నది. 2016లో చైనా నుంచి అమెరికాకు స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్ ఎగుమతుల విలువ 16.3 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు అంచనా. భారత్ నుంచి 32.1 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, అక్రమ వాణిజ్య విధానాలకు ప్రభావితమవుతున్న అమెరికా సంస్థలు, పరిశ్రమలకు ఊరటనిచ్చేందుకు అక్కడి వాణిజ్య శాఖ పెద్ద ఎత్తున యాంటీ-డంపింగ్, కౌంటర్‌వీలింగ్ సుంకాల ఆదేశాలను జారీ చేస్తుండటం గమనార్హం.

మళ్లీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

130పాయింట్ల దిగువన సెన్సెక్స్



ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావుశాతం పెంచడంతో... దేశీయ బ్యాంకింగ్ రంగాలపై పెను ప్రభావం చూపింది. బెంచ్‌మార్కు సూచీలు గురువారం నష్టాల్లో ట్రేడయ్యాయి. రియాల్టీ, కాపిటల్ గూడ్స్, టెక్,ఆటో, బ్యాంకింగ్ స్టాక్స్ లాభాల స్వీకరణకు గుర య్యాయి. నెలవారీ డెరివేటివ్స్ కాంట్రాక్టు ముగియ నుండటంతో ఈ ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై పెను ప్రభావం చూపింది. బెంచ్‌మార్కు బిఎస్‌ఇ ఇండెక్స్ 129.91 పాయింట్లతో(0.39శాతం) 33,006.27 పాయింట్ల వద్ద, నిఫ్టీ 0.4శాతంతో 40.50పాయింట్ల దిగువన 10,114.75 వద్ద ముగిసింది. ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్, ఎస్‌బీఐ 2.1శాతం, 2.6 శాతం నష్టాల్లో నమోదయ్యాయి. గత రెండు సెషన్లలోనూ ఇండెక్స్ 213.06 పాయింట్లు లాభాలను నమోదుచేసింది. ఆసియా మార్కెట్లు మిశ్రమ ఫలితాలను నమోదుచేసాయి. ఎస్‌బీఐ, ఐసిఐసిఐ బ్యాంకు, పిఎన్‌బి, కెనరా బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, యస్ బ్యాకు, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.62 శాతంతో నష్టాల్లో ముగిసాయి. విదేశీ మదుపరులు రూ.98.44 కోట్ల విలువైన షేర్లను కొనుగోలుచేయగా దేశీయ మదుపరులు రూ.197.78కోట్లు కొనుగోలు చేసినట్లు నమోదైంది. ఎమ్ అండ్ ఎమ్, అదానీ పోర్ట్స్, ఐసిఐసిఐ బ్యాంకు, ఎస్‌బీఐ, మారుతి 2.17శాతం దిగజారాయి. ఓఎన్‌జీసీ, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ 2శాతంతో ప్రధాన లబ్దిదారులుగా నిలిచాయి. నిఫ్టీ మిడ్‌కాప్ 0.84శాతం డౌన్ అయింది. డాలర్‌తో రూపాయి మారకపు విలు 10పైసలు లాభపడి 65.11 వద్ద నిలిచింది. అమెరికా ఫెడరల్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో ఆసియామార్కెట్లు తీవ్ర ఊగి సలాటకు లోనయ్యాయి. నిక్కీ 223 ఇండెక్స్ 0.99 శాతంతో 211.02 పాయింట్లతో 21,591.99, టాపిక్స్ స్వంగ్ లాభాల నష్టాల మధ్య 0.65శాతంతో 11.10 పాయింట్లతో 1727.39 వద్ద ముగిసింది.

కస్టమర్లకు తప్పని బ్యాంకు షాకులు

ముంబై: ఓవైపు ప్రభుత్వం డిజిటల్ పేమెంట్స్ అంటూ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పేమెంట్స్‌ను ఎంకరేజ్ చేస్తుంటే.. మరోవైపు బ్యాంకులు మాత్రం సాధ్యమైనంత దండుకోవడానికి చూస్తున్నాయి. డెబిట్ కార్డ్ స్వైప్ చేసినపుడు ట్రాన్సక్షన్ డి?క్లైన్ అని వస్తే ఇక నుంచి మీకు చార్జీ పడినట్లే. అకౌంట్‌లో కనీస నిల్వలు లేని సమయంలో డెబిట్ కార్డు ట్రాన్సక్షన్ డి?క్లైన్డ్ అని వస్తుంది. ఈ సమయంలో ప్రతి స్వైప్‌కు రూ.17 నుంచి రూ.25 వరకు చార్జీ వేస్తున్నారు. దీనికి జీఎస్టీ అదనం. ఏటీఎంలో అయినా, పీఓఎస్ మెషీన్‌లో అయినా ట్రాన్సక్షన్ డిక్లైన్ అయితే చార్జ్ పడుతుంది. ఎస్‌బీఐ ఇలాంటి ప్రతి స్వైప్‌కు రూ.17 వసూలు చేస్తున్నది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు రూ.25 వసూలు చేస్తున్నాయి. ఇవి చాలా దారుణమైన చార్జీలు అని ఐఐటీ బాంబే ప్రొఫెసర్ ఆశిష్ దాస్ అన్నారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ డిజిటల్ పేమెంట్స్ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. తమ డెబిట్ కార్డుల ద్వారా షాపింగ్ చేయాలని ఓవైపు తమ కస్టమర్లకు సూచిస్తూనే మరోవైపు ఈ బాదుడు మొదలుపెట్టాయి. చెక్ నిరాకరించినపుడు చార్జీలు వసూలు చేసినట్లే... దీనికీ చేస్తున్నామని బ్యాంకులు వాదిస్తున్నాయి. ఒకవేళ డెబిట్ కార్డులను దుర్వినియోగం చేస్తున్నారని భావిస్తే నెలకు రెండు అవకాశాలు ఇచ్చి, తర్వాత చార్జీలు వసూలు చేస్తే బాగుంటుందని ఆశిష్ దాస్ చెప్పారు.

10పైసలు పెరిగిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపువిలువ గురువారం 10పైసలు పెరిగింది. అమెరికా ఫెడరల్ పావుశాతం పెండచంతో దీని ప్రభావం డాలర్‌పై ప్రభావం చూపింది. రూపాయి 10పైసలు పెరిగి 65.11 నమోదుచేసింది. 65.12 వద్ద ప్రారంభమైనరూపాయి ఇంట్రాడేలో 65.14 మరియు 6.02 మధ్య ఊగిసలాడింది. 2019, 2020నాటికి మరింత వడ్డీరేట్లను పెంచనున్న నేపథ్యంలో డాలర్ బలహీనపడిందని చెప్పవచ్చు.

ప్రిఫర్డ్ హోటల్స్ ఆసియా పసిఫిక్ సిరీస్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా 650కి పైగా విశిష్ట మెంబర్ హోటల్స్, రిసార్ట్స్, రెసిడెన్సీలతో అతి పెద్ద స్వతంత్ర హోటల్ బ్రాండ్ ప్రిఫర్డ్ హోటల్స్ రిసార్ట్స్ తన 50వ వార్షికోత్సవ ఆసియా పసిఫిక్ సిరీస్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సంస్థ సీఈవో లిండెస్-బెర్‌రౌత్, ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ సౌరభ్ రాయ్ ఆతిథ్యమిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రీఫర్డ్ బ్రాండ్ 50 ఏళ్ల స్ఫూర్తిదాయక ప్రయాణ వారసత్వాన్ని వేడుకగా చేసుకుంటున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పర్యాటకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. స్నేహితులతో కలిసి వేడుక చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.


చమురు ధరలకు రెక్కలు



న్యూఢిల్లీ: చమురు ధరలు గురువారం మరోసారి ఆకాశాన్నం టాయి. అంచనాలకు విరుద్ధంగా అమెరికా ఇంధన నిల్వలు తగ్గడం, డాలర్ బలహీనతతో చమురు ధరలు బుధవారం మరోసారి వేడెక్కాయి. మంగళవారం పుంజుకున్న చమురు ధరలు మరింత ఎగిసి ఏడువారాల గరిష్టాన్ని నమోదు చేశాయి. యుఎస్ వెస్ టెక్సాస్ ఇంటర్‌మీడియట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్ 10సెంట్స్‌పెరిగి 0.2శాతంతో 65.27 డాలర్లు నమోదుచేసింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 1 సెంట్లుపెరిగి 0.1శాతంతో 69.53 డాలర్లకుచేరింది. వాషింగ్టన్ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఆంక్షలు తిరిగి ప్రవేశపెడుతున్నట్లు కనిపిస్తోందనీ, ఇది ముడి చమురు ఉత్పత్తి, ఎగుమతి చేసే సామర్థ్యాన్ని దెబ్బతీయనుందని డెన్మార్క్ సాక్సో బ్యాంక్ కమొడిటీ స్ట్రాటజిస్ట్ హెడ్ ఓలే హాన్సెన్ పేర్కొన్నారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు కూడా చమురు ధరలకు తోడ్పడుతున్నాయని విశ్లేషకుల అంచనా.

యూఎస్ మార్కెట్ నైమెక్స్ చమురు బ్యారల్ 0.3 శాతం బలపడి 65.39 డాలర్లను తాకగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు సైతం బ్యారల్ 0.3 శాతం ఎగసి దాదాపు 70 డాలర్లకు చేరింది. వెరసి ఏడు వారాల గరిష్టానికి చమురు ధరలు చేరాయి. కాగా.. ప్రస్తుతం నైమెక్స్ 65.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బ్రెంట్ బ్యారల్ 69.50 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మార్చి 16తో ముగిసిన వారంలో చమురు నిల్వలు 2.74 మిలియన్ బ్యారళ్లు తగ్గినట్లు మంగళవారం అమెరికా ఇంధన శాఖ వెల్లడించింది. వాస్తవానికి 2.55 మిలియన్ బ్యారళ్లమేర నిల్వలు పెరగనున్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు. దీంతో 5మిలియన్ బ్యారళ్లమేర అంచనాలు తారుమారు కావడంతో చమురు ధరలు భారీగా పెరిగాయని నిపుణులు తెలియజేశారు.

ప్రపంచంలోనే అతి చిన్న కంప్యూటర్



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, సూక్ష్మ కంప్యూటర్‌ను ప్రముఖ కంపెనీ ఐబీఎమ్ రూపొందించినట్లు ప్రకటించింది. దీని పరిమాణం 1ఎంఎం/1ఎంఎంతో దాదాపు ఇది ఉప్పు స్ఫటికం అంత సైజులో ఉంటుంది. దీన్నిలో అమర్చిన విడిభాగాలను చూడాలంటే మైక్రోస్కోప్‌లో చూడవలసిందే... లాజిస్టిక్స్ అప్లికేషన్స్ కోసం రూపొందించిన ఈ కంప్యూటర్ ధర 0.10 డాలర్ల కంటే తక్కువగా ఉంటుందని కంపెనీ పేర్కొంటోంది. దీనికి సంబంధించిన ప్రొటోటైప్ డివైస్‌ను కంపెనీ ఆవిష్కరించింది. 'థింక్ 2018 కాన్ఫరెన్స్'లో దీని వివరాలను వెల్లడించింది. దీనిలో వేలాది ట్రాన్సిస్టర్లు, మెమొరీ, ఫొటోవోల్టిక్ పవర్ సప్లైని పొందుపరిచారు. 'అతి చిన్న, చౌకైన దీన్ని ఏ డివైజ్‌కైనా అమర్చుకోవచ్చు. ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు' అని కంపెనీ పేర్కొంది. రోజువారీ వినియోగించే ఎలక్ట్రానిక్ వస్తువుల్లో దీన్ని అమర్చుకోవచ్చు.

ఇక దీని ఫెర్‌ఫెర్మాన్స్ విషయానికొస్తే 1980ల్లోని ఎక్స్ 86 చిప్‌తో ఐబిఎం డెస్క్‌టాప్ కంప్యూటర్ తరహాలో పనిచేస్తుంది. దీన్ని బట్టి ఈ బుల్లి కంప్యూటర్ అద్భుత పనితీరు కనబరుస్తుందని చెప్పలేం.. కానీ బ్లాక్‌చైన్ విభాగంలో జరిగే డేటా మోసాలను సమర్థవంతంగా రికార్డ్ చేయగలుగుతుంది. రానున్న ఐదు సంవత్సరాల్లో ఇంక్ డాట్స్, టైనీ కంప్యూ టర్లను ప్రతి డివైజ్‌లోనూ అమర్చుకునే వీలుంది.

సేవల రంగ ఎగుమతులకు ప్రోత్సాహం: సురేష్ ప్రభు



ముంబై: దేశంలోని మొత్తం ఎగుమతుల్లో సేవలరంగ ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు పేర్కొన్నారు. ఇది దేశంలోని మొత్తం ఎగుమతులను పెంచే వస్తువుల కంటే మరింత వేగంగా వృద్ధిని నమోదుచేస్తుందని పేర్కొన్నారు. గడిచిన నెలలో దేశంలో ఎగుమతులు వృద్ధిని నమోదుచేసాయి. ఎగుమతుల్లో సాంప్రదాయ ఉత్పత్తులనే కాకుండా నూతన ఉత్పత్తులకు చోటు కల్పిం చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. ముఖ్యంగా సేవల రంగాలపై దృష్టిపెడుతూ ముఖ్యంగా 12రంగాలను 'ఛాంపియన్ సర్వీసెస్' గా గుర్తించినట్లు కాప్ ఇండియా ప్రారంభోత్సవ సమావే శంలో సురేష్ ప్రభు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.5,000 కోట్లను ఐటి, టూరిజం, హాస్పిటాలిటీ వంటి 12 ఛాంపియన్ సర్వీసెస్‌కు కేటాయించినట్లు తెలిపారు. భారతదేశంలో సేవల ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా, ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాలను ప్రోత్సహించేందుకుగాను సంబంధిత కారాయచరణ పథకాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. సేవల రంగం దేశ ఆర్థికప్రగతికి, పరిశ్రమలకు ఊతం కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు.

చక్కెరపై ఎగుమతి సుంకం రద్దు



న్యూఢిల్లీ: చక్కెరపై ఎగుమతి సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత మార్కె టింగ్ సీజన్‌లో దేశీయంగా రికార్డు స్థాయిలో 29.5 మిలి యన్ టన్నుల చక్కెర ఉత్పత్తికి రంగం సిద్ధమవడంతో ఎగుమతులకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ఇందుకు సంబంధించి కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు (సీబీఈసీ) ఒక నోటి ఫికేషన్‌ను జారీ చేసింది. ముడి చక్కెరతో పాటు రిఫైన్డ్ (తెల్ల) చక్కెరపై ప్రస్తుతం 20 శాతంగా ఉన్న ఎగుమతి సుంకాన్ని పూర్తిగా రద్దు చేయా లని నిర్ణయించామని సీబీఈసీ ఆ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. గతంలో ప్రభుత్వం దిగుమతులను నియంత్రిం చేందుకు చక్కెరపై దిగు మతి సుంకాన్ని రెట్టింపు చేసి 100 శాతా నికి పెంచిన విషయం తెలి సిందే. అయితే ప్రపంచంలో అత్యధికంగా చకెరను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో రెండవదిగా ఉన్న మన దేశంలో గత ఏడాది 20.3 మిలియన్ టన్నులుగా ఉన్న చక్కెర ఉత్పత్తి ప్రస్తుత 2017-18 మార్కెటింగ్ సంవ త్సరం (అక్టోబర్-సెప్టెంబర్)లో గణనీయంగా పెరిగి 29.5 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. దేశీయ అవసరాల కోసం సాలీనా 24-25 మిలియన్ టన్నుల చక్కెర సరిపోతుండగా, ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరంలో ఈ నెల 15వ తేదీ నాటికే 25.80 మిలియన్ టన్నుల చక్కెర ఉత్పత్తి జరిగింది. మరోవైపు దేశంలో చక్కెర ధరలు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ స్థాయికి పడిపోవడంతో మిగులు నిల్వలను వదిలించుకునేందుకు వీలుగా ఎగుమతి సుంకాన్ని రద్దు చేయాలని ఇస్మా (ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్), ఎన్‌ఎఫ్‌సీఎస్‌ఎఫ్ (సహకార చక్కెర కర్మాగారాల జాతీయ సమాఖ్య) చాలా రోజులనుంచి డిమాండ్ చేస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది.

చమురు బావుల వేలానికి స్పందన భేష్



హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న చమురు బావుల వేలానికి అనూహ్య స్పందన లభించిందని డైరెక్టర్ -జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్(డీజీహెచ్) డైరెక్టర్ జనరల్ అటాను చక్రవర్తి తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కేంద్ర చమురు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. 55 ఆయిల్ అండ్ గ్యాస్ బ్లాక్‌లకుగాను తొలి విడుత నిర్వహించిన వేలం పాటలో సుమారు వందకు పైగా దేశీయ, అంతర్జాతీయ సంస్థలు పోటీపడ్డాయని చెప్పారు. మరో రెండు వారాల్లో ముగియనున్న ఈ వేలం ప్రక్రియను మరో పక్షం రోజులు పెంచే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు. హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ(హెల్ప్) కింద నిర్వహిస్తున్న తొలి రౌండ్ బావుల వేలం ప్రక్రియను జనవరిలో ప్రారంభమైంది. 11 రాష్ట్రాల్లో 59,282 చదరపు కిలోమీటర్ల మేర పరిధి కలిగిన ఈ బావులు 2020-21 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాగోదావరి బేసిన్ కూడా ఉన్నది. ఈ హెల్ప్ పథకం కింద అభివృద్ధి చేయనున్న ఈ బావుల ద్వారా సమకూరనున్న ఆదాయాన్ని కేంద్రం పంచుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. హైడ్రోకార్బన్లను ఉత్పత్తి చేసే సంస్థలకు ఒకే లైసెన్స్ ఇచ్చే ప్రతిపాదన కూడా ఉందన్నారు. డీఎస్‌ఎఫ్-2 కింద మరో 60 బ్లాకలను వేలం వేయాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. మొదటి విడుత చమురు బావుల కోసం రూ.46,400 కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నది. అలాగే పన్నుల రూపంలో కేంద్రానికి రూ.9,300 కోట్లు, రాయల్టీ కింద మరో రూ.5 వేల కోట్లు సమకూరనున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డీవెన్ మిశ్రా మాట్లాడుతూ..ప్రస్తుతం భారత్‌లో 37 మిలియన్ టన్నుల క్రూడాయిల్ ఉత్పత్తి అవుతుండగా, డిమాండ్ మాత్రం 110-120 మిలియన్ టన్నులుగా ఉందన్నారు. 2022 నాటికి చమురు దిగుమతిని మరో 10 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్రం పలు కీలక చర్యలు తీసుకుంటున్నదని, దీంట్లోభాగంగానే బావుల వేలంలో వేగం పెంచినట్లు చెప్పారు. ప్రతియేటా భారత్‌లో చమురు డిమాండ్ 4 శాతం నుంచి 4.5 శాతం వరకు పెరుగుతున్నదన్నారు

విజ్ఞానం



కేన్సర్ కణాల ప్రోటీన్ గుర్తింపు

కాలేయంలో కేన్సర్ కణాలను నిరోధించే ప్రోటీన్‌ను స్విస్ శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఎల్‌హెచ్‌పిపి అనే ఈ ప్రోటీన్ లివర్‌కేన్సర్ రోగ నిర్ధారణకు బయోమార్కర్‌గా పనిచేస్తుందని తెలుస్తోంది. స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బేసల్ అధ్యయనకారలు ఎల్‌హెచ్‌పిపి ప్రోటీన్ కేన్సర్ కనితి పెరుగుదలను నియంత్రించడంతోపాటు కేన్సర్ రోగి జీవించేందుకు సహకరిస్తుందని తెలుస్తోంది. హెపాటొసెల్యులార్ కార్సినోమా అనే లివర్‌కేన్సర్ నిదానంగా పెరిగే గుణాన్ని కలిగి ఉంటుంది. ఈ కేన్సర్‌ను చివరి దశలో గుర్తించడం జరుగుతుంది. ఈ పరిస్థితిలో లివర్‌కూడా పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. 4,000 పైగా గుర్తించిన ప్రోటీన్లను విశ్లేషించి వీటిని ఆరోగ్యకరమై, ట్యూమర్ కణాలతో పోల్చడమైంది. హిస్టిడిన్ ఫాస్ఫలేడ్ ఎల్‌హెచ్‌పిపి అనే ఎంజైమ్ టాప్ ఫేవరెట్‌గా ఉద్భవించింది. ఎల్‌హెచ్‌పిపి అనే ఈ టిష్యూ ఆరోగ్యకర కణజాలంలో ఉండగా, కేన్సర్‌కణాల్లో లేనట్లు వెల్లడైంది.

అల్ట్రాసౌండ్‌తో కేన్సర్ డ్రగ్ టాక్సిసిటీ తగ్గింపు



అల్ట్రా సౌండ్ తరంగాలు కేన్సర్ డ్రగ్ విడుదలను మెరుగు పరచడంతో పాటు టాక్సిసిటీని తగ్గిస్తాయని శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. ట్రాన్స్‌లేషనల్ జీనోమిక్స్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం ప్రకారం, కొన్నిదశాబ్దాలుగా గుండె,కిడ్నీలకు రక్త ప్రసరణను, పిండం పెరుగుదలను, నొప్పి తగ్గించడంలోనూ, కిడ్నీలో రాళ్లు కరిగించేందుకు అల్ట్రాసౌండ్‌వేవ్స్‌ను ఉపయోగించడం పరిపాటే...తాజాగా నార్వేజియన్ బయోటిక్ కంపెనీ అయిన ఫీనిక్స్ సొల్యూషన్స్ టిజెన్‌తో జరిపిన అధ్యయనంలో కేన్సర్ డ్రగ్ థెరపీలో సౌండ్ వేవ్స్‌ను నేరుగా ప్రసరింపచేయడంతో పరీక్షలు చేపట్టారు. విభిన్నమైన అకౌస్టిక్ క్లస్టర్ థెరపీతో కేన్సర్ సెల్స్‌పై జరిపే కీమోథెరపీలో కేన్సర్ డ్రగ్ టాక్సిసిటీని తగ్గిస్తున్నట్లు వెల్లడైంది.



ఆకట్టుకుంటున్న కాటన్ మేళా


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: క్రాఫ్ట్ అండ్ వీవర్ ఆర్టసన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీలో ఏర్పాటు చేసిన కాటన్ సిల్క్ వస్త్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వందలాది వెరైటీలు, డిజైన్లు మగువుల మనసు దోచేలా ఉన్నాయి. మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, కళంకారి, పోచంపల్లి, చందేరిసిల్క్, రాజస్థాన్ కాటన్, హ్యాండ్‌బ్లాక్ ప్రింట్, బాగల్‌పూర్, బెంగాలీ కాటన్, కాశ్మీరిసిల్క్, లక్నోచికాన్, బనారస్, డిజైనర్ సూట్స్, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు వస్త్ర ప్రదర్శనలో ఉన్నాయి. ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 వరకు ప్రదర్శన కొనసాగనుంది.

బిగ్‌బ్యాంగ్ హోం కార్నివాల్‌కు మిశ్రమ స్పందన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: గృహ కొనుగోళ్ళు లేదా ఫైనాన్సు కోసం 70వేల మంది బయ్యర్లు సిద్దంగా వున్నారని ఎస్‌బీఐ - మ్యాజిక్ బ్రిక్స్ సంస్థలు వెల్లడించాయి. తమ ఆధ్వర్యంలో నిర్వహించిన బిగ్ బ్యాంగ్ హోం కార్నివాల్ ఉత్సాహభరితమైన ఫలితాలను అందించిందన్నారు. ఈ ప్రత్యేకమైన ఆన్‌లైన్ హౌసింగ్ ఫెస్టివల్‌లో 22 భారతీయ నగరాల్లో దాదాపు 16వేల యూనిట్లను ప్రదర్శించగా, 85 మంది డెవలపర్లు, 130 ప్రాజెక్టులను ప్రదర్శించారని, గృహ కొనుగోలుదారుల కోసం 1000కిపైగా ప్రాపర్టీలు ప్రత్యేకమైన డీల్స్‌ను అందిస్తున్నట్లు వివరించాయి. ఈ సందర్భగా ఎస్‌బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ ఎండీ.పీకే గుప్తా మాట్లాడుతూ రెండు సంస్థలు కలిసి చేపట్టిన కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. కస్టమర్లకు కావాల్సిన ప్రాపర్టీల కోసం అన్వేషణ జరపడంతో పాటు గృహ రుణాలకు సంబంధించి ఉత్తమమైన అవకాశాలు ఒకే చోట అందించమే తమ లక్ష్యమన్నారు. మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుదీర్‌పాయ్ మాట్లాడుతూ మార్కెట్‌పై వినియోగదారుల విశ్వాసం తిరిగి నెలకుందన్నారు. రూ.50లక్షల కంటే తక్కువ ధర విభాగంలో సుమారు 50శాతం మంది సెర్చ్ జరిపారని వెల్లడించారు. భవిష్యత్‌లో రెండు సంస్థల ఆధ్వర్యంలో మరింత మంది కస్టమర్లకు సేవలు అందిస్తామని ఆ సంస్థలు పేర్కొన్నాయి.

20 వేల కోట్ల సేకరణలో జియో

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికం సంస్థ రిలయన్స్ జియో రూ.20 వేల కోట్ల నిధులను సేకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఈ నెల 23న జరుగనున్న బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం పొద్దుపోయిన తర్వాత సంస్థ నేషనల్ స్టాక్ ఎక్సేంజ్‌లకు సమాచారం అందించింది. సెక్యూర్డ్/అన్ సెక్యూర్డ్, లిస్ట్/అన్‌లిస్ట్, నాన్-కన్వెర్టబుల్ డిబెంచర్లను జారీ చేయడం ద్వారా ఈ భారీ స్థాయిలోనిధులను సేకరించాలనుకుంటున్నది. అప్పులను తగ్గించుకోవడానికి రూ.16,500 కోట్ల నిధులను సేకరించాలను కుంటున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత జియో నిధుల సేకరణకు సిద్ధం కావడం విశేషం. 16 కోట్ల మంది వినియోగ దారులు కలిగిన జియో ఇప్పటి వరకు రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది.




తెలివైన తీర్పు

ఒక ఊరిలో గంగయ్య అనే పేదవాడు ఉండేవాడు. అతడు కట్టెలు అమ్ముకుని జీవించేవాడు. అతడు కూర్చునే చోటికి కొద్ది దూరంలో ఫలహారశాల ఉండేది. మధ్యాహ్నం పూట అక్కడి నుంచి వచ్చే వంటకాల కమ్మని వాసనలను పీలుస్తూ ఇంటి నుంచి తెచ్చుకున్న అన్నం తినేవాడు. గంగయ్య అలా తినడం ఒకరోజు ఫలహారశాల యజమాని వెంగళయ్య చూశాడు. ఓయ్ "నువ్వు నా వంటకాల వాసనలను పీలుస్తూ కడుపు నింపుకుంటున్నావ్ కాబట్టి డబ్బు చెల్లించు" అన్నాడు. వాసన పీలిస్తే డబ్బు చెల్లించడమేమిటి? ఇది అన్యాయం అన్నాడు గంగయ్య అయినా వెంగళయ్య వినిపించుకోకుండా డబ్బు చెల్లించమని పట్టుబట్టాడు. దాంతో ఇద్దరూ న్యాయాధికారి దగ్గరకు వెళ్లి సమస్యను విన్నవించారు. అంతా విన్న న్యాయాధికారి " నువ్వు చేసిన నేరానికి వంద వరహాలు వెంగళయ్యకు చెల్లించాల్సిందే" అన్నాడు గంగయ్యను ఉద్దేశించి. "రక్షించాల్సిన మీరే అలా అంటే నాలాంటి పేదవాడికి న్యాయం ఎక్కడ జరుగుతుంది" అని వాపోయాడు గంగయ్య. "ఇదిగో ఈ డబ్బుని వెంగళయ్యకు ఇవ్వు" అని వరహాల మూటని అతడి చేతిలో పెట్టాడు న్యాయాధికారి. దాన్ని తీసుకొని వెంగళయ్యకు ఇచ్చే లోపల "ఆ మూటను ఒక్కసారి అటూ ఇటూ కదుపు" అన్నాడు న్యాయాధికారి. గంగయ్య అలాగే చేశాడు. వెంగళయ్య, నాణేల శబ్దం వినిపించిందా? అని అడిగాడు న్యాయాధికారి. 'వినిపించింది" అన్నాడు వెంగళయ్య.అయితే నీ పరిహారం సొమ్ము నీకు ముట్టినట్టే అన్నాడు న్యాయాధికారి. ఇదెక్కడి అన్యాయం. నాణేల శబ్దం వినిపించి సొమ్ము ముట్టినట్టే అంటారేమిటి అని ప్రశ్నించాడు వెంగళయ్య. "నీ ఫలహరశాల నుండి వచ్చిన వాసనలు పీల్చినంత మాత్రానే గంగయ్య కడుపు నిండినప్పుడు నాణేల శబ్దం వినిపిస్తే నీకు ముట్టినట్టేగా అన్నాడు" న్యాయాధికారి. దాంతో తన తప్పును ఒప్పుకొని క్షమించమని వేడుకున్నాడు వెంగళయ్య.

(నీతి : తెలివి ఏ ఒక్కరి సొత్తు కాదు.)


చుక్కలు కలపండి



సరైన పదాన్ని పూరించండి



దారి కనుక్కోండి



ఆ సంఖ్య



అది మూడు అంకెలు గల సంఖ్య. ఈ సంఖ్యను ఆరుతో భాగించితే ఒకటి. ఏడుతో భాగించితే నాలుగు శేషంగా వస్తుంది. అలాగే ఎనిమిదితో భాగించితే ఐదు, పదితో భాగించితే మూడు శేషంగా వస్తుంది. ఈ ఆధారాలతో ఏడువందలలోపు గల ఆ సంఖ్య ఏమిటో కనుక్కోండి?

జవాబు : 613

కనుక్కోండి?

ఆ అంకెను మూడుచేత గుణించి, నాలుగు కలిపి, తొమ్మిది తీసివేశాక 2,5 గుణించండి. దాని వర్గమూలం ఐదు వస్తుంది. ఆ అంకె ఎంత?

జవాబు : ఐదు

పొడుపు కథలు

1. తలుపుల సందున మెరుపుల గిన్నె. (దీపం)
2. తొడిమిలేని పండు, ఆకులేని పంట. (విభూది పండు)

రంగులు వేయండి



కర్తవ్యంతో మా బేనర్‌కు మంచిపేరు

నిర్మాత శరత్‌మరార్

ఎన్ని కమర్షియల్ చిత్రాలు చేసి, ఎన్ని కోట్ల రూపాయలు సంపాదించినా ఓ మంచి చిత్రానికి వచ్చే ప్రశంసలు గుండెని తడిచేస్తాయనేది అక్షర సత్యం. అప్పుడు మనసు ఎంత హాయిగా వుంటుందో మాటల్లో వర్ణించలేము. ఇప్పుడు కర్తవ్యం లాంటి అద్భుతమైన చిత్రాన్ని తెలుగుకి తీసుకువచ్చిన ప్రముఖ నిర్మాత శరత్ మరార్ ఫీలింగ్ అంతకుమించే వుందని చెప్పాలి. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌తో గోపాలా గోపాల, సర్దార్ గబ్బర్‌సింగ్, కాటమ రాయుడు లాంటి కమర్షియల్ సూపర్‌హిట్స్ సాధించారు.

ఆ తరువాత సందేశాత్మక చిత్రంగా తమిళ ప్రేక్షకుల్ని ఊర్రూతలూగించిన విజయ్ నటించిన మెర్సల్ చిత్రాన్ని తెలుగులో అదిరింది అనే టైటిల్‌తో విడుదల చేశారు. ఈ చిత్రం అటు కమర్షియల్‌గా, ఇటు క్రిటిక్స్ పరంగా ప్రశంసలు వచ్చాయి. అలాగే బోరు బావిలో చిన్న పిల్లలు ఆడుకుంటూ పడిపోతే అక్కడ వాళ్ళని సేవ్ చేయాటానికి ఎటువంటి ఎక్విప్‌మెంట్ లేక ఇబ్బందులు పడుతారో.. ఎక్కువ శాతం పిల్లల ప్రాణాలు కొల్పోతున్న పరిస్థితుల్ని న్యూస్ ఛానెల్స్‌లో మనం చూస్తుంటాం. అలాంటి సంఘటనల్ని కళ్ళకి కట్టినట్టుగా తెరకెక్కించిన చిత్రం కర్తవ్యం.





ఈ చిత్రాన్ని ఈ నెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు నిర్మాత శరత్ మరార్. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడు చిత్రాన్ని, దర్శకుడ్ని, కథానాయిక నయనతారని ఓ రేంజిలో ప్రశంసిస్తున్నారు. ఇలాంటి ఓ అద్భుతమైన చిత్రాన్ని ఎంతో ధైర్యంతో తెలుగుకి తీసుకువచ్చిన నిర్మాత శరత్ మరార్‌కు అభిందనల ప్రశంసలు అందిస్తున్నారు. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వరుసగా అదిరింది, కర్తవ్యం లాంటి సామాజిక ధృక్పదం కలిగివున్న చిత్రాలు రావటంతో తెలుగు ప్రేక్షకుడికి ఈ బ్యానర్‌పై రెట్టింపు గౌరవం పెరిగింది. ప్రస్తుతం కర్తవ్యం మంచి కలెక్షన్లతో ధియేటర్స్‌లో ప్రదర్శింపబడుతోంది.

ఈ సందర్భంగా నిర్మాత శరత్ మరార్ మాట్లాడుతూ.. మా నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌తో చాలా మంచి కమర్షియల్ చిత్రాలు చేశాము. ఆ తరువాత మేము చేసిన అదిరింది చిత్రం మెడికల్ మాఫియా గురించి ప్రజలందరికి తెలియజెప్పిన చిత్రంగా ప్రశంసలు అందుకున్నాం. ఆ తరువాత వచ్చిన కర్తవ్యం చూసిన ప్రతి ఒక్కరి గుండె తడుస్తోందని.. అటు సోషల్ మీడియాలో, ఇటు మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇలాంటి మంచి చిత్రాన్ని నేను మెదటిసారి చూసినప్పుడు నా మనసు చలించిపోయింది. దర్శకుడి ప్రతిభ, నయనతార, ఇతర నటీనటుల నటన నన్ను కట్టిపాడేశాయి. జిబ్రాన్ మ్యూజిక్ నన్ను భావోద్వేగంలో ముంచేసింది. ఈ సినిమా అయిపోయాక ఆల్‌మొస్ట్ ఒక రోజంతా నన్ను వెంటాడింది. అసలు గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఇంత అవస్థ పడాలా.. అనే ప్రశ్న నాలో నేను వేసుకున్నాను. అన్ని చిత్రాలు డబ్బుల కోసం కాదు మనుషుల కోసం కొన్ని చిత్రాలు వుంటాయి అని గట్టిగా నమ్మి ఈ చిత్రాన్ని మా బ్యానర్ నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరుమీద తెలుగు ప్రేక్షకులకి చూపించాలని అనుకున్నాను. ఈ ప్రయత్నానికి ప్రత్యేకంగా మీడియా ఫ్రెండ్స్ బాగా సపోర్ట్ చేశారు. అంతే కాదు ఇలాంటి ఒక సందేశాత్మక చిత్రాన్ని తెలుగులో తీసుకువచ్చినందుకు నాకు ధన్యవాదాలు చెబుతుంటే నా కంట ఆనందభాష్పాలు వచ్చాయి. ఈ కర్తవ్యం అనే చిత్రం నా బ్యానర్ వాల్యూని రెట్టింపు చేసిందని, ఇలాంటి మంచి చిత్రాలు తెలుగు ప్రేక్షకుడికి చూపించటానికి ఎప్పుడు నేను, నా బ్యానర్ నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సిద్దంగా వుంటుందని తన ఆనందాన్ని తెలిపారు..

కోర్టుకెక్కిన ఆర్య స్వయంవరం



కోలీవుడ్ నటుడు ఆర్య స్వయంవరం పేరిట నిర్వహిస్తున్న షోపై కోర్టులో దాఖలైన కేసు కీలక మలుపు తిరిగింది. ఈ షో నిర్వాహకులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. 'ఎంగ వీటు మాపిల్లై' పేరిట ఆర్య తన స్వయంవరం షోను ప్రకటించాడు. కలర్స్ తమిళ్ ఛానెల్‌లో సోమవారం నుంచి శుక్రవారం దాకా ఈ కార్యక్రమం ప్రసారం అవుతోంది. నటి సంగీత ఈ రియాల్టీ షోకు హోస్టింగ్ చేస్తున్నారు. అయితే ఈ షో మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉంటోందని.. పైగా కంటెస్టెంట్‌లను కించపరిచేలా షోలో పనులు చేయిస్తున్నారంటూ జానకిఅమ్మల్ అనే ఉద్యమకారిణి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ షోను నిలుపుదల చేయాలంటూ ఆమె సెన్సార్ బోర్డు, కేంద్ర సాంకేతిక సమాచార శాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. అయితే వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన మధురై బెంచ్.. షో నిర్వాహకులకు, సాంకేతిక సమాచార శాఖ కార్యదర్శితోపాటు, ఈ షోకు అసలు అనుమతి ఎలా ఇచ్చారో వివరణ ఇవ్వాలంటూ సెన్సార్ బోర్డుకు నోటీసులు దాఖలు చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఏప్రిల్ 18కు వాయిదా వేసింది. అయితే అప్పటిదాకా షో నిలుపుదల చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను మాత్రం కోర్టు తోసిపుచ్చింది.

జోరుగా మహానటి షూటింగ్



అలనాటి మేటినటి సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతోంది మహానటి సినిమా. కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయింది. గురువారం ఉదయం ఈ సినిమాకు సంబంధించి గుమ్మడికాయ ఫంక్షన్ నిర్వహించారు. సావిత్రి చిత్రపటం పెట్టి, నివాళులు అర్పిస్తూ షూటింగ్ ముగించారు. సావిత్రి కెరీర్‌లోని ఎత్తుపత్తాల్ని, ఆమె వ్యక్తిగత జీవితంలోని చీకటి కోణాన్ని సైతం ఈ బయోపిక్‌లో చూపించబోతున్నారు. సమంత ఇందులో జర్నలిస్ట్ పాత్ర పోషిస్తోంది. ఆమె పాత్ర ద్వారానే సావిత్రి జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. విజయ్ దేవరకొండ, మోహన్ బాబు, దుల్కర్ సల్మాన్, షాలినీ పాండే లాంటి నటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. మే9న సావిత్రి సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఏప్రిల్‌లో ఈ మూవీకి సంబంధించి అధికారిక ప్రచారం ప్రారంభం అవుతుంది. ఈ సినిమా హక్కుల్ని జీ తెలుగు సంస్థ దక్కించుకుంది.

ఏప్రిల్ 6న రానున్న ఆచారి అమెరికా యాత్ర



మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ హీరోహీరోయిన్లుగా జి.నాగేశ్వర రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ ఆచారి అమెరికా యాత్ర. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం ఈ సినిమాలో ఫుల్ లెంగ్త్ కామెడీ రోల్ ప్లే చేశారు. విష్ణు-బ్రహ్మి కామెడీ టోటల్ సినిమాకే హైలెట్ కాబోతోంది. గతంలో వీళ్లిద్దరి కాంబోలో వచ్చిన ఢీ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా అంతకంటే పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నారు. గతంలో జి. నాగేశ్వరరెడ్డి, విష్ణు కాంబోలో దేనికైనా రెడీ, ఈడోరకం-ఆడోరకం లాంటి సినిమాలొచ్చాయి. అదే కోవలో కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా కూడా తెరకెక్కింది. ఏప్రిల్ 6న ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించారు. కథ ప్రకారం అమెరికాలో ఎక్కువ భాగం షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని అంటున్నారు మేకర్స్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. పద్మజ పిక్చర్స్ బ్యానర్‌పై కీర్తి చౌదరి, కిట్టు కలిసి నిర్మించిన ఈ సినిమాకి ఎం.ఎల్ కుమార్ చౌదరి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.

వైఎస్ఆర్‌గా మమ్ముట్టి




దివంగతనేత వైఎస్ఆర్ పాత్రలో మలయాళ స్టార్ మమ్ముట్టి నటిస్తూ మహి వి రాఘవ దర్శకత్వంలో 70 ఎమ్ ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం "యాత్ర" భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ వంటి సూపర్ హిట్ సినిమాలను ప్రేక్షకులకి అందించిన 70ఎంఎం ఎంటర్‌టైన్మెంట్స్ బేనర్‌పై నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్న తృతీయ చిత్రం యాత్ర. ఈ చిత్రానికి ఆనందో బ్రహ్మ ఫేమ్ మహి వి రాఘవ్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు ప్రజల ఎమోషనల్ ప్రజానాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర కథను దర్శకుడు మహి వి రాఘవ్ స్వయంగా రాసుకుని రూపొందిస్తున్నారని ఈ చిత్రంలో వైఎస్ఆర్ పాత్రను మమ్ముట్టి పోషించబోతున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ ఆనందో బ్రహ్మతో తమ సంస్థకు ద్వితీయ విజయాన్ని అందించిన మహి వి రాఘవ్ డైరెక్షన్‌లో మరో సినిమాను నిర్మించడం చాలా ఆనందంగా ఉందని, యాత్ర కోసం మహి రెడీ చేసిన లైన్ నచ్చడంతో సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు మొదలుపెట్టినట్లుగా తెలిపారు విజయ్ చిల్లా. అలానే తమ సినిమాలో ముఖ్య పాత్రయిన వైఎస్ఆర్ పాత్రలో నటించడానికి మమ్ముట్టి అంగీకరించడం చాలా ఆనందం కలిగింది. రెండు రాష్ట్రాల ప్రజలు ఆరాదించే నాయకుడు, ఎమోషనల్‌గా ప్రజలకు దగ్గరైన వ్యక్తి వైయస్. ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఎమెషనల్ కంటెంట్‌గా ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నామని. త్వరలోనే ఈ బయోపిక్‌కి సంబంధించిన వివరాల్ని అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు.

రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు షాక్.. నష్టాల్లో షేర్లు



ఢిల్లీ: అంబానీ సోదరుడు అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆర్‌కామ్ ఆస్తులను రిలయన్స్ జియోకు విక్రయించకుండా బాంబే హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై మళ్లీ విచారణ జరిపేంత వరకు బాంబే హైకోర్టు తీర్పు కొనసాగుతుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 5కు వాయిదా వేసింది. తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ ఆ భారాన్ని తగ్గించుకునేందుకు తన ఆస్తులను రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు విక్రయిస్తున్నట్లు గతేడాది డిసెంబరులో ప్రకటించింది. ఈ మేరకు అంబానీ సోదరులు అనిల్, ముఖేశ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే దీనిపై ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టుకు వెళ్లింది. తమ బకాయిలు చెల్లించకుండా ఆస్తులు విక్రయిస్తున్నారని ఆరోపించింది. దీంతో అనుమతులు లేకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తులు అమ్మరాదని ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశించింది. దీంతో ఆర్బిట్రేషన్ తీర్పుపై ఆర్‌కామ్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా సంస్థకు నిరాశే ఎదురైంది. ఆస్తులు విక్రయించకుండా హైకోర్టు స్టే విధించింది. తాజాగా ఈ కేసు సుప్రీంకోర్టు పరిధిలోకి వచ్చింది. కాగా స్టే ఎత్తి వేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం కూడా నిరాకరించడంతో ఆర్‌కామ్ మళ్లీ చిక్కుల్లో పడింది. ఇదిలా ఉండగా తీర్పు నేపథ్యంలో ఆర్‌కామ్ షేర్లు భారీగా నష్టపోతున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటల సమయానికి సంస్థ షేరు విలువ దాదాపు 5 శాతం మేర పడిపోయింది.


దేశంలోనే తొలి హరిత బడ్జెట్



- ఆరోగ్యం, విద్య, పర్యావరణానికి పెద్దపీట
- రూ.53వేల కోట్లతో ఢిల్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సిసోడియా

న్యూఢిల్లీ : ఢిల్లీ ఆర్థిక మంత్రి మనీష్ సిసోడియా 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.53వేల కోట్లతో ఢిల్లీ బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టారు. గత ఆర్థిక సంవత్సరానికి ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం రూ.44,370 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఈసారి బడ్జెట్ 19.45శాతం పెరిగింది. సిసోడియా దాదాపు గంటన్నర సేపు మాట్లాడారు. 2018-19 బడ్జెట్‌లో పర్యావరణం, ఆరోగ్యం, విద్యా రంగాలతో పాటు పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు తెలిపారు. ఢిల్లీలో కాలుష్యాన్ని అరికట్టేందుకు 'హరిత' ప్రాజెక్టులపై అధిక దృష్టిసారిస్తూ రూపొందించిన తొలి హరిత బడ్జెట్ ఇదేనన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా పలు ఆరోగ్య పథకాలను ప్రవేశపెడుతున్నామన్నారు. విద్యా రంగానికి మొత్తం బడ్జెట్‌లో 26శాతం అంటే రూ.13,9997 కోట్లను కేటాయించినట్టు సిసోడియా తెలిపారు. స్కూళ్లలో 1.2 లక్షల సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు రూ.175 కోట్లు కేటాయించామని చెప్పారు. బాలికలకు ఆత్మరక్షణలో శిక్షణకు రూ.10కోట్లు, క్రీడలను ప్రోత్సహించడం కోసం రూ.20 కోట్లు, యువకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రపంచస్థాయి నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటునకు రూ.315 కోట్లు కేటాయించామని అన్నారు. అదే విధంగా బడ్జెట్‌లో 12శాతం అంటే రూ.6,729 కోట్లను ఆరోగ్య రంగానికి కేటాయించినట్టు చెప్పారు. రూ.100 కోట్లను ఆరోగ్య బీమా పథకాలకు కేటాయించామన్నారు. 16 బైక్ అంబులెన్లతో పాటు ఫస్ట్ రెస్పాన్స్ వెహికల్ (వెంటనే స్పందించే వాహనం)ను ప్రారంభిస్తామని చెప్పారు. మొహల్లా, పాలీక్లీనిక్‌ల ఏర్పాటునకు రూ.403కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల హామీల్లో ఒకటైన ఉచిత వైఫై సదుపాయం కల్పించేందుకు రూ.100 కోట్లు కేటాయించామని, జూన్ 15 కల్లా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తామని, అసంఘటిత కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం రూ.1500 కోట్లు కేటాయించామని ఆయనన్నారు. ఇది తొలి 'హరిత బడ్జెట్' అని మంత్రి అన్నారు. నగరంలో కాలుష్యాన్ని నివారించేందుకు సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు బడ్జెట్ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి సిసోడియా స్పష్టంచేశారు. సీఎన్‌జీ కార్ల రిజిస్ట్రేషన్‌కు 50శాతం రాయితీని ఇస్తామని అన్నారు. 16కి.మీల సైకిల్ ట్రాక్ కోసం సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, వాయు కాలుష్యం స్థాయికి సంబంధించిన సమాచారాన్ని అందజేసేలా ప్రభుత్వ భవనాల్లో వెయ్యి డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బొగ్గు వినియోగాన్ని విడనాడి విద్యుత్, వంట గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రెస్టారెంట్లకు సబ్సిడీలు ఇస్తామన్నారు.

ఈసారి బడ్జెట్ అద్భుతం : కేజ్రీవాల్



2018-19 ఆర్థిక సంవత్సరానికిగాని బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకుగాను సిసోడియాని సీఎం కేజ్రీవాల్ అభినందించారు. ఈసారి బడ్జెట్ అద్భుతమైనదని అభివర్ణించారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించామన్నారు. పేదలు, మహిళలు, మధ్య తరగతి వారు, విద్యార్థుల సంక్షేమానికి చాలా చర్యలు తీసుకొంటున్నట్టు చెప్పారు. దేశంలోనే ఇదే మొట్టమొదటి హరిత బడ్జెట్ అని కేజ్రీవాల్ అన్నారు. అంతేకాకుండా విద్య, ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశామని చెప్పారు. రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీరు అంశాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. ఈ మూడు క్షేత్రాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలనూ చేపట్టామని చెప్పారు.

బడ్జెట్ హైలైట్స్

- 2019, మార్చి నాటికి రోడ్లపైకి రానున్న 1000 ఎలక్ట్రిక్ బస్సులు.
- మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చిన్న రోడ్ల మరమ్మతుకు రూ.1000 కోట్లు.
- మెట్రోతో కనెక్టివిటీని పెంచే విధంగా 905 ఎలక్ట్రిక్ ఫీడర్ బస్సులు.



- వెయ్యి మెగావాట్ల సౌర, వాయు విద్యుత్ కొనుగోలు.
- ప్రతి స్కూల్లో 200-250 కెమెరాల ఏర్పాటు.
- అటెండెన్స్ రికార్డింగ్ కోసం ప్రతి టీచర్‌కొక ట్యాబ్లెట్ కంప్యూటర్.
- ఆరోగ్య రంగానికి రూ.6729 కోట్ల కేటాయింపు
- మొహల్లా క్లీనిక్స్, పాలీక్లీనిక్స్ కోసం రూ.403 కోట్లు.
- అక్టోబరు 30 నాటికి 530 మొహల్లా, 230 పాలీక్లీనిక్ల ఏర్పాటు.
- నీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ రిజర్వాయర్ల వద్ద బల్క్ మీటర్లు
- అసంఘటిత కాలనీలలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు రూ.1500 కోట్లు.



విద్యార్థిని ఆత్మహత్యపై నివేదికివ్వండి : హెచ్‌ఆర్డీ

- సీబీఐ విచారణకు తల్లిదండ్రుల డిమాండు, ఆందోళన
- మయూర్ విహార్ రహదారి దిగ్బంధం : ట్రాఫిక్‌కు అంతరాయం

న్యూఢిల్లీ : తూర్పు ఢిల్లీలోని మయూర్ విహార్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి వెంటనే నివేదిక ఇవ్వాలంటూ హెచ్‌ఆర్డీ మంత్రిత్వశాఖ ఆదేశించింది. హెచ్‌ఆర్డీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ స్పందిస్తూ ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయమని సూచించామని అన్నారు. అయితే, తమ బిడ్డను స్కూలు టీచర్లు లైంగికంగా వేధించారని బాలిక తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండు చేస్తూ ఆందోళనకు దిగారు. మయూర్ విహార్ ప్రధాన రహదారిని దిగ్బంధించారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులకు అసౌకర్యం కలిగింది. ఉద్దేశపూరితంగానే తమ బిడ్డను పరీక్షల్లో ఫెయిల్ చేశారని, తక్కువ మార్కులు వచ్చాయంటూ ఇద్దరు టీచర్లు ఆమెను వేధించారని బాలిక తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలను స్కూలు యాజమాన్యం కొట్టిపారేసింది. 'ఈ ఘటన దురదృష్టకరం. సీబీఎస్‌ఈ విధానాలనే స్కూలు పాటిస్తోంది. బాలిక ఫెయిల్ కాలేదు. పరీక్షను మళ్లీ నిర్వహించనున్నాం. దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తాం. మా స్కూల్‌లో ఎలాంటి వేధింపులకు తావులేదు' అని స్కూల్ ప్రిన్సిపాల్ ధర్మేంద్ర గోయల్ అన్నారు. ఈ వ్యవహారంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (డీవోఈ) విచారణను ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మంగళవారమే ఆదేశించారు. స్కూలు ప్రిన్సిపాల్, ఇద్దరు టీచర్లపై నోయిడా పోలీసులు కేసు దాఖలు చేశారు. బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్టు గమనించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన కైలాష్ ఆసుపత్రికి తరలించారని, బాలిక అప్పటికే మరణించిందని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని అన్నారు.

సుష్మాపై అవిశ్వాస తీర్మానం

కాంగ్రెస్ పార్టీ నిర్ణయం



న్యూఢిల్లీ : ఇరాక్‌లోని మోసుల్ పట్టణంలో 2014లో అపహరణకు గురైన 39 మంది భారతీయులు మృతి చెందిన అంశాన్ని తప్పిదారి పట్టించినందుకు రాజ్యసభలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ గురువారం నిర్ణయించింది. కాంగ్రెస్ ఎంపీలు అంబికా సోని, ప్రతాప్ బజ్వా, షంషేర్ సింగ్ దియోలు మాట్లాడుతూ భారతీయుల మృతి అంశంపై సమాచారాన్ని, డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత ఎగువ సభలో సుష్మా స్వరాజ్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. నాలుగేళ్లుగా సభను తప్పుదారి పట్టించారని స్వరాజ్‌ను నిందించారు. ఐసిస్ అపహరించిన 39 మంది భారతీయులు బతికే ఉన్నారని ఏ ఆధారంగా ఆమె ఇన్నాళ్లూ ప్రకటించారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. 'సుష్మా స్వరాజ్ సభను తప్పుదారి పట్టించారని నేను నిందిస్తాను. సభలో మంత్రి ఇచ్చిన హామీ ఒకటి ఉంది. ఇరాక్‌లో అపహరణకు గురైన భారతీయులందరూ బతికే ఉన్నారని ఆమె హామీ ఇచ్చారు. ఆమె రహస్య సమాచారం తప్పు అని నిరూపితమైంది' అని అంబికా సోని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. 39 మంది భారత పౌరుల ప్రాణాలతో ఆమె ఆటాడుకుంది. పార్లమెంటును తప్పుదారి పట్టించినందుకు విదేశీ వ్యవహారాల మంత్రిపై తప్పనిసరిగా అవిశ్వాస తీర్మానాన్ని తీసుకువస్తామని సోని స్పష్టం చేశారు. మోసుల్ విషాదాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపిస్తూ, ఈ సమస్యను లేవనెత్తడానికి అనేక సార్లు ప్రయత్నిం చినట్లు మాట్లాడలేదని, భారత బందీలు బతికే ఉన్నారంటూ సుష్మా చెప్పుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వం విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాల ద్వారా బాధిత కుటుంబాలలో దురభిప్రాయం కలిగించిం దన్నారు. 'ఇరాక్‌లో ఏడాది క్రితమే బందీలు మరణించారని మేము తెలుసుకున్నాం. కానీ మన ప్రభుత్వం స్పందించలేదు' అని తెలిపారు. ఇరాక్‌లో మరణించిన భారతీయులు పేద ప్రజలని, కార్మికులని మరో కాంగ్రెస్ నేత బజ్వా పేర్కొంటూ, ఈ అంశంలో ప్రభుత్వం వికృతంగా వ్యవహరించిందని ఆరోపించారు. 'హర్జిత్ మాషి ప్రకటన నిజమని ఈరోజు నిరూపితమైంది. ప్రజల సెంటిమెంట్‌తో మీరెందుకు ఆడుకుంటారు' అని ప్రశ్నించారు. 'బాధిత కుటుంబాలకు ఎటువంటి పరిహారాన్నైనా ప్రకటించారా అని మోడీజీ, సుష్మాజీని మేము అడుగుతున్నాం. కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, అలాగే బాధిత కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని డిమాండు చేస్తున్నాం.

ముగిసిన భారీ ఎన్‌కౌంటర్

- కాశ్మీర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు హతం
- ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు భద్రతా సిబ్బంది
- గల్లంతయిన జవాను కోసం గాలింపు

శ్రీనగర్ : ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారాలో 48 గంటలపాటు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో లష్కర్-ఎ-తొయిబాకు చెందిన ఐదుగురు విదేశీ ఉగ్రవాదులు హతమయ్యారని పోలీసులు గురువారం తెలిపారు. అయితే గల్లంతయిన జవాను కోసం దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతాదళాల గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. బుధవారం ముగిసిన ఈ ఎదురు కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమవగా, ముగ్గురు జవాన్లు, ఇద్దరు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. కాగా బుధవారం గల్లంతయిన ఒక జవాను ఆచూకీ కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు ప్రారంభించినట్లు సైనిక అధికారి ఒకరు తెలిపారు. ఒక ఉగ్రవాదుల గ్రూప్‌నకు పోలీసు బృందం ఎదురుపడిన తర్వాత నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి నుంచి కనీసం 8 కిలోమీటర్ల దూరంలోని హల్మాటిపొర ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. శంసాబారి పర్వతాలకు చెందిన రెండు వంతెనలు దాటిన తర్వాత ఎల్‌వోసీ వెంబడి సుమారు 8 కిలోమీటర్ల మేర ఉగ్రవాదుల గ్రూపు చొరబాటు జరిపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. మసీదులో దాగి ఉన్న ఉగ్రవాదులు అటవీ ప్రాంతంలోకి పారిపోవడం ప్రారంభించారు. కానీ మంగళవారం భద్రతా దళాలు నలుగురు ఉగ్రవాదులను అంతమొందించాయి. ఎత్తయిన ప్రాంతంలో దాక్కొని ఉన్న ఐదో ఉగ్రవాదిని బుధవారం సాయంత్రం భద్రతాదళాలు కాల్చి చంపాయి. అయితే ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన సహచర జవానులు, పోలీసులకు ఇక్కడి జిల్లా పోలీసు లైన్స్ వద్ద కాశ్మీర్ ఐజీపీ ఎస్.పి.పానీ నివాళి అర్పించారు.

మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి...




- సామాజిక న్యాయం లక్ష్యంతో ముందుకు...
- త్వరలో దేశమంతా పర్యటిస్తా
- ఎన్‌డీఏ విభజన రాజకీయాలను ఎండగడతా
- ఇక మిత్రపక్షాలన్నీ దూరమే
- పీటీఐ ఇంటర్వ్యూలో శరద్ యాదవ్

లక్నో : వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందే మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమిని ఏర్పాటు చేస్తానని జేడీయూ సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ చెప్పారు. సామాజిక న్యాయం కోసం ఈ మహాకూటమి పనిచేస్తుందని, బీజేపీ వ్యాప్తి చేస్తున్న మతోన్మాదానికి అడ్డుకట్ట వేయడం సామాజిక న్యాయంతోనే సాధ్యమని స్పష్టంచేశారు. ఎన్నికలకుముందే మహా కూటమి ఏర్పాటు తథ్యమని తేల్చిచెప్పారు. సామాజిక న్యాయం కోసం దేశంలో పెద్దఎత్తున పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. తాను దేశవ్యాప్తంగా పర్యటిస్తానని, ప్రజలతో కలుస్తానని, బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటవుతుందన్న విశ్వాసం ఉందని శరద్ యాదవ్ పేర్కొన్నారు. శరద్ యాదవ్ గురువారం పీటీఐతో మాట్లాడారు. బీజేపీ సిద్ధాంతమే మతతత్వమని ఆయన నిందించారు. బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటినీ ఐక్యం చేయడానికి తాను కృషి చేస్తానని చెప్పారు. అతల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ నాయకత్వంలోని ఎన్‌డీఏకు తాను కన్వీనర్‌గా పనిచేశానని, ఆ ఎన్‌డీఏకు జాతీయ అజెండా ఉండేదని, అదిప్పుడు మారిందని ఆరోపించారు. ప్రజలను విభజించడమే ఇప్పటి ఎన్‌డీఏ విధానంగా మారిందన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విభజిస్తున్నదని శరద్ విమర్శించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆలయాల చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకున్నారని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ప్రకటనలు చేస్తున్నారని నిందించారు. మీరు ప్రతిపాదించే కూటమిలో మీ పాత్ర ఏమిటని ప్రశ్నించగా ముందు మహా కూటమిని ఏర్పాటు కానివ్వండి. ప్రతిపక్షాలన్నింటినీ ఐక్యం చేయడమే తన లక్ష్యం. 11 పర్యాయాలు తాను ఎంపీగా పనిచేశానని, నాలుగుసార్లు రాజీనామా చేశానని వివరించారు. ఇప్పుడు తనకు ఎంపీ పదవి కూడా లేదని, అందువల్ల దేశవ్యాప్త పర్యటన చేయడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. గోరఖ్‌పూర్, ఫుల్పూరు లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లో బీజేపీపై ఎస్‌పీ గెలవడంపై స్పందిస్తూ ఇది శుభపరిణామమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం నియోజకవర్గాల్లో ఎస్‌పీ విజయ సందేశం దేశమంతా పాకిందని అన్నారు. తమ శక్తి ఏమిటో ప్రజలు ఇప్పటికి తెలుసుకున్నారన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి ఓటమి రుచి చూపిస్తామని విశ్వాసంతో చెప్పారు. యూపీ, బీహారు, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లలో బీజేపీకి ఎక్కువ సీట్లు వచ్చాయని, అయినా అక్కడ రాజకీయ సమీకరణాలు మారాయని శరద్ యాదవ్ తెలిపారు. బీజేపీ వల్ల ఏ వర్గమూ సంతృప్తిగా లేదని అన్నారు. ఈసారి బీజేపీ హిందూ-ముస్లిం అజెండా పనిచేయదని స్పష్టంచేశారు. బీజేపీ రాజకీయ అవినీతికి అంతేలేదన్నారు. గోవా, మణిపూర్‌లో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు లభించాయని, అయినా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు చేసిందని ఆరోపించారు. మేఘాలయలోనూ ఇదే పునరావృత మైందని శరద్ యాదవ్ గుర్తుచేశారు. రాజకీయ హుందాతనాన్ని, నైతికతను బీజేపీ గాలికొదిలేసిందని నిందించారు. ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ద్వారా అధికారం చేజిక్కించుకోవడమే అజెండాగా ముందుకు సాగుతోందని శరద్ యాదవ్ మండిపడ్డారు.

ఈవీఎంల దుర్వినియోగంపై ఆందోళన వెలిబుచ్చారు. ప్రజల ఆకాంక్షను హిట్లర్ సైతం అణచివేయలేదని గుర్తు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మీరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారని ప్రశ్నించగా తన గురించి తాను ఇంకా ఏమీ నిర్ణయం తీసుకోలేదని యాదవ్ చెప్పారు. ఎస్‌పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో సమావేశమై రాజకీయ పరిణామాల గురించి చర్చించిన శరద్ యాదవ్...రానున్న రోజుల్లో బీఎస్‌పీ అధినేత్రి మాయావతితోనూ సమావేశమవుతానని తెలిపారు. 'ఎన్‌డీఏ మునిగిపోయే నౌక. రానున్న రోజుల్లో మిత్రపక్షాలు సైతం ఎన్‌డీఏకు దూరం కావడం ఖాయం. ఎన్‌డీఏతో ఒక్క మిత్రపక్షం కూడా కలిసుండే అవకాశం లేదు' అని అఖిలష్‌తో సమావేశం అనంతరం శరద్ యాదవ్ పేర్కొన్నారు.

భారత్ శాంతికే కట్టుబడి ఉంది : రాష్ట్రపతి



లూథియానా : భారతదేశం శాంతికి కట్టుబడి ఉందని, అయితే దేశ సరిహద్దులను పూర్తి శక్తితో రక్షించుకుంటుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం పేర్కొన్నారు. లూథియానాకు 30 కి.మీ. దూరంలోని హల్వారాలో ఆయన ఐఏఎఫ్ 230 సిగ్నల్ యూనిట్ రక్షణ దళం, 51 స్క్వాడ్రన్‌ల సమావేశంలో ఆయన ఉపన్యసించారు. సమావేశంలో ఐఏఎఫ్ సేవలను ప్రశంసించారు. విపత్తు నివారణ చర్యలు, సహాయ చర్యల్లో ఐఏఎఫ్ సేవలను ప్రశంసించారు. ఐఏఎఫ్ మన సైనిక శ్రేష్టతను సూచిస్తుందని కొనియాడారు.

సుక్మాలో రెండు ఐఈడీల స్వాధీనం



న్యూఢిల్లీ : చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో రెండు శక్తిమంతమైన మందుపాతర (ఐడీడీ) లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ 212వ బెటాలియన్ సిబ్బంది బుధవారం వాటిని స్వాధీనం చేసుకుందని చెప్పారు. గతం వారం నక్సల్స్ దాడి చేసిన నేపథ్యంలో రక్షణ సిబ్బంది అప్రమత్తంగా ఉందని, ఈ క్రమంలో కన్నారాం నుల్లాలో 8 కిలోలు, 7 కిలోల బరువు ఉన్న ఐఈడీలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. బాంబు స్క్వాడ్ వచ్చి వాటిని నిర్వీర్యం చేసిందని తెలిపారు.

అగ్నిప్రమాదంలో 18కి చేరిన మృతులు



కోయంబత్తూర్ : తమిళనాడులోని థేనీ జిల్లా కురంగనిలో సంభవించిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 18 కి పెరిగింది. ప్రమాదంలో గాయపడిన ఒక మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిందని, దీంతో మృతుల సంఖ్య 18 చేరిందని పోలీసులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన చెన్నైకు చెందిన జయశ్రీ (32) అనే మహిళకు చికిత్స కోసం మార్చి 12న విమానంలో మధురైలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని చెప్పారు. మార్చి 10న అటవీ ప్రాంతం ట్రిప్‌కు ఏరోడ్,తిర్పూర్‌ల నుంచి 12 మంది, చెన్నై నుంచి 27 మంది మొత్తం 39 మంది వెళ్లారని తెలిపారు.

ఘర్షణ కేసులో 12 మంది అరెస్ట్



బల్లియా : ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా సమీపంలోని గ్రామంలో రెండు మతవర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ ఘటనతో ప్రమేయం ఉన్న 12 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు గురువారం తెలిపారు. బుధవారం బందిష్ పోలీస్ స్టేషను పరిధిలోని ద్యూలీ గ్రామంలో ఒక యువకుడిని మరో వర్గానికి చెందిన వారు దాడి చేయడంతో బాధితుడి సంబంధీకులు చేరుకున్నారని, దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగిందని చెప్పారు. సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకుని 36 మందిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గుజరాత్‌లో కూలిన నేవీ డ్రోన్



అహ్మదాబాద్ : గుజరాత్‌లో పోర్‌బందర్‌లోని ఉల్లాస్‌నగర్‌లో భారత నేవీకి చెందిన రిమోట్‌తో నడిచే డ్రోన్ (ఆర్‌పీఏ) కూలిందని నేవీ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం పది గంటలకు పోర్‌బందర్ నుంచి ఆర్‌పీఏ టెకాఫ్ అయ్యిందని,ఆ వెంటనే మంటలు వ్యాపించి కూలిపోయిందని తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ మంటలు వ్యాపించనట్టు ప్రాథమిక నివేదికలో తేలిందని చెప్పారు. ఐస్ ఫ్యాక్టరీ వద్ద డ్రోన్ కూలిందని, సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమైందని చెప్పారు.

వ్యాపం కేసులో వైద్య కళాశాల చైర్మన్ అరెస్ట్



న్యూఢిల్లీ : వ్యాపం కేసులో భోపాల్‌లోని ఎల్‌ఎన్ వైద్య కళాశాల చైర్మన్ జేఎన్ చౌక్సీను అరెస్టు చేసినట్టు ఆ ఏజెన్సీ అధికారులు గురువారం తెలిపారు. భోపాల్‌లో 2017 నవంబరు 23న ఈ కేసులో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. పరారీలో ఉన్న వ్యక్తులపై కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ క్రమంలో సీబీఐ చౌక్సీని భోపాల్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసి కోర్టు ఎదుట ప్రవేశపెట్టామని, కోర్టు అతనికి మార్చి 24 వరకు జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్టు అధికారులు తెలిపారు.

పరిశోధనల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి : ముఖర్జీ




న్యూఢిల్లీ : కార్పొరేట్ రంగాల వాళ్లు సృజనాత్మకత, వినూత్న ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ హితవు పలికారు. యూకే ఆధారిత దేశంమంతా ఉన్నత విద్య రేటింగ్ సిస్టమ్ 'క్యూఎస్‌ఐ-గేజ్'ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో యువతకు శిక్షణ ఇచ్చి విద్యావంతులుగా తీర్చిదిద్దే యూనివర్సిటీ నిర్వాహకులు నిజాయితీగా ఉండమనేది ప్రాథమికమైన అంశమన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో పరిశోధనా రంగంలో పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వినూత్న, సృజానాత్మకగలవారు లేకుంటే మనమేప్పటికి గొప్పవాళ్ళం కాలేమన్నారు. ఇది సహజంగా రాదు అలాంటి వాతావరణం ఏర్పాడాలన్నారు.

మహిళ బ్లాక్‌మెయిల్ - వ్యక్తి ఆత్మహత్య



ముజఫర్‌నగర్ : జిల్లాలో గురువారం తనతో వివాహేతర సంబంధం కలిగి ఉన్న మహిళ బ్లాక్‌మెయిల్ చేయడంతో దేవ్ కుమార్(28) ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కుమార్ ఇంటిని తన పేరుపై మార్చాలని ఆ మహిళ డిమాండ్ చేసినట్లు పోలీసులు సమాచార మిచ్చారు. చరిత్‌వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేచంద్ గ్రామంలోని తన ఇంట్లో సీలింగ్‌కి వేలాడుతున్నాడని వారు వెల్లడించారు. సూసైడ్ నోట్‌లో మహిళ బ్లాక్‌మెయిల్ చేసినట్లుగాలో పేర్కొన్నారని ఎస్‌హెచ్‌ఓ గిరిష్ చంద్ శర్మ వివరించారు. మహిళ, తన భర్తతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని శర్మ తెలిపారు. తదుపరి విచారణ కొరకు శవాన్ని పోస్టుమార్టానికి పంపామన్నారు.

యూపీ అసెంబ్లీలో 'రైతు' హోరు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రైతుల సమస్యలను పాలక బీజేపీ పట్టించుకోవడం లేదంటూ గురువారం ఆ రాష్ట్ర అసెంబ్లీ నుంచి కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ సభ్యులు వాకౌట్ చేసి నిరసన వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో రైతుల సమస్యలకు సంబంధించిన అంశంపై ఎస్పీ నేత అడిగిన ప్రశ్నకు మంత్రి సూర్య ప్రతాప్ షాహి బదులిచ్చారు. అయితే ఆయన సమాధానంపై ఎస్పీ నేత రాం గోవింద్ చౌదరి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ల చేతిలో ఉందని విమర్శించారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

అడ్డదారి తొక్కిన ప్రధానోపాధ్యాయుడు

జల్‌పాయ్‌గురి : ప్రతిసారి మొదటి ర్యాంకు తెచ్చుకుంటున్న విద్యార్థి వార్షిక పరీక్షల్లో కూడా మొదటిస్థానం తెచ్చుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని భావించిన ప్రధానోపాధ్యాయుడు దానికోసం అడ్డదారి తొక్కాడు. ఈ సంఘటన పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకుంది. పరీక్ష సమయాని కంటే ముందే ప్రశ్నపత్రాలను తెరిచి సంబంధిత ఉపాధ్యాయుడితో ఆ సమాధానాలను రాయించేవారు. దీనిపై ఇద్దరు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఆరోపణలు అవాస్తవం అని ప్రధానోపాధ్యాయుడు ఖండించారు.



తక్షణం కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర - వేంపల్లె : వేంపల్లె సజ్జల సంచుల ఫ్యాక్టరీలలో పనిచేసే 250 మంది కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. కడప జిల్లా వేంపల్లె మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెండింగ్ జీతాల కోసం ధర్నా చేస్తున్న కార్మికులకు గురువారం ఆయన మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని, ఏ ఒక్క కార్మికుడికి ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు. అటు ఫ్యాక్టరీ యాజమాన్యంతోనూ ఇటు అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యకు పరిష్కారం అందేలా కృషి చేస్తానన్నారు. లేని పక్షంలో కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆయన భరోసా ఇచ్చారు. రెక్కాడితే డొక్కాడని కార్మికులకు ఆరు నెలల పాటు వేతనాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. ఇంతటి ఘోరమైన పరిస్థితి ఎక్కడా చూడలేదన్నారు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ వెంకటరమణ సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీనివ్వడంతో కార్మికులు ధర్నాను విరమించుకున్నారు. సీపీఐ కమిటీ సభ్యులు రాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం, ఏరియా కార్యదర్శి ఎస్ బాషా తదితరులు ప్రసంగించారు. ఏబీవీపీ నాయకుడు రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



వృద్ధ దంపతుల హత్య కేసులో నిందితుల అరెస్టు

విశాలాంధ్ర - మచిలీపట్నం : కృష్ణా జిల్లా గుడివాడ రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల హత్యఘటనలో ముద్దాయిలను జిల్లా ఎస్పీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి మీడియా ముందు గురువారం హాజరుపరిచారు. గుడివాడ 1వ స్టేషన్ పరిధిలో క్రైమ్‌నెం. 78/2018గా నమోదైన కేసులో గుడివాడకు చెందిన జల్లు సురేష్‌తోపాటు తమిళనాడులోని పెరంబుదురుకు చెందిన సెల్వదొరైను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి బొప్పన సాయి చౌదరి (74), నాగమణి(64)ల నివాస గృహంలో జరిగిన హత్యఘటనను పురస్కరించుకొని పరిసరప్రాంతాల్లోని వ్యక్తులు ఇచ్చిన సమాచారం, హత్యా స్థలంలో దొరికిన ఆధారాల కారణంగా ముద్దాయిలిద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఘటనా స్థలిలో లభించిన వేలి ముద్రలు, ఆయా ప్రాంతాల్లో లభ్యమైన సీసీ పుటేజ్ ఆధారంగా విచారణ జరుగుతున్నట్లు, చోరీకి గురైన వాటిలో కారు, టీవీతో పాటు ఐ ప్యాడ్, 50వేలు నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. తమిళనాడులోని పెరంబదురులో వీరిద్దరిని అరెస్ట్ చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాత నేరస్తుడు, ప్రస్తుత ముద్దాయి సురేష్ (26) పై పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. నేరం జరిగిన వెంటనే ముద్దాయిలు దొంగిలించిన కారులో పెరంబుదుర్‌కు పారిపోయారు. సురేష్ నివాసం గుడివాడ అయినప్పటికీ చెన్నైకు 300 కి॥మీ అవతల పెరంబుదురుకు వెళ్లి మెకానిక్‌గా జీవిస్తున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే దర్యాప్తు బృందాలు వివిధ ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారని ఎస్పీ తెలిపారు. లభించిన ఆధారాలను బట్టి ముద్దాయి సురేష్ ఆచూకీ కనుగొని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మరో వ్యక్తి సెల్వదొరై కూడా ఉన్నట్లు తేలిందని ఎస్పీ వెల్లడించారు. మృతుల నివాసంలోని ఎయిర్ కండిషన్ మెషిన్‌ను కట్ చేసి గదిలోకి ప్రవేశించి ఈ నేరానికి పాల్పడినట్లు తెలిపారు. కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ సీసీ పుటేజ్‌తో కూడిన సాంకేతిక పద్ధతుల ఆధారంగా ముద్దాయిలను పట్టుకోగల్గినట్లు తెలిపారు. వీరి నుండి కొన్ని వివరాలు లభ్యమైనట్లు, వీరిని న్యాయస్థానంలో హాజరుపరచి విచారణ నిమిత్తం మరల పోలీసు కస్టడీ కోరనున్నట్లు తెలిపారు. ముద్దాయిల నుండి మరిన్ని వివరాలు రాబట్టి కేసును పూర్తి స్థాయిలో విచారణ చేసి ఈ నేరంలో ఇంకా ఇతరుల ప్రమేయంపై కూడా వివిధ కోణాల్లో దర్యాప్తు జరిపి దోషులకు శిక్షలు పడేలా చేస్తామని ఎస్పీ త్రిపాఠి తెలిపారు. అయితే బొప్పన సాయి చౌదరి దంపతుల హత్య, పగ, ప్రతీకారంతోనే ఆస్తికోసమే జరిగినట్లుగా మృతుల శరీరాలపై ఉన్న గాయాలను బట్టి తెలుస్తున్నది. అంతేగాక వేయి కి.మీ. దూరం నుండి వచ్చి ఈ వృద్ధ దంపతుల నివాసంలో చోరీకి పాల్పడటమే కాక హత్య గావించిన ఘటనకు గల కారణాలపై పోలీసుశాఖ దృష్టి సారించాల్సిఉంది.

కూచిపూడి దూరవిద్యా పరీక్షా కేంద్రం కొనసాగింపు



విశాలాంధ్ర - కూచిపూడి : కృష్ణాజిల్లాలోని కూచిపూడి శ్రీసిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో దూరవిద్యా పరీక్షా కేంద్రం యథాతథంగా కొనసాగుతుందని కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఇటీవల విశ్వవిద్యాలయం హైదరాబాద్, రాజమహేంద్రవరం కేంద్రాలు మాత్రమే కొనసాగించాలని నిర్ణయించినప్పటికీ కేంద్రం విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ ఏడాది కూడా తెలుగు విశ్వవిద్యాలయంలోని అన్ని కేంద్రాల్లో నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ అయినట్టు వివరించారు. కూచిపూడి నాట్య కళాపీఠంలో దూరవిద్యా కేంద్రం ఉంటుందని, దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు అందించవచ్చని ఆయన వివరించారు.

కారాడలో గోడ కూలి ఇద్దరు మృతి

విశాలాంధ్ర - బొబ్బిలి : విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కారాడ గ్రామంలో గోడ కూలిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద ఘటనతో కోరాడ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కారాడ గ్రామానికి చెందిన చొక్కాపు శివున్నాయుడు ఇంటికి పిల్లర్లు వేస్తున్నారు. ఇందుకు సంబంధించి నిర్మాణ పనులు జరుగుతుండగా ఈ అదురుకు ఇంటిపక్కనే ఉన్న చొక్కాపు అప్పలనాయుడు గోడ కూలి నిర్మాణపనులు చేస్తున్న ముత్తాయివలస గ్రామానికి చెందిన దమలపాటి శ్రీరాములు(55), సింగారపు జగన్నాథం (45)లపై శిథిలాలు పడిపోవడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మరో కూలీ జమ్ము పరశురాం తీవ్రంగా గాయపడ్డాడు. పరశురాంను 108లో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ

నెం. 59/TO/2017 | **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు** | తేది : 20-3-2018

పర్యవేక్షక ఇంజనీరు, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ విజయవాడ వారిచే ఈ వలయము పరిధి నూతన పిడబ్ల్యుఎస్ స్కీం ఏర్పాటు చేయుటకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. 1 పనికి అంచనా విలువ : రూ.18.00 లక్షలు, టెండరు డాక్యుమెంట్లు లభ్యత : 22.3.2018 ఉ.11గం. నుండి 29.3.2018 మ.1గం. వరకు. టెండరు డాక్యుమెంట్ స్వీకరించు తేది : 22.3.2018 ఉ.11గం. నుండి 29.3.2018 సా.5గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరచు తేది : 29.3.2018 సా.5.30గం. మిగిలిన వివరములకు ఇ-మార్కెట్‌ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్ : 0866-2573944.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, (పూ.ఆ.భా), గ్రా.నీ.స. వలయము, విజయవాడ

DIPR/3861/CL/ADVT-1/1/17-18 Dt. 22-3-18

పొలాల్లో హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్





విశాలాంధ్ర - సోంపేట రూరల్ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గురువారం పైలెట్లు శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం, మాకన్నపురం పంచాయతీలోని శారదాపురం గ్రామ పొలిమేర పొలాలలో సురక్షితంగా కిందకు దింపారు. ఒడిశా రాష్ట్రంలోని గోపాల్‌పూర్ నుంచి విశాఖ వెళ్తుండగా సాంకేతిక లోపంతో అత్యవసరంగా కిందకు దించాల్సి వచ్చిందని పైలెట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న బారువ సీఐ సన్యాసినాయుడు, ఎస్సై కె. భాస్కరరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని పైలెట్లకు సహకరించారు. హెలికాప్టర్‌ను చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, పిల్లలు, విద్యార్థులు, మహిళలు వేలాదిగా తరలి వచ్చారు. విశాఖ నుంచి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో వచ్చిన సిబ్బంది సాంకేతిక లోపాన్ని సరిచేశారు. వెంటనే వైజాగ్ తీసుకువెళ్లిపోయారు.

మిర్చి రైతు దిగాలు

- అమాంతం పడిపోయిన ధరలు
- పెరిగిన పెట్టుబడి - తగ్గిన దిగుబడి
- దళారుల కుమ్మక్కుతో రైతులు బెంబేలు



విశాలాంధ్ర - కర్లపాలెం : పచ్చిమిర్చి రైతుకు ఈ ఏడాదీ కన్నీరే మిగులుతుంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర అమాంతంగా పడిపోవటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కోత కూలీల ఖర్చు కూడా రావటం లేదని పచ్చిమిర్చి మొక్కలను పీకేస్తున్నారు. గుంటూరు మిర్చి ఘాటు బాగానే పేరు తెచ్చుకుంటున్నా, పండించే రైతులకు ధర కల్పించటంలో మాత్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోంది. దళారులు కుమ్మక్కై ధరలు పెరగనివ్వకుండా మరో ఏరియా వ్యాపారులు రాకుండా అడ్డుపడుతూ రైతులను నిలువునా దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

గుంటూరు మిర్చియార్డు ఆసియాలోనే అతిపెద్దదిగా పేరుగాంచింది. గుంటూరు మిర్చి యార్డులో సంవత్సరానికి సుమారు 500 నుంచి 700 కోట్ల రూపాయల వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. రాష్ట్రంలో వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి ఉత్పత్తిలో గుంటూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లాలో సుమారు 9 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో 5 లక్షల మేర వాణిజ్య పంటలను పండిస్తున్నారు. వీటిలో ప్రధానంగా మిర్చి కూడా ఉంది. గుంటూరు మిర్చికి అత్యంత పేరు ఉంది. ఇక్కడ సాగు చేసిన మిర్చి ఎల్లలు దాటుతున్నదంటే ఇక్కడి మిర్చి ఘాటు ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. అటువంటి పేరును తీసుకువస్తున్న రైతులను మాత్రం ప్రభుత్వం ప్రోత్సహించక పోవటం దురదృష్టకరం. దీంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులు పండించి పంటకు ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వమే పచ్చి మిర్చికి ధర నిర్ణయిస్తే రానున్న కాలంలో గుంటూరు మిర్చి పేరు మరింత ఘాటు ఎక్కుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి సాగు చేసిన పచ్చి మిర్చికి మద్దతు ధర లేక రైతు కంట కన్నీరు కారుతోంది. గతంలో ఉన్న అప్పులు తీరి కొంత లాభాన్ని పొందుదాం అని మార్కెట్ ధరను చూసి ఉత్సాహంగా విత్తనాలు చల్లి సాగును ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో సాగులో ఎదురైన తెగుళ్ల బెడద, వైరస్, వేరు కుళ్లు, తెల్లదోమ ఉధృతులు ఈ ఏడాది రైతులను ఏడిపించా యి. అయినా రైతు విశ్రమించక తనను నమ్ముకున్న పుడమిపై ప్రేమను విడువక అన్నింటిని ఎదుర్కొని సాగును కాపు దశకు తీసుకువచ్చారు. పచ్చి మిర్చి కాపు దశకు చేరుకున్న విషయం తెలుసుకున్న దళారులు కుమ్మక్కై ధరను విపరీతంగా పతనం చేశారు. కాపుకు వచ్చిన పంట కోయక పోవటంతో కాయలు పండి వృధాగా పోతాయి. చేసేదేమీ లేక రైతులు ఆ ధరకే అమ్ముకోవాల్సి పరిస్థితి నెలకొందని కన్నీటి పర్యంతమవుతున్నారు. దీంతో సాగుచేసిన పంటకు పెట్టుబడి రాకపోగా నష్టాలు వస్తుండటంతో రైతులు అల్లాడిపోతున్నారు. కర్లపాలెం మండల పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల్లో పచ్చిమిర్చిని సాగు చేశారు.

మండలంలో ప్రధానంగా నల్లమోతువారిపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయపాలెం, ఎంవీరాజు పాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, బోలాయపాలెం గ్రామా ల్లోని రైతులు పచ్చిమిర్చిని సాగు చేస్తున్నారు. ప్రస్తుత సాగులో తెగుళ్ల బెడద అధికంగా ఉండటంతో దిగుబడి రాక దిగాలు చెందుతున్నారు.

గత ఏడాది ఎకరాకు సుమారు 60 బస్తాల నుంచి 70 బస్తాల దిగుబడి వచ్చేది. అయితే ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రెండుకాపుల మేర మిర్చి కాయలు కోశారు. ఈ రెండు కోతల్లో కేవలం 25 నుంచి 30 బస్తాల మేర దిగుబడి వచ్చిందని పలువురు రైతులు తెలుపుతున్నారు. గతంలో కేజీ పచ్చి మిర్చి రూ. 15కు కొనుగోలు చేయగా ఇప్పుడు కేజీ మిర్చి రూ. 3 కే కొనుగోలు జరుగుతోంది. గతంతో పోలిస్తే రైతులు రూ. 12 నష్టపోతున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం పచ్చిమిర్చి దిగుబడి కూడా అంతంత మాత్రంగానే ఉంది. పండిన పంటకు బాడుగ, కాటా రేట్లు అంటూ వసూలు చేస్తున్నారు. ఇవన్నీ పోను రైతుకు కనీసం ఖర్చులు కూడా రాకపోవటంతో రైతన్నలు చేసేది లేక మనోవేదన చెందుతున్నారు. మిర్చి కాయలు కోసినందుకు ఎకరాకు వందమంది కూలీలు అవసరమవుతుంది. అంతేకా కుండా కాయల బాడుగ, కాటా ఖర్చులు అదనంగా భారం పడుతున్నాయి. తాము పండించి పంటకు ప్రభుత్వమే ధర కేటాయించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పుడున్న ధరల వివరాలు ఇవే,,

నందిని రకం మిర్చి 10 కేజీలు రూ.40, వీఎన్నార్ లావు రకం రూ.25, సన్నాలు 35, గ్రీన్స్ రూ.60. ఈ ధరలతో ప్రస్తుతం అమ్మకాలు జరుగుతున్నాయి.


ఖర్చులు కూడా రావు



ఈ ఏడాది పచ్చి మిర్చి సాగు చేసిన రైతులకు ఖర్చులు కూడా రావు. పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. దీనికి తోడు ధర విపరీతంగా పడిపోయింది. పంటకు చల్లిన పురుగు మందుల ఖర్చు అధికమైంది. పంట కాపు దశలో ఉంది. ఇప్పుడు ఉన్న రేటుకు పంట అమ్మితే ఎన్నడూ లేని విధంగా నష్ట పోతాం. సాగు సమయంలో ఉన్న ధర పంట చేతికి వచ్చే సమయంలో దారుణంగా పడిపోతుంది. ఇదే ధర కొనసాగితే అప్పుల్లో కూరుకుపోతాం. దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

-(శవనం రంగారెడ్డి, ఎంవీరాజుపాలెం)

కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారు



పొలం కౌలుకు తీసుకుని పచ్చి మిర్చి సాగు చేశాను. ఈ ఏడు పచ్చిమిర్చికి గిట్టుబాటు ధర రావటం లేదు. ప్రస్తుతం ఉన్న ధరలతో రైతులకు నష్టాలే మిగులుతాయి. కౌలుకు తీసుకుని నాలుగు పైసలు వెనకేసుకుందాం అనుకున్నా కానీ అప్పులే మిగులుతాయి. కౌలు సమయం దాటుతుండటంతో మొక్కలు పీకేస్తున్నాను.

-(కుంచాల నాగిరెడ్డి, ఏట్రవారిపాలెం)

ఏసీబీ వలలో విశాఖ జిల్లా వీఆర్వో



విశాలాంధ్ర - కశింకోట : విశాఖ జిల్లా కశింకోట మండలం కన్నురుపాలెం, సుందరయ్యపేట పంచాయతీలో వీఆర్వోగా పనిచేస్తున్న గుల్లపల్లి రామఅప్పారావును గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ కథనం ప్రకారం.. కన్నురుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ప్రసాద్ వర్మ మరో ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి కన్నురుపాలెంలో ఎకరం 40 సెంట్ల భూమిని ఉమ్మడిగా కొనుగోలు చేశారు. మీ-సేవలో పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకుని వీఆర్వో రామ అప్పారావును కలిశారు. త్వరగా పాసుపుస్తకాలు రావాలంటే రూ.10 వేలు లంచం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఐదు వేలు నుంచి బేరం మాట్లాడుతూ చివరకు రూ.9 వేలకు బేరం కుదుర్చుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో బయ్యవరం హెరిటేజ్ వద్దకు గురువారం ఉదయం 10 గంటలకు వీఆర్వోను రమ్మని అక్కడ రూ.9 వేలు ఉపాధ్యాయులు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అతని నగదును స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వోను విశాఖ తీసుకువెళ్లారు. దాడులలో సీఐలు గణేష్, రమణ అప్పారావు, మహేష్, ఖాదర్ పాల్గొన్నారు.

అడ్డతీగల ఐసీడీఎస్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కూడా..



విశాలాంధ్ర- అడ్డతీగల : తూర్పు గోదావరి జిల్లా అడ్డతీగల ఐసీడీఎస్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణమూర్తి గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అడ్డతీగల ఐసీడీఎస్ కార్యాలయంలో గతంలో డ్రైవర్‌గా పనిచేసిన నాగేశ్వరరావు డిప్యూటేషన్‌పై కొయ్యలగూడెంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అతని భార్య అనారోగ్యం కారణంగా జీపీఎఫ్‌లో డబ్బు తీసుకోవడానికి అడ్డతీగల ఐసీడీఎస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ మూర్తిని ఆశ్రయించారు. రూ.15 వేల లంచం డిమాండ్ చేయడంతో తన వద్ద అంత సొమ్ము లేవని ప్రాధేయపడ్డారు. బిల్లులు అయిన తదుపరి సొమ్ము ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని నాగేశ్వరరావు ఏసీబీని ఆశ్రయించడంతో పథకం ప్రకారం వలపన్ని పట్టుకున్నారు. శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.



ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణీకుల రద్దీని నివారించడానికి సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్-కాకినాడటౌన్-హైదరాబాద్ (2 సర్వీసులు)

రైలు నెంబర్ 07075గా ఈ నెల 29వ తేదీన సికింద్రాబాద్‌లో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07076గా ఏప్రిల్ 1వ తేదీన కాకినాడ టౌన్‌లో రాత్రి 9.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.

ఏయూ ఉద్యోగుల ప్రమోషన్లలో

మళ్లీ గందరగోళం

- జీవో నెంబర్ 135ను అన్వయించుకున్న వర్సిటీ
- పాలకవర్గ సమావేశంలో ఈ అంశం తెరపైకి
- నిలచిన పలువురు ఉద్యోగుల పదోన్నతులు
- కమిటీ నివేదికలో కూడా కొరవడిన స్పష్టత

విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు సంబంధించి పదోన్నతుల విషయంలో గత కొంతకాలంగా ఉన్న గందరగోళం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల జరిగిన వర్సిటీ పాలకవర్గ సమావేశంలో ప్రభుత్వ జీవో 135ను అడాప్ట్ చేసుకోవాలని నిర్ణయించారు. దీంతో వర్సిటీలో టెక్నికల్ సిబ్బంది, నాన్‌టెక్నికల్ సిబ్బంది కొంతమందికి ప్రమోషన్లు నిలిచిపోయాయి. పాతపద్ధతిలో సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తే జీవో అడ్డొస్తుందని వర్సిటీ అధికారులు చెబుతుండగా, తమను కాదని రెండేళ్ల క్రితం ఉద్యోగంలోకి వచ్చిన వారికి ఎలా ప్రమోషన్లు కల్పిస్తారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తుండటంతో మొత్తం ప్రక్రియ నిలచిపోయింది.


జీవో నెం.135 ఏమి చెబుతోంది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో శాశ్వత పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న బోధనేతర సిబ్బందికి యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సీనియార్టీని బట్టి పదోన్నతులు లభించేవి. అదే విధంగా యూనివర్సిటీ ఏర్పడినప్పట్నుంచి ఏయూలో కూడా అదే విధంగా ఉద్యోగులకు పదోన్నతులు లభించేవి. కానీ 2014లో ప్రభుత్వం విడుదల చేసిన 135 జీవో ప్రకారం నాన్ టెక్నికల్ సిబ్బందికి డిగ్రీ విద్యార్హత, టెక్నికల్ సిబ్బందికి ఐటీఐ విద్యార్హతతో పదోన్నతులకు ముడిపెట్టింది. ఇదే వివాదానికి కారణంగా నిలచింది.

అనుబంధ జీవో 261 ఏం చెబుతోంది

1998లో విడుదలైన జీవో నెంబర్ 261 ఎమెండ్‌మెంట్స్ ప్రకారం ఇంటర్మీడియట్ విద్యార్హతతో పదోన్నతులు కల్పించాలని పేర్కొంది. ఈ జీవోకు అనుబంధంగానే విడుదల చేసిన 135 మాత్రం పదోన్నతులకు డిగ్రీ విద్యార్హతగా పేర్కొంది.

జీవో అమలులో జాప్యం



రాష్ట్ర ప్రభుత్వం ఈ పదోన్నతు లకు సంబంధించి 1998లో విడుదల చేసిన జీవో నెంబర్ 261ను వర్సిటీ అధికారులు అమలు చేయలేదు. 2016 సంవత్సరం వరకు టెన్త్ విద్యార్హత ఉన్నవారికి కూడా సీనియారిటీ ప్రకారం పదోన్నతులు లభించేవి. ఈ నేపథ్యంలో 2014లో మరో జీవో 135 విడుదల చేసింది. కానీ అప్పుడు కూడా వర్సిటీ అధికారులు ఈ జీవోను కూడా పరిగణనలోనికి తీసుకోకుండా ఏయూలో యధావిధిగా సీనియార్టీ ప్రకారం 2016 సంవత్సరం వరకు పదోన్నతులు కల్పించారు. ఆతరువాత కళ్లు తెరిచిన అధికారులు ఈ జీవోను అడ్డంకిగా చూపిస్తూ పదోన్నతులు నిలిపివేశారు. అంటే 2016 వరకు కొంతమందికి యధావిధిగా ప్రమోషన్లు వచ్చాయి. తదుపరి కొంతమందికి ఆగిపోయాయి. అధికారులు చేసిన ఈ తప్పిదానికి ఉద్యోగులు బలైపోయారు.

స్పష్టత లేని కమిటీ నివేదిక

వర్సిటీలో జీవో నెం. 135, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి పూర్తి వివరాలు నివేదిక ద్వారా ఇవ్వవలసిందిగా కోరుతూ ఆచార్య రామ్మోహనరావు అధ్యక్షతన ఒక కమిటీని వర్సిటీ ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కూడా 2017 నవంబరు నెలలో ఒక నివేదిక ఇస్తూ ఇకపై నియామకాలు పదోన్నతుల విషయంలో జీవో నెం. 135ను అమలు చేయాలని అప్పటివరకు పొందిన వారి ప్రమోషన్లు యధావిధిగా కొనసాగించాలని తెలిపింది. అంటే జీవో 2014లో విడుదలైతే 2016 వరకు పాతపద్ధతిలో పదోన్నతులు కల్పించి తదుపరి ఉన్నవారికి పదోన్నతులు నిలిపివేసేలా ఈ నివేదిక తోడ్పడింది. దీనిపైనే తదుపరి 2017లో జరిగిన పాలకవర్గ సమావేశంలో, ఇటీవల జరిగిన ఈసీలో కూడా చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

2014లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 135ను వర్సిటీలోని విభాగాలకు తెలియజేయాల్సిన అధికా రులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. అదే విధం గా ఇటువంటి జీవోలు విడుదలైనప్పుడు ఆయా సిబ్బందికి విద్యార్హతకు కొంత సమయం ఇచ్చి ఆయా జీవోలను స్వీకరించేలా వ్యవహరించాల్సిన వారు ఆ విషయాన్ని పరిగణనలోనికి తీసుకోలేదు. దీంతో ఇప్పుడు వర్సిటీ ఉద్యోగుల పదోన్నతులకు అడ్డంకులు వచ్చిపడ్డాయి. ఈ విషయమై వర్సిటీ ఉన్నతాధికారులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి వచ్చిపడింది.

పరిశీలించి న్యాయం చేస్తాం : వీసీ ఆచార్య నాగేశ్వరరావు

ఈ విషయమై ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇకపై వర్సిటీలో ఉద్యోగులకు కల్పించే పదోన్నతులకు జీవో నెంబర్ 135 ను అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం నిలచిపోయిన పలువురు పదోన్నతుల విషయంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ఆడిట్ అభ్యంతరం లేకుంటే వారికి పదోన్నతలు కలిస్తామని, లేకుంటే సాధ్యం కాదని ఆయన తెలిపారు.

కూలంకషంగా చర్చించాల్సి వుంది : రిజిస్ట్రార్ ఆచార్య ఉమామహేశ్వరరావు

వర్సిటీలో ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి జీవో నెంబర్ 135ను స్వీకరించడం వల్ల విద్యార్హతలు బట్టీ పదోన్నతలు కల్పించాల్సి ఉందని రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

కానీ 2016 వరకు పదోన్నతులు పాత పద్ధతిలో కల్పించే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి జాబితాలో మిగిలిన వారికి విద్యార్హతకు కొంత సమయాన్ని ఇచ్చే అవకాశాలు పరిశీలించాల్సి ఉందని, తొందరలో ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.


విజయవాడలో


విశాఖలో


తిరుపతిలో

దిగ్బంధం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రత్యేక హోదా మలిదశ ఉద్యమం పతాకస్థాయికి చేరింది. పార్టీలకతీతంగా ప్రజలంతా ఏకమయ్యారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, కార్మికులు అందరిదీ ఒకటే నినాదమైంది. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ ఢిల్లీ దద్దరిల్లేలా నినదించారు. ఏపీకి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనంతో రాష్ట్రం రెండుగంటల పాటు పూర్తిగా స్థంభించింది. ఎక్కడివాహనాలు అక్కడే నిల్చిపోయాయి. విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు రహదారుల దిగ్బంధనం కార్యక్రమం చేపట్టగా ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రోడ్లపై బైటాయించి కేంద్ర వైఖరిని ఎండగడుతూ వాహన రాకపోకలను నిలిపివేశారు. కిలోమీటర్ల పొడవునా వాహనాలు ఎక్కడికక్కడే నిల్చిపోయాయి. వాహనాల యజమానులు, బస్సులు, కార్లలో ప్రయాణించేవారు సైతం ఆ రాస్తారోకో కార్యక్రమాల్లో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించడం విశేషం. ఈకార్యక్రమాల్లో సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, వైయస్ఆర్ కాంగ్రెస్, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా ఈకార్యక్రమానికి మద్దతు ప్రకటించి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఒక్క బీజేపీ మినహా అన్ని పార్టీలు ఈ ఆందోళనకు మద్దతు పలికి ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. విజయవాడ కనకదుర్గ వారధి దగ్గర జరిగిన జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు, సినీ హీరో శివాజీ, వైసీపీ రాష్ట్ర నాయకులు పార్థసారధి, విజయవాడ నగర సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్, జనసేన నాయకులు పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికైనా ఢిల్లీ పెద్దలు దిగిరావాలని, విభజనాంశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని నేతలు ప్రత్యక్షంగా చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. విశాఖ జిల్లాలో 8 సెంటర్లలో హైవేల దిగ్బంధన కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం మద్దిలపాలెం జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ, సత్యనారాయణమూర్తి, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, నగర కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు, రాష్ట్ర సమితి సభ్యులు ఎ.విమల తదితరులు పాల్గొనగా, గాజువాకలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.జె.స్టాలిన్, అనకాపల్లిలో జిల్లా పార్టీ కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, పాయకారావుపేటలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్, అరకులో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె.భూషణం తదితరులు పాల్గొన్నారు. మహిళలు రోడ్లపై కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. మరికొంతమంది ఆందోళనకారులు కోకో, దింసా నృత్యాలు చేశారు. కృష్ణాజిల్లా నందిగామ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కినేని వనజ, నాయకులు జరబన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నెల్లూరులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు రావుల వెంకయ్య, స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, సీపీఐ నాయకులు ప్రభాకర్, మునీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతపురంలో జిల్లా సీపీఐ కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శులు జాఫర్, నారాయణస్వామి, పార్లమెంటు సభ్యులు అనంత వెంకట్రామిరెడ్డి, సీపీఐ నాయకులు శ్రీరాములు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు. కడప జిల్లాలో 6 కేంద్రాలలో దిగ్బంధన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. యర్రగుంట్ల వద్ద హైవేపై జరిగిన కార్యక్రమంలో కడప జిల్లా సీపీఐ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ప్రొద్దుటూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు రామయ్య తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో 5 సెంటర్లలో కార్యక్రమం నిర్వహించగా కర్నూలులో జరిగిన రాస్తారోకోలో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు మునెప్ప, రసూల్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్యా, నగర కార్యదర్శి పి.గోవింద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భీమలింగప్ప, రైతు సంఘం నాయకులు జగన్నాథం, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.రంగన్న తదితరులు పాల్గొన్నారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వద్ద హైవేపై జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ నెక్కంటి సుబ్బారావు, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, ఎన్. జయరామ్, యు. హేమశంకర్ తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లాలో విజయనగరం, సాలూరు, బొబ్బిలిలలో రాస్తారోకోలు జరిగాయి. విజయనగరం రాజీవ్ విగ్రహం సమీపంలో జరిగిన హైవే దిగ్బంధనలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి. కామేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఒమ్మి రమణ, బుగత అశోక్, బి. రమణమ్మ, అప్పలనాయులు తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో 4 కేంద్రాలలో నిర్వహించగా ఒంగోలులో జిల్లా సీపీఐ కార్యదర్శి యంయల్ నారాయణ, నగర కార్యదర్శి సర్దార్, సీపీఐ నాయకులు యం.వెంకయ్య, హనుమారెడ్డి, వెంకట్రావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 7 కేంద్రాలలో నిర్వహించగా శ్రీకాకుళంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. నర్సింహులు, మాజీ కార్యదర్శి చాపర వెంకట రమణ తదితరులను అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లాలో చిలకలూరిపేట హైవేపై జరిగిన రాస్తారోకోలో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, నాయకులు వి.రాధాకృష్ణమూర్తి, సీపీఎం నాయకులు పి.రామారావు, సాధన సమితి నాయకులు మల్లిఖార్జునరావు, హరి తదితరులు పాల్గొన్నారు. వారిని పోలీసులు అరెస్టులు చేసి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తూర్పు గోదావరి జిల్లాలో 4 కేంద్రాలలో కార్యక్రమం జరిగింది. కాకినాడలో సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, నగర కార్యదర్శి నక్కా కిషోర్, డీహెచ్‌పీఎస్ నాయకులు కుంచె అంజిబాబు, రైతు సంఘం నాయకులు నక్కా శ్రీనివాసరావు తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి సమీపంలో హైవేమీద జరిగిన రాస్తారోకోలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, వైసీపీ రాష్ట్ర నాయకులు కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రమీలమ్మ, సీపీఎం నాయకులు కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొనగా, చిత్తూరు, మదనపల్లిలతోపాటు పలు కేంద్రాలలో రాస్తారోకోలు జరిగాయి.

మోడీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారు : కె.రామకృష్ణ

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడంలో ప్రధాని నరేంద్ర మోడీ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ రహదారుల దిగ్బంధనానికి పెద్దఎత్తున ప్రజాస్పందన లభించిందని ఆయన స్పష్టం చేశారు. 13 జిల్లాల్లోనూ జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారుల్నీ ప్రజలు దిగ్బంధించి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారని తెలిపారు. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం దిగిరావాలని, లేకుంటే ఢిల్లీకి సెగతగిలేలా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి తీరాలని డిమాండు చేశారు. కేంద్రంలో మోడీ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఎంపీలంతా పార్లమెంటులో ఆందోళనలు చేస్తున్నప్పటికీ వారికి ఐదు నిమిషాల సమయం ఎందుకు కేటాయించట్లేదని ప్రశ్నించారు.

రాష్ట్రానికి హోదా, విభజన హామీలను సాధించేంత వరకూ పోరాటాల్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి పదేళ్లపాటు హోదా ఇస్తామని గతంలో వెంకయ్య నాయుడు ప్రకటించారని గుర్తు చేశారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఉప రాష్ట్రపతికి రాజీనామా చేసి స్వర్ణభారత్ ట్రస్టును నడుపుకోవాలని సూచించారు.

విభజన హామీలు అమలు చేయాలి : పి.మధు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రానికి హోదా ప్రకటించాలని, విభజన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. రెండు గంటలపాటు రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధనంతో కేంద్రానికి సంకేతం అందజేశామన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం స్పందించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని, లేకుంటే హోదా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. త్వరలో హీరో శివాజీ, పవన్ కల్యాణ్‌లు ప్రత్యేక హోదా కోసం నిరవధిక దీక్షలు చేపడతామని ప్రకటించారని గుర్తు చేశారు.

రాష్ట్రంపై కక్ష సాధింపు

విమర్శించిన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రానికి అన్యాయం చేస్తూ ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని కేంద్రంపై టిడిపి ఎమ్మెల్యేలు మండిపడ్డారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర విమర్శల పర్వం కొనసాగించారు.

ఎమర్జెన్సీ విధించేలా ఉన్నారు : అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా175-200 మంది సభ్యులు సిద్ధంగా ఉన్నారు. దాన్ని దారి మళ్లించడానికి బీజేపీ వారు కుట్రలు పన్నుతున్నారు. పార్లమెంట్ లో తెలుగు ఎం.పీ లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి నిన్న అసెంబ్లీలో విష్ణుకుమార్ రాజు పట్టిసీమ పై అవినీతి ఆరోపణలు చేశారు. సీబీఐ ఎంక్వైరీల పేరుతో 5 కోట్ల ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తారా. బీజేపీ ఏపీ మీద ఎమర్జెన్సీ విధించే ప్రయత్నం చేస్తుంది. పవన్ మాటలు అవగాహన రాహిత్యం గా ఉన్నాయి. పవన్ తీసుకున్న యూ టర్న్ ప్రజలు గమనిస్తూ ఉన్నారు. జనసేన నాయకులకే టచ్ లో లేని పవన్. 40 మంది టిడిపి ఎమ్మెల్యేలుతో ఎలా టచ్ లో ఉంటారు.

ప్రశ్నిస్తే బెదిరింపులా.: మోడీని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైన సీబీఐ ఎంక్వైరీలు, ఐటీ దాడులు చేయిస్తున్నారు. చంద్రబాబు , లోకేష్ లతో పాటు టీడీపీ మీద కుట్ర జరుగుతున్నట్లు అనుమానంగా ఉంది.దేశంలో స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తామనే బీజేపీ పార్లమెంట్ లో సమాధానాలు చెప్పుకోలేక అక్కడ ఏ.ఐ.ఏ.డి.ఎం.కె , తెరాస పార్టీలతో రాష్ట్రంలో జగన్ మరియు పవన్ లతో కలిసి డ్రామాలాడుతున్నారు. సీఎంకి ఏ హాని చేసినా రాష్ట్రప్రజాలందరికి హాని చేసినట్లే.

మరింత గాయం చేస్తున్నారు : ఆనాటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి గాయం చేస్తే, ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఆ గాయం మానకుండా రేపుతూ మరింత గాయం చేస్తుంది. జపాన్ తరహాలో రోజు మాదిరిగా పనిచేసే సమయం కంటే మరింత ఎక్కువ సమయం పనిచేస్తూ నిరసన తెలియచేస్తున్నాం ప్రజా ఆగ్రహానికి గురియైన ఏ వ్యక్తులు తపించుకున్నట్లుగా చరిత్రలో లేదు. జూన్ నెలలో నాట్లు పడే పరిస్థితి నుండి, ఎప్పుడు నాట్లు పడతాయి తెలియని పరిస్తితికి వెళ్లి, మరలా ఇప్పుడు పట్టిసీమ వలన జూన్‌లో నాట్లు వేసుకునే పరిస్థితికి వచ్చాము. అటువంటి పట్టిసీమ మీద అవినీతి ఆరోపణలు చేయటం దారుణం.

అవినీతిపరులను ఉరి తీయాలి : అవినీతికి కేరాఫ్ అడ్రస్ జగన్ అయితే, నిజాయితీకి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు. 2000 సంవత్సరంలో వైఎస్సార్ అనేక రిట్లు వేసి, మరలా అతనే ఉపసంహరించుకున్నాడు. చంద్రబాబు పై జగన్ తల్లి విజయమ్మ 26 కేసులు పెడితే సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. అవినీతి పరులైన జగన్

బీజేపీది బాధ్యత రాహిత్యం : బిజెపి శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు పట్టిసీమ గురించి చేసిన వ్యాఖ్యలు ఆయన బాధ్యత రాహిత్యాన్ని తెలియ చేస్తున్నాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2015 లో పట్టిసీమ ప్రారంభిస్తే, 2016 మార్చిలో కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. ఇప్పుడు 2 సంవత్సరాల తర్వాత టిడిపి రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి మాట్లాడుతుంటే, కేంద్రం పై అవిశ్వాసం పెడతా ఉంటే, ఈ సమయంలో టిడిపి పై అవినీతి ఆరోపణలు చేయడం బిజెపి ఉద్దేశాన్ని బహిర్గతం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర విభజన కు వ్యతిరేకంగా ఆరోజు పోరాటం చేసామని ,విభజన జరిగితే నాగార్జున సాగర్ డెల్టా రైతులు నష్ట పోతారని ముందే చెప్పామన్నారు. బహిరంగంగా ఉరి తీయాలి. విజయ్ మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీ, విజయసాయిరెడ్డి లాంటి నేరస్తులకు ప్రధాని కార్యాలయం ఏవిధంగా అపా యింట్మెంట్ ఇస్తుంది. విజయసాయిరెడ్డి చంద్రబాబును బోను ఎక్కిస్తాను అని మాట్లాడుతుంటే ప్రజలు అర్థం చేసుకోలేరా. సిబిఐ ఎవరి చెప్పు చేతల్లో పనిచేయదు.

పత్తిపాటిపై ఆరోపణలు ఖండిస్తున్నాం : జగన్ మోహన్ రెడ్డి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మీద చేస్తున్న ఆరోపణలు అర్థరహితం .వాటిని తీవ్రంగా ఖండిస్తున్నాం. బిజెపి ఆపరేషన్ గరుడ పేరుతో రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తోంది. ఎన్‌డీఏ నుంచి బయటికి రాగానే అసత్య ఆరోపణలు చేస్తున్నారు. జగన్ ఆత్మ విజయసాయిరెడ్డి చంద్రబాబు పై విమర్శలు చేయటం వెనక ఎవరున్నారో ప్రజలు చూస్తున్నారు. వైఎస్సార్ హయాంలో 21 కేసులు చంద్రబాబు మీద పెడితే ఏవి నిరూపించలేకపోయారు. 16 నెలలు జైల్లో ఉన్న వ్యక్తులకు చంద్రబాబు గురుంచి మాట్లాడే హక్కు లేదు. తప్పుడు కేసులకు భయపడేది లేదు. ఐదు కోట్ల మంది ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకి అండగా ఉన్నారు..

బీజేపీకి నాగం గుడ్‌బై

ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తా : నాగం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కొంతకాలంగా బీజేపీని వీడనున్నట్లు వస్తున్న వార్తలను నాగం జనార్ధనరెడ్డి నిజం చేశారు. గురువారం బీజేపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను మెయిల్ ద్వారా బీజేపీ అధ్య క్షుడు అమిత్‌షాకు పంపారు. నాగం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలపై పోరాడుతున్నాగానీ పార్టీ నుంచి ఎలాంటి సహకారం లేక ఒంటరి పోరాటం చేశానని చెప్పారు. తనకు సముచిత స్థానం కల్పించడంలోనూ పార్టీ విఫలమైందని, అసంతృప్తితోనే బీజేపీని వీడుతున్నా నన్నారు. త్వరలోనే తాను ఏ పార్టీలో చేరే విషయాన్ని ప్రకటిస్తానన్నారు. ఉగాది తరువాత తన నిర్ణయం ప్రకటిస్తానని ఇంతకు ముందే స్పష్టం చేసిన నాగం చెప్పినట్లుగానే బీజేపీకి రాజీనామా చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుంచి పార్టీలో కీలకంగా వ్యవ హరించిన నాగంజనార్ధన్ రెడ్డి తెలంగాణ విషయంలో పార్టీతో విబేధించి బయటకు వచ్చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీలో చేరిన ఆయన మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీ విధానాలపై అవగాహన లేకనో లేదా విధానాలు నచ్చకనో ఆయన పార్టీతో అంటిముట్టనట్లుగా ఉంటూ వచ్చారు. పార్టీ నేతలు కూడా ఆయనను దూరంగానే ఉంచారు. ఇటీవల ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నారని, చేరిపో యారని కూడా వార్తలొచ్చాయి. అయితే నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడంతో నాగం వెనుకడుగు వేశారు. ఈ మధ్య నాగర్‌కర్నూల్‌లో ఉంటున్న నాగం కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరపడంతో పాటు గ్రామాల్లో వున్న క్యాడర్‌ను కూడగట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. కీలక నాయకులు మాత్రం అయనను వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఆయన రాకను బహిరంగంగానే వ్యతిరేకించారు. జైపాల్‌రెడ్డి సహకారంతో నాగం కాంగ్రెస్‌లో చేరేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నా రని పార్టీ వర్గాలు అంటున్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన డీకే అరుణ వర్గం కూడా కాంగ్రెస్‌లోకి నాగం రాకను వ్యతిరేకిస్తోంది. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిసి ఇదే విషయాన్ని నివేదించింది. మొత్తం మీద నాగం బీజేపీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో ఆయనపై మళ్లీ చర్చ మొదలైంది. నాగం కాంగ్రెస్‌లో చేరుతారో లేక వేరొక పార్టీ వైపు చూస్తారా అనేదానిపై స్పష్టత రావాల్సి వుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నాగంకు కాంగ్రెస్‌లో వుంటేనే భవిష్యత్తు వుంటుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి

ఏఐటీయూసీ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, హెచ్ఎండీఏ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని హెచ్ఎండీఏ గార్డెన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీఎస్.బోస్ డిమాండు చేశారు. కోర్టు తీర్పులను ప్రభుత్వం గౌరవించకుంటే ఎలా అని నిలదీశారు. హెచ్ఎండీ గార్డెన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీ యూసీ) ఆధ్వర్యంలో గార్డెన్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండు చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. బోస్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు వారి జీతభత్యాలను నియమనిబంధనలు లేకుండా పెంచుకొన్నారే తప్ప కాలే కడుపులతో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకరరావు మాట్లాడుతూ కార్మిక విధానం, పారిశ్రామిక మానవ సంబంధాలను అధోగతికి చేర్చి పెట్టుబడిదారుల దోపిడీకి రాచమార్గం చూపుతున్నారన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.వీరేందర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ శానిటేషన్ కార్మికులకు రూ.14 వేలు జీతం ఇవ్వాలని, నగరంలో ఇతరచోట్ల పనిచేస్తున్నవారికీ అదే జీతం చెల్లించాలన్నారు.


ఆధునిక హంగులతో పోలీసు స్టేషన్లు : నాయిని

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్లలో రెండవ ర్యాంకు సాధించిందని హోం శాఖ మంత్రి నాయిని నర్సిం హారెడ్డి తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు. శాసన మండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్.ప్రభకారరావు, ఎం.హనుమంతరావు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లను ఉత్తమ స్టేషన్లుగా తీర్చి దిద్దుతామన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టణాల్లోని పోలీస్ స్టేషన్లకు నెలకు రూ.75 వేలు, జిల్లా పోలీస్ స్టేషన్లకు రూ.50 వేలు, గ్రామీణ పోలీస్ స్టేషన్లకు రూ.25 వేలు ఇస్తున్నామన్నారు.

ప్రభాకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు దేశానికే ఆదర్శంగా నిలపాలన్నారు. హోంశాఖకు మరిన్ని నిధులు కేటాయించి శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు.

చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయాలి

శాసనమండలిలో ఎమ్మెల్సీ కత్తి డిమాండు





విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండు చేశారు. శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన గురువారం జరిగిన శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. 1985లో జీవో ప్రకారం 11 రకాల వస్త్రాలు మగ్గాలపైన తయారు చేయాలని, విద్యార్థుల యూనిఫారానికి చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా కొనాల్సి ఉండగా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం ఉందని చేనేతల అభివృద్ధికి వేయి కోట్ల రూపాయలు కేటాయించాలని నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై రాము సూర్యారావు, రామసుబ్బారెడ్డి పోతుల సునీతలు మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలని కోరటంతో పాటు రుణమాఫీని మిగిలిన వారికి కూడా అమలు చేయాలన్నారు. ఈ అంశంపై చేనేత శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ రుణమాఫీ పథకం క్రింద ఇప్పటికి 23,353 మంది నేత కార్మికులకు 76.20 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. ఇంకా రుణమాఫీ వర్తించని కార్మికులుంటే వారి వివరాలు అందిస్తే రుణమాఫీ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 70 వేల చేనేత మగ్గాల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో మాదిగల కోసం దండోరా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనం కోసం జారీ చేసిన జీవో 25 సక్రమంగా అమలు కావటం లేదని ఎమ్మెల్సీ శమంతకమణి ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ఉప కులాల్లో ఒకటైన మాదిగలు ఎక్కువగా ఉండే కర్నూలు, కడప, అనంతపురంలలో జీవో 25 అమలు కావటం లేదని, ఒకవైపు వర్గీకరణ కాలేదన్న ఆ వర్గంలో నెలకొని ఉందని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంపై సభా సంఘాన్ని నియమించాలని ఆమె కోరారు. ఎమ్మెల్సీ సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో కూడా జీవో 25 విషయం పై విధంగానే ఉందని చెప్పారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ సభ్యులకు అలాంటి అపోహలు అవసరం లేదని, రాష్ట్రంలో జీవో 25 సక్రమంగానే అమలు అవుతోందని, 2015-16, 2016-17లలో ఆ వర్గానికి చెందిన 3,751 మందికి అదనంగా లబ్ధి చేకూరిందని, సభ్యులు రికార్డులు పరిశీలించుకోవచ్చని చెప్పారు. దళిత పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకే కేంద్రం ప్రవేశపెట్టిన డిక్కీ పథకాన్ని కూడా రాష్ట్రంలో అమలు చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో అద్భుత ఫలితాలు వస్తున్నాయని, అందులో సిబ్బందికి, రెగ్యులర్ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని సభ్యుడు కత్తి నరసింహారెడ్డి కోరారు. గురుకులాల్లో సిబ్బంది క్యాజువల్ లీవులను పెంచాలని ఏఎస్ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లపై ప్రభుత్వం సీతకన్ను వేసిందని, నెలకు ఒకరోజు సెలవుకు బదులు 15 రోజులకు ఒక సెలవు, మహిళ సిబ్బందికి ఐదు సెలవులు మంజూరు చేయాలన్నారు. దీనికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు సమాధానమిస్తూ సభ్యుల సూచనలను పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం : లోకేష్

రాష్ట్రంలో క్లోరినేషన్ చేయకుండానే ఓపెన్ ట్యాంకుల ద్వారా తాగునీటిని అందిస్తున్నారని, ప్రకాశం, గుంటూరు జిల్లాలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ఉందని, పశువులకు కూడా నీరు అందటం లేదని ఎమ్మెల్సీ కరణం బలరామ్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ ప్రశ్నకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ తాగునీటి విషయంలో మీడియా ద్వారా వస్తున్న సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని, ప్రకాశం జిల్లాలో 209 గ్రామాలకు 2,200 ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు రూ.1600 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో అన్ని ఇళ్ళకు కుళాయిలు అమరుస్తామని చెప్పారు. కొల్లేరు ప్రాంతంలో కూడా సమస్యను పరిష్కరిస్తామన్నారు. నీటి ట్యాంకర్ల టెండర్లపై మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ వ్యవహారంలో స్కామ్ జరుగుతోందన్న అనుమానాలను ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ సమాధానమిస్తూ ట్యాంకర్లు గమ్యస్థానానికి చేరుకొన్నది తెలిసేలా లైవ్ ట్రాకింగ్ సిస్టమ్ అమర్చామని, అలా చేరితేనే బిల్లులు చెల్లిస్తున్నామని, అవినీతికి ఆస్కారమే లేదన్నారు. తనకు అవినీతికి పాల్పడాల్సిన అవసరం అంతకన్నా లేదన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణాలో అటవీ శాఖ, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలలో ఇంటి దొంగలు ఎక్కువయ్యారని, వాహనాలు పైకి బాగానే ఉంటాయని, అందులో విడిభాగాలు మాయమవుతున్నాయని ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులు చెప్పుకొచ్చారు. సభ్యుడు యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బాసరాపేట వద్ద వేల వాహనాలు ఉన్నాయని, వీటిని వేలం వేయాలని, ఎర్ర చందనం విక్రయం ద్వారా ఇప్పటికి వచ్చిన ఆదాయం, మిగిలి ఉన్న ఎర్రచందనం వివరాలు తెలపాలన్నారు. అక్రమ రవాణాలో దొరికిన వాహనాలను ప్రభుత్వ వైద్యశాలలో అంబులెన్స్‌లుగా, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మరో సభ్యుడు దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ శాఖలకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు వేలం ద్వారా వాహనాలు ఇస్తే బాగుంటుందని సూచించారు. సభ్యుల ప్రశ్నలపై అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ మొత్తం ఆరువేల వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో 2,700 వాహనాలకు త్వరలో వేలం వేయనున్నామని చెప్పారు. ఇప్పటికి ఎర్రచందనం ద్వారా 1,231 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. 1492 టన్నుల ఎర్రచందనాన్ని వచ్చే నెలలో వేలం వేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖలు అవసరమని కోరితే వాహనాలను వేలం ద్వారా అప్పగిస్తామన్నారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలలోని జంఝావతి ప్రాజెక్ట్ కాలువ పనులు పురోగతిపై ఎమ్మెల్సీ డి.జగదీశ్వరరావు ప్రశ్నించగా ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జంఝావతి పనులు అంతంతమాత్రంగానే జరిగాయని, ఈ విషయంపై కాంట్రాక్టర్‌కు జరిమానా విధించి నోటీసులు కూడా జారీ చేశామని, 2018 నవంబర్ నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. నీరు - చెట్టు పథకం క్రింద గత నాలుగేళ్లలో జిల్లాల వారీగా విడుదల చేసిన, ఖర్చు పెట్టిన వివరాలను మంత్రి దేవినేని వివరించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించేందుకు ఇమ్మిగ్రేషన్, కస్టమ్ అనుమతులను కేంద్రం ఇచ్చిందన్నారు. 700 ఎకరాలు భూ సేకరణ జరిపి కేటాయించామని, రన్‌వే నిర్మాణం వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తవుతుందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో హోంగార్డుల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సభ్యుడు బొడ్డు నాగేశ్వర రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హోం గార్డుల్లో ఎస్టీలకు మాత్రమే సౌకర్యం ఉందని ఉప ముఖ్యమంత్రి చిన రాజప్ప వివరించారు. వారి వేతనాలు పెంచాలని, కానిస్టేబుళ్లుగా పదోన్నతులు కల్పించాలని డొక్కా మాణిక్యవరప్రసాద్, శమంతకమణి, మాధవ్‌లు కోరగా కానిస్టేబుళ్లుగా పదోన్నతులు పొందేందుకు 8 శాతం కోటా ఉన్నట్లు చినరాజప్ప వివరించారు. హోంగార్డు సంఘంతో త్వరలో చర్చించి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైతుల సంక్షేమం కోసమే..

సమన్వయ సమితులపై పోచారం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటితం చేసేందుకు, వారందరి సంక్షేమం కోసం రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికారపక్ష సభ్యులు రసమయి బాలకిషన్, వేముల వీరేశం, చింత ప్రభాకర్ రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, పనితీరుపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భూమి ఉన్న వారికి మాత్రమే సమన్వయ కమిటీలో స్థానం కల్పించినట్లు తెలిపారు. గ్రామ రైతు సమన్వయ కమిటీలో 15మంది రైతులు అందులో 1/3వ వంతు మహిళలకు చోటు కల్పించినట్లు వెల్లడించారు. మండలస్థాయిలోనూ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.వీరిలో అన్ని కులాలు, అన్ని మతాల వారికి చోటు కల్పించినట్లు చెప్పారు. మొత్తం లక్షా 61వేల మంది రైతు సమన్వయ సమితిలో సభ్యులుగా ఉన్నారన్నారు. ప్రాంతీయ రైతుల సమన్వయ సమితి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కమిటీ సభ్యుల పాత్ర, విధులు, బాధ్యతలపై వివరించారని పోచారం తెలిపారు. సందేహాలుంటే పింక్ కలర్ స్లిప్ ద్వారా, సలహాలను గ్రీన్ కలర్ స్లిప్ ద్వారా స్వీకరించామన్నారు. కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా, కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు ఒకవేళ ఏ పంటనైనా అమ్ముడు పోని పక్షంలో ఆ పంటను రైతు సమన్వయ సమితులేకొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మంచి వంగడాలు అందించడం, పెట్టుబడి సాయం, దళారి వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యంగా రైతు సమన్వయ సమితులు పనిచేయనున్నట్లు తెలిపారు.

పాండ్యాపై ఎఫ్ఐఆర్

పోలీసులను ఆదేశించిన ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం



జోధ్‌పూర్: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యపై కేసు నమోదు చేయాలని జోధ్‌పూర్‌లోని ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. ఓ సామాజిక వర్గానికి చెందిన ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అతను వ్యాఖ్యానించినందుకుగానూ ఈ విధంగా ఆదేశాలు జారీచేసింది. గతేడాది డిసెంబరు 26న పాండ్యా 'దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల వ్యాధిని వ్యాప్తి చేసింది అంబేద్కర్' అంటూ ట్వీట్ చేశాడు. అప్పట్లో అది వివాదంగా మారింది. దీంతో రాజస్థాన్ లోని జలోర్ జిల్లాకు చెందిన రాష్ట్రీయ భీమ్ సేనా సభ్యుడు, న్యాయవాది అయిన మేఘ్‌వాల్ అనే వ్యక్తి పాండ్యాపై ఫిర్యాదు చేశారు. అతని వ్యాఖ్యలు ఓ వర్గపు ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగళవారం కోర్టు తీర్పు అనంతరం మేఘ్‌వాల్ మాట్లాడుతూ... 'పాండ్య ట్వీట్ విషయం నాకు జనవరిలో తెలిసింది. రాజ్యాంగ నిర్మాత అయిన గొప్ప వ్యక్తిమీద అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం క్షమించదగ్గ విషయం కాదు. అందులోనూ ఆయన (పాండ్యా) దేశానికి ఆడుతున్న క్రీడాకారుడు. ఆయన చేసే ట్వీట్లు అనేకమందికి చేరుతాయి. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజాన్ని వేరు చేసినట్లు అవుతుంది. ఇలా ఓ వర్గపు ప్రజలను కించపరిచేలా మాట్లాడటం ఎంత మాత్రం సబబు కాదు. పాండ్యా పెద్ద నేరం చేశారు. ఆయనకు కఠిన శిక్ష పడాలి' అని అన్నారు.



తొలిరౌండ్‌లోనే పరాజయం

మియామి: ప్రపంచ మాజీ నంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారిణి, నల్లకలువ సెరెనా విలియమ్స్‌కు మరో ఓటమి ఎదురైంది. మియామి ఓపెన్‌లో భాగంగా బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ నుంచే సెరెనా నిష్క్రమించింది. జపాన్‌కు చెందిన నయోమి ఒసాకాతో జరిగిన పోరులో సెరెనా 3-6, 2-6 తేడాతో ఓటమి పాలైంది. గంటా 17 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఓసాకా దాటికి సెరెనా ఏమాత్రం సమాధానం ఇవ్వలేకపోయింది. దాంతో మియామిలో సత్తాచాటాలనుకున్న సెరెనా ఆశలు ఆదిలోనే ఆవిరయ్యాయి.

షమీకి క్లీన్‌చిట్

'బి' గ్రేడ్ కేటాయించిన బీసీసీఐ



ముంబై: భార్య హసీన్ జహాన్ ఆరోపణలతో కొన్ని రోజులుగా ఉక్కిరిబిక్కిరవుతున్న టీమిండియా క్రికెటర్ మహ్మద్ షమీకి భారీ ఊరట లభించింది. పేసర్ షమీ ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడలేదని తేలింది. ఈ మేరకు బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ విభాగం చీఫ్ నీరజ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. త్వరలో ప్రారంభం కానున్న ఐపీఎల్ లో ఆడేందుకు షమీకి మార్గం సుగమమైంది. హసీన్ జహాన్ చేసిన ఫిక్సింగ్ ఆరోపణల్లో మ్యాచ్ ఫిక్సింగ్ ఒకటి కాగా, వారం రోజుల కిందట బీసీసీఐ నేతృత్వంలోని అవినీతి నిరోధక విభాగం షమీ కేసును దర్యాప్తు చేసింది. అయితే అతడు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తమకు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని నీరజ్ కుమార్ వివరించారు. తమ నివేదికలో షమీకి క్లీన్‌చిట్ ఇవ్వడంతో అతడి క్రికెట్ కెరీర్‌కు ఎలాంటి ఢోకా లేదని తేలింది. మరోవైపు బీసీసీఐ ఇటీవల పునరుద్ధరించిన వార్షిక కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాలో బౌలర్ షమీ పేరు చేర్చినట్లు సమాచారం. భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణల కారణంగా కాంట్రాక్టు జాబితాలో చోటు కల్పించని, బీసీసీఐ తాజాగా షమీ నిర్దోషి అని తేల్చుతూ.. అతడిని వార్షిక కాంట్రాక్టులో గ్రేడ్ 'బి'లో చేర్చింది. దీని ప్రకారం షమీ వార్షిక జీతభత్యాలు రూ.3 కోట్లు అందుకోనున్నాడు. ఏ ప్లస్ గ్రేడ్ ఆటగాళ్లు రూ.7కోట్లు, ఏ గ్రేడ్ క్రికెటర్లు 5 కోట్ల వార్షిక వేతనం పొందనుండగా సి గ్రేడ్ ఆటగాళ్లు కోటి రూపాయలు బీసీసీఐ నుంచి అందుకుంటారు. కాగా, హసీన్ జహాన్ ఫిర్యాదు చేసిన హత్యాయత్నం, గృహ హింస, అత్యాచార యత్నం కేసుల విచారణ షమీపై ఇంకా కొనసాగుతోంది.



టీ20 సిరీస్‌లోనూ ఓటమి

ముంబై: భారత మహిళల క్రికెట్ జట్టు సొంతగడ్డపై పరాజయాల బాట కొనసాగిస్తోంది. ఇటీవల ఆసీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు టీ20 సిరీస్‌నూ పేలవంగా ప్రారంభించింది. ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా ఆసీస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన 41 బంతుల్లో 67 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 6 వికెట్లు కోల్పోయి 18.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ముక్కోణపు టోర్నీలో మూడో జట్టుగా ఇంగ్లండ్ ఆడుతోంది. భారత జట్టు: స్మృతి మంధాన 67, మిథాలీ రాజ్ 18, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్) 13, జమియో రోడ్రిగ్స్1, వేదా కృష్ణమూర్తి 15(నాటౌట్), అనుజా పాటిల్ 35, శిఖా పండే 1 (నాటౌట్) ఆసిస్ జట్టు: బీత్ మూనీ 45, అలిసా హేలీ 4, అష్లీగ్ గార్డెనర్ 15, ఎలిసీ విల్లానీ 39, మెగ్ లానింగ్(కెప్టెన్) 35(నాటౌట్), రాచెల్ హైనెస్ 12(నాటౌట్)

ఎప్పటికైనా చెన్నైకు ఆడతా



కేకేఆర్ కెప్టెన్ దినేశ్ కార్తీక్

న్యూఢిల్లీ: ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్నా క్రికెటర్లలో ఒకరైన దినేశ్ కార్తీక్ తన మనసులో మాటను బయటపెట్టాడు. కొద్దిరోజుల్లో ప్రారంభం కాబోతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-11 సమరం గురించి ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కార్తీక్ మాట్లాడాడు. కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్)కు కెప్టెన్‌గా బరిలోకి దిగబోతున్న కార్తీక్.. తన గుండె మాత్రం చెన్నై సూపర్ కింగ్స్ కోసం కొట్టుకుంటోందని వెల్లడించాడు. ఐపీఎల్ ప్రారంభమైన తొలి ఏడాదిలోనే తాను చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడతానని భావించానని అన్నారు. అయితే, 10 సీజన్లు గడిచినా అది సాధ్యం కాలేదని, ఏనాటికైనా కచ్చితంగా చెన్నై తరపున ఆడతాననే నమ్మకం ఉందన్నాడు. చెన్నైలోనే తాను పుట్టి, పెరిగానని అందుకే చెన్నై జట్టుకు ఒక్కసారైనా ఆడాలని అనుకుంటున్నాని తెలిపాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో తనపై నమ్మకం ఉంచి కెప్టెన్సీ బాధ్యతను అప్పగించిన కేకేఆర్‌ను నిరాశపర్చనని అన్నాడు. ఐపీఎల్ ఆడే జట్లలో చెన్నై, బెంగుళూరు, కోల్‌కతా, ముంబై జట్లకు సింహభాగం ఫ్యాన్స్ ఉన్నారని చెప్పాడు. ఏళ్లుగా ఆశాజనకమైన ఆటను ఆడుతున్న చెన్నై జట్టు క్రమంగా ఫ్యాన్ బేస్‌ను పెంచుకుందని అన్నాడు. దినేశ్ కార్తీక్ ఇప్పటివరకూ ఢిల్లీ డేర్ డెవిల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు, ముంబై ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, గుజరాత్ లయన్స్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఐపీఎల్‌లో 152 మ్యాచ్‌లు ఆడిన దినేశ్ 24.81 యావరేజ్‌తో 2,903 పరుగులు సాధించారు. కాగా, నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన దినేశ్ చివరి బాల్‌కు సిక్స్ కొట్టి భారత్‌ను గెలిపించిన విషయం తెలిసిందే.



నా బౌలింగ్ అంతు చిక్కదు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులోకి చైనామన్ బౌలర్(ఎడమచేతి మణికట్టు స్పిన్నర్)గా దూసుకొచ్చిన కుల్దీప్ యాదవ్ తన బౌలింగ్‌ను ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ ఆడటం అంత ఈజీ కాదని అంటున్నాడు. తన బౌలింగ్‌ను అంచనా వేయడం సులభం కాదని పేర్కొన్న కుల్దీప్.. వీడియోల విశ్లేషణ ద్వారా కూడా తన బౌలింగ్ అంతు చిక్కదని పేర్కొన్నాడు. 'చాలాకాలం నుంచి టెక్నాలజీ అనేది శరవేగంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. అయినా నా బౌలింగ్‌ను టెక్నాలజీ ద్వారా పట్టుకోవడం సులభం కాదు. ఒకసారి బంతిని టర్న్ చేసిన తర్వాత అది అవతలి బ్యాట్స్‌మన్‌ను ఆలోచనలో పడేస్తుంది. ఎలా ఆడాలో అప్పటి పరిస్థితిని మాత్రమే బ్యాట్స్‌మన్ డిసైడ్ చేసుకోవాలి. ఇక్కడ వీడియోల ద్వారా నా బౌలింగ్‌ను అంచనా వేయడం కష్టం. అదే నన్ను సక్సెస్ ఫుల్ స్పిన్నర్‌గా నిలిపింది. నా బౌలింగ్‌ను అంచనా వేసే క్రమంలో చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టినా.. ఏ ఒక్క విశ్లేషకుడు నా మాయాజాలపు శైలిని పట్టుకోలేరు. అది కేవలం మ్యాచ్ జరుగుతున్నపుడు బ్యాట్స్‌మన్ ఆలోచన, ఎదురుదాడిపైన మాత్రమే ఆధారపడి వుంటుంది. ఇక మ్యాచ్ పరిస్థితిని బట్టి బౌలింగ్‌ను వేయడం నాకు తెలిసిన విద్య. రెగ్యులర్ ప్రాక్టీస్‌తో నా బౌలింగ్‌కు సానబెడుతూనే ఉన్నా. అదే నన్ను వైవిధ్యమైన బౌలర్‌గా నిలిపింది' అని కుల్దీప్ పేర్కొన్నాడు.



రాజీ ప్రశ్నే లేదు : జహాన్

న్యూఢిల్లీ: భారత బౌలర్ మహమ్మద్ షమిపై భార్య హసీన్ జహాన్ మళ్లీ కొత్త ఆరోపణలు చేశారు. ఇటీవలే ఆమె.. షమి ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని అనలేదని.. కేవలం ఓ అమ్మాయి వద్ద డబ్బు తీసుకున్నాడని మాత్రమే ఆరోపించానని చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా షమికి లండన్‌కు చెందిన మహమ్మద్ భాయ్ అనే వ్యాపారి ఒకరు అమ్మాయిలను పరిచయం చేశాడంటూ ఆరోపించారు. గురువారం ఆమె మాట్లాడుతూ తన పోరాటాన్ని మధ్యలో వదిలేసే ప్రసక్తేలేదని చెప్పుకొచ్చారు. 'మా పోరాటం ఓ స్థాయికి చేరింది. ఇప్పుడిక రాజీపడే ప్రశ్నేలేదు. నేను సొంతంగా పోరాడుతున్నా. ఒకవేళ నేను ఇప్పుడు వదిలేస్తే మొత్తం మహిళా సమాజానికే ఓటమిలా భావించాలి. నేను అలా ఎందుకు చేస్తాను? నా వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయి.' అంటూ పేర్కొన్నారు. పోలీసుల రక్షణ కోరడంపై ఆమె స్పందిస్తూ షమి నుంచి ఇప్పటికీ తనకు హాని ఉందన్నారు. "షమి ఇవాళ ఉదయం ఫోన్ చేసి 'నీకు సిగ్గుగా అనిపించడం లేదా? నన్ను ఇరికించావు' అని చెప్పారు. కుమార్తెలు, తన భవిష్యత్ దృష్ట్యా ఆరోపణలన్నీ వెనక్కి తీసుకోవాలని కోరాడు." అని జహాన్ వెల్లడించింది. తన భర్తకు ఇతర మహిళలతో సంబంధాలున్నాయని, తనను చంపేందుకు ప్రయత్నించాడని, మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

400 వికెట్ల క్లబ్‌లో సువర్ట్ బ్రాడ్



ఆక్లాండ్: టెస్ట్ క్రికెట్ చరిత్రలో 400వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఇంగ్లండ్ పేస్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ స్థానం సంపాదిం చాడు. ఆక్లాండ్‌లో గురువారం న్యూజి లాండ్‌తో జరుగుతున్న తొలి డే-నైట్ టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఇంగ్లీష్ బౌలర్ కివీస్ బ్యాట్స్ మెన్ టామ్ లాథమ్ వికెట్ పడగొట్టి 400 వికెట్ల క్లబ్‌లోకి చేరాడు. దీంతో ఈ ఘనత సాధించిన రెండో ఇంగ్లండ్ బౌలర్‌గా బ్రాడ్ రికా ర్డుల్లోకి ఎక్కాడు. బ్రాడ్ కంటే ముందు ఇంగ్లండ్ తరపున పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్(525) మాత్రమే ఉన్నాడు. అంతర్జాతీయంగా చూసు కుంటే బ్రాడ్ కంటే ముందు ఈ ఘనత సాధిం చిన వారు 14మంది ఉన్నారు. టెస్ట్‌లలో శ్రీలంక మాజీ బౌలర్ ముత్తయ్య మురళీధరన్(800) అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అగ్ర స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ 708 వికెట్లతో రెండో స్థానం లో, మూడో స్థానంలో అనిల్ కుంబ్లే(619), నాలుగోస్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన గ్లేన్ మెక్‌గ్రాత్(563), ఐదో స్థానంలో ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్(525) ఉన్నాడు.

ఇంగ్లండ్ ఆరో అత్యల్ప స్కోరు...

టెస్ట్ క్రికెట్‌లో చరిత్రలో ఇంగ్లండ్ మరో చెత్త రికార్డును నమోదు చేసుకుంది. ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి డే-నైట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ జట్టు 58పరుగులకే చాప చుట్టేసింది. న్యూజిలాండ్ పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్(6/32), టిమ్ సౌథీ(4/25) దాటికి ఇంగ్లాండ్ 20.4ఓవర్లలోపే తొలి ఇన్నింగ్స్‌లో 58పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇంగ్లండ్ ఆరో అత్యల్ప స్కోరు నమోదు చేసినట్లయింది.

టీటీ ప్లేయర్‌పై లైంగికదాడి కేసు



కోల్‌కతా: ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు సౌమ్యజిత్ ఘోష్‌పై బుధవారం అత్యాచారం కేసు నమోదైంది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి సౌమ్యజిత్ మోసం చేశాడని ఓ 18 ఏళ్ల యువతి స్థానిక బారాసత్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వార్తా పత్రిక కథనం ప్రకారం... సౌమ్యజిత్ (24)కు బాధితురాలితో 2014లో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైంది. అది కాస్తా ప్రేమగా మారింది. దీంతో బాధితురాలు తరచూ కోల్‌కతాలోని సౌమ్యజిత్ ఇంటికి వెళ్లేది. ఇంట్లో సౌమ్యజిత్ తల్లిదండ్రులు లేని సమయంలో ఎన్నోసార్లు పెళ్లి చేసుకుంటానని చెబుతూ సౌమ్యజిత్ ఆమెపై అత్యాచారం చేశాడు. ఇప్పుడు ఆమె గర్భిణి. రెండు రోజుల క్రితం బాధితురాలు సౌమ్యజిత్ ఇంటికి వెళ్లి తనని వివాహం చేసుకోవాలని కోరింది. దీనికి అతడు అంగీకరించకపోవడంతో తల్లిదండ్రుల సహాయంతో స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై బాధితురాలి తండ్రి మాట్లాడుతూ... 'రెండు రోజుల క్రితం నా కూతురు వారిద్దరికీ మధ్య ఉన్న సంబంధం గురించి చెప్పింది. ఆమె గర్భిణి అనే విషయం కూడా అప్పుడే తెలిసింది. వెంటనే సౌమ్యజిత్ ఇంటికి వెళ్లి మా కూతురుని పెళ్లిచేసుకోమని వేడుకున్నాం. ఇందుకు ఆయన ససేమిరా అన్నారు. మాకు దిక్కు తోచక ఇలా పోలీసులను ఆశ్రయించాం' అని అన్నారు. ఈ విషయంపై అదనపు ఎస్పీ అభిజిత్ బెనర్జీ మాట్లాడుతూ... 'సౌమ్యజిత్‌పై మాకు ఫిర్యాదు అందింది. దీనిపై ఇప్పటికే విచారణ ప్రారంభించాం. దీనిపై ఇప్పుడే ఏం చెప్పలేం' అని తెలిపారు. అయితే ఈ విషయంపై ఇప్పటి వరకూ సౌమ్యజిత్ నోరు విప్పలేదు. ఈయన 2012, 2016లో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు. 74వ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్‌ను 19 ఏళ్లకే గెలుచుకున్నాడు. ఈ టైటిల్ గెలిచిన అతి చిన్న వయస్కుడు కూడా ఇతడే.

నేటి నుంచి తెలంగాణ ప్రీమియర్ లీగ్ సీజన్-2

హైదరాబాద్: తెలంగాణ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ పోటీలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డెక్కన్‌థండర్స్ జట్టు స్పాన్సర్ల పరిచయ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డెక్కన్ థండర్స్ జట్టు లోగోను లాంఛనంగా విడుదల చేశారు. మంజీర గ్రూపు, గ్లోబల్ ట్రీ సంస్థలు సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టామని గ్లోబల్ ట్రీ సంస్థ సంచాలకులు శుభకర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టం సమీక్షించాలి

సీపీఐ డిమాండ్

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ చట్టం కింద తక్షణం అరెస్టు చేసేందుకు ఉన్న కఠినమైన నిబంధనలను నీరుగారుస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం తక్షణం కోరవలసిందిగా సీపీఐ గురువారం డిమాండు చేసింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి పంపించవలసిందిగా కూడా ప్రభుత్వం విజ్ఞప్తి చేయాలని సీపీఐ కోరింది. ఎస్టీ (అత్యాచారాల నిరోధం) చట్టం కింద ఎస్సీ, ఎస్టీలకు పార్లమెంటు తన ఆమోదం ద్వారా కల్పించిన హక్కులను పునరుద్ధరించినట్లవుతుంది. రెండు రోజుల క్రితం చట్టాన్ని ఉల్లంఘించిన వారిని తక్షణం అరెస్టుచేసే నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అనేక సందర్భాలలో అమాయక పౌరులను నిందితులుగా పేర్కొంటున్నారని ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించడానికి ఆటంకంగా నిలుస్తుందని సుప్రీంకోర్టు భావించింది. అయితే చట్టం చేసిన పార్లమెంటు ఈ విధంగా ఏనాడూ భావించలేదు. సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్సీ, ఎస్టీ ప్రజలకు సాధికారతను కల్పించేందుకు చేసిన కృషికి కోర్టు తీర్పు పెద్ద విఘాతం అవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగం ఈ వర్గాల ప్రజలకు కల్పించిన కొన్ని హక్కులను పరిరక్షిస్తున్నారు. ఈ తీర్పు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అచేతన పరుస్తుంది. చట్టం అమలు అధికారులు ఏ చర్య తీసుకోలేరు. విధులు నిర్వహించలేని వారిని ప్రశ్నించడానికి కూడా వీలుకాదని ఆయన తన ప్రకటనలో తెలిపారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై అత్యాచారాలు పెరుగుతున్న సందర్భంలో ఈ తీర్పు వచ్చింది. అత్యంత భయంకరమైన సంఘటనలు జరుగుతున్నప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు వీటిని చూడటంలేదు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఎన్ని ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారని ఆ ప్రకటనలో రాజా ప్రశ్నించారు. ఈ వర్గాల ప్రజలకు ఇచ్చిన అన్ని హక్కులను కోర్టు తీర్పు తక్కువచేసి చూడటమేకాక హరించివేస్తున్నదని పేర్కొన్నారు.

ఏపీలో 'నైపుణ్య రథం'

జెండా ఊపి ప్రారంభించిన సీఎం

విశాలాంధ్ర-అమరావతి: ఏపీ నైపుణ్య రథంతో రాష్ట్రంలో మరింత సాంకేతిక విజ్ఞానం విస్తరిస్తుందని, గ్రామాల్లో సైతం ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి వారు మరింత శక్తిమంతులుగా మారుతారని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నూతన ప్రయోగానికి ఏపీ నాంది పలుకుతోందన్నారు. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ నైపుణ్య రథం 13 జిల్లాల్లో ఉన్న 28 స్మార్ట్ గ్రామాల్లో పరుగులు పెట్టనుందని తెలిపారు. మే లోగా మరో 12 నైపుణ్య రథాలు రానున్నాయన్నారు. సచివాల యంలో ఏపీ నైపుణ్య రథాన్ని పచ్చజెండా ఊపి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, హెచ్.పి. ఫౌండేషన్, హ్యూలెట్ ప్యాకర్డ్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, గైడ్ ఫౌండేషన్, స్కిల్ డెవలప్ మెంట్ సంయుక్త నిర్వహణలో రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య రథం పరుగులు తీయనుందన్నారు. ఎయిర్ కండీషన్డ్ సౌకర్యం కలిగిన ఈ రథంలో 28 కంప్యూటర్లు, వెనుక భాగంలో చిన్నపాటి స్క్రీన్ ఉంటుందని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ విద్యపై అవగాహన కలిగించనున్నారన్నారు. యువ తకు స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణతో పాటు స్వయం సహాయక సంఘాలకు వ్యాపార మెలకువలపై అవ గాహన కల్పించనున్నారని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించనున్నారని సీఎం తెలిపారు. కృష్ణాజిల్లాలో 4 స్మార్ట్ గ్రామాలు, మిగిలిన జిల్లాల్లో రెండు గ్రామాల చొప్పున 24 గ్రామాల్లో ఈ రథం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించనుందన్నారు. రోజూ 4గంటలు పాఠశాల విద్యార్థులకు, 3 గంటలు యువతకు, ఒక గంట ప్రజలకు అవసరమైన ఆధార్, మీ సేవ వంటి సేవలపైనా, మరో 2 గంటలు ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, వాటిని పొందడం అనే విషయాలపైనా అవగాహన కల్పించనుందని సీఎం తెలిపారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, సీఎం కార్యాలయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర, స్మార్ట్ ఏపీ ఫౌండేషన్ చైర్మన్ సి.కుటుంబరావు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.గంగయ్య, డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

కేంద్రం ఇబ్బంది పెడుతోంది : చంద్రబాబు

కేంద్రం అవిశ్వాసం చేపట్టకుండా పదేపదే వాయిదాలు వేస్తోందనీ, ఉద్దేశపూర్వకంగానే వాయిదాల పర్వం కొనసాగిస్తోందని, దీనిని ప్రజలు గమనిస్తున్నారనీ రాష్ట్రానికి న్యాయం చేయాలని కేంద్రానికి ఏ కోశానాలేదని చంద్రబాబు అన్నారు. గురువారం పార్లమెంట్ పరిణామాలపై సీఎం చంద్రబాబు పార్టీ ఎంపీలు, నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గతంలో ప్రత్యేక ఆర్థిక సహాయానికి ఎందుకు ఒప్పుకున్నాం, ఇప్పుడెందుకు హోదాయే కావాలని అడుగుతున్నాం అనేదాన్ని ప్రజలకు సవివరంగా తెలపాలని సూచించారు. ఎవరికీ హోదా ఇవ్వం అంటేనే అప్పుడు ఆర్థిక సహాయానికి తాము అంగీకరించామనీ, తరువాత కేంద్రం మాట తప్పిందనీ, హోదా రాష్ట్రాలకు 90:10 కింద నిధులు, ప్రోత్సాహకాలు కొనసాగి స్తోందని ఆయన తెలిపారు. వేరే రాష్ట్రాలకు ఇచ్చేటట్లయితే మనకూ అదేపేరుతో ఇవ్వాలనేది మన డిమాండు అనీ, దీనిపైనే ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కేంద్రం చేస్తున్న అన్యాయంపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉందనీ, అందుకే అన్ని వర్గాల మద్దతు ఉందని తెలిపారు.

పూల్‌గేమ్‌లో ధోనీ

చెన్నై: రెండేళ్ల నిషేధం తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్‌తో ఐపీఎల్‌లో తిరిగి అడుగు పెడుతోంది. వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 11వ కోసం ఇప్పటికే అన్ని జట్లు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. కానీ మిస్టర్ కూల్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మాత్రం క్రికెట్ కాకుండా వేరే ఆటలో బిజీగా ఉన్నాడు. క్రికెట్ ప్రాక్టీస్ చేయకుండా ధోనీ మాత్రం పూల్ గేమ్ ఆడుతున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తమ ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల కారణంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై రెండేళ్ల పాటు నిషేధం విధించారు. కాగా గడువుకాలం ముగియడంతో ఇరు జట్లు ఈ సీజన్‌తో బరిలోకి దిగుతున్నాయి. అయితే సీఎస్‌కే పోస్ట్ చేసిన ధోనీ ఫోటో కొంతసమయంలోనే వైరల్ అయింది. ఈ ఫోటోని చూసి ధోనీ నిజమైన ఆల్ రౌండర్ అని అతని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.